- శిల్పం - విశ్వనాథ వివేచన
- వేమన్న - బసవన్న సారూప్యత
- ఆధునిక వ్యాస రచనా శైలి - శిల్పం
- సమాచార నిధులు - భవిష్యత్ వారధులు
- జానపద కళావాద్యాలలో డప్పు ప్రాచీనత - ప్రయోజనాలు
- గొర్రెలింకా పుర్రెలూపుతూనే ఉన్నాయ్
- మహామహోపాధ్యాయ పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి
- ముచుకుందా నదీ


# మూసీ

# MUSI


Samputi : 26 • Sanchika : 03 • Pages : 64 • Rs. 20

January 2023

UGC Care List Approved Journal






వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి
సంపుటి : 26 సంచిక : 3
జనవరి - 2023
'శుభకృత్' పుష్య మాసం
**సంపాదకులు** (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

ISSN 2457-0796
UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక
చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

శిల్పం - విశ్వనాథ వివేచన ... డా. పూర్ణ ప్రజ్ఞానంద భారతి 7
పద్య మనోహరం - 38 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 10
ఉన్నదీ లేనిదీ (బందారం కథలు -14) ... డా. నందిని సిధారెడ్డి 11
కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార (2022) గ్రహీత శ్రీ వారాల ఆనంద్‌తో మూసీ ముచ్చట 15
వేమన్న బసవన్న సారూప్యత ... వేలేటి శైలజ 19
భారతీయీకరణ8 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార 23
జానకమ్మ ఇంగ్లండ్ యాత్ర (గ్రంథాంతరంగం-20) ... ఘట్టమరాజు 25
ఆధునిక వ్యాస రచనా శైలి - శిల్పం ... యెల్చాల నర్సింలు 31
సమాచార నిధులు - భవిష్యత్ వారధులు ... డా. టి. సతీష్, డా. ఎస్. చంద్రయ్య 35
బుచ్చయ్య శరణు (తెలంగాణ విస్మృత కవులు -6) .. డా. పెబ్బేటి మల్లికార్జున్ 39
ఆపద్బాంధవుడు (కె. విశ్వనాథ్ చిత్రాలు -సామాజిక అవలోకనం : 29).. టి. లక్ష్మీనారాయణ 41
జానపద కళావాద్యాలలో డప్పు ప్రాచీనత - ప్రయోజనాలు ... సునీత నీటూరి 45
గొర్రెలింకా పుర్రెలూపుతూనే ఉన్నాయ్ ... మహమ్మద్ హసన్ 51
మహామహోపాధ్యాయ, పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి ... డా. గంద్ర లక్ష్మణ రావు 53

### కవితలు

ముచుకుందా నదీ ... కీ.శే. శ్రీమాన్ ఉత్పల సత్యనారాయణాచార్య 5
తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ 6
పూలు ... బి. అంజనీ దేవి 34
జయహో!2023 ... అవధాని అవుసుల భానుప్రకాశ్ 38
నన్ను నేనే ఆవిష్కరించుకుంటూ ... డా. జీవన్స్ 62

### సమీక్షలు

డా. దేవేంద్ర 'అడుగులు' కథలు - విశ్లేషణ ... డా. గిన్నారపు ఆదినారాయణ 55
శ్రీరంగాచార్యుల స్వీయ చరిత్ర 'జీవన పర్వం' ... శివప్రియ 57
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by :* **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2023

## సంపాదకీయం



వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

# వినియోగం

ఒక ప్రత్యేకమైన పనికి కేటాయించబడటాన్ని 'నియోగం' అని అంటాం. విశిష్టంగా నియోగింపబడినదే 'వినియోగం'. సృష్టిలో ప్రతి విషయం దేనికో ఒకదానికి వినియోగింపబడిందే. పంచభూతాల నుండి మొదలుకొని సాధారణమైన చిన్న వస్తువు వరకు కూడా ఏదో ఒక ప్రత్యేకమైన పనికి కేటాయించడం జరుగుతుంది. కొన్ని కార్యక్రమాలు కొన్ని వస్తువులు, కొన్ని విషయాల వల్లనే సాధ్యమవుతాయి. ఆ యా పనుల నిర్వహణకు వినియోగపడే వస్తువుకు కూడా ప్రత్యేకత చేకూరుతుంది. కొన్ని వస్తు వ్యవహారాలు అత్యంత విలువైన అంశాలకు వినియోగ పడితే, కొన్ని అతి బలహీన అంశాలకు వినియోగ పడుతుంటాయి. వస్తువు యొక్క శక్తి, సామర్థ్యాలను అనుసరించి మాత్రమే ఈ వినియోగం ఉంటుంది. అన్ని పనులకు అన్నింటినీ సమానంగా ఎప్పుడూ వినియోగించడం జరుగదు.

మానవ శరీరాలు కూడా అనేక రకాల పనులకు వినియోగించబడుతున్నాయి. ఒక్కొక్కరు ఒక్కో కార్యక్రమాన్ని నిర్వహిస్తూ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. కొంతమంది దేహ సంబంధంగా శ్రమ పడితే, మరికొందరు వాక్కు ద్వారా, ఇంకొందరు మనస్సుతో శ్రమ పడుతున్నారు. దేహ శ్రమకు అతి తక్కువ విలువ ఉంటే, వాక్కు పరమైన శ్రమకు దానికి పై స్థాయిలో గుర్తింపు, విలువ ఉంది. అన్నింటికన్నా అధికమైనది మానసికమైన శ్రమ. దీనికి అధికమైన గుర్తింపు, విలువలు లభిస్తాయి. సమాజంలో 'స్థాయి' అనేది కూడా ఈ ఆలోచనా ధోరణి వల్లనే ఏర్పడుతుంది. దేహ సంబంధమైన శ్రమ చేస్తూ నిరంతరం శారీరకమైన కష్టాన్ని నిర్వహించడం కన్నా, మానసికమైన శ్రమ చేయడం వల్ల ఎక్కువ ఫలితం వస్తుందని అందరికీ తెలిసిన విషయమే.

శరీరంలోని అన్ని భాగాలలో, ముఖ్యంగా నర్వస్ సిస్టమ్‌లో ఏర్పడిన బ్లాక్స్ ఎంతగా తగ్గిపోయి శక్తి ప్రవాహ హేతువులుగా మారిపోతుంటే అంత ఉత్తమ కార్యాలకు ఈ శరీరం వినియోగించబడుతుంది. అన్నింటిలోనూ బ్లాక్స్ అధికంగా ఉంటే సృష్టి లేదా విశ్వ సంబంధ శక్తి ప్రసారం మనకు స్పష్టంగా తెలియదు. ఫలితం దేహ శ్రమకు వినియోగ పడాల్సి వస్తుంది. దీక్షాదుల వల్ల ప్రయత్న పూర్వకంగా బ్లాక్స్‌ను తగ్గించుకునే ప్రయత్నం చేస్తూ ఉంటే సృష్టి శక్తి అంతా శరీర శక్తిగా మానసిక శక్తిగా మారుతూ ఉంటుంది.

మన మాట ఎదుటివారు వినకపోయినా, మన భావాలకు ఎదుటివారు విలువ ఇవ్వకపోయినా, మన శరీర శ్రమపై కూడా ఆక్షేపణలు చేస్తున్నా ముందుగా మనని మనం విశ్లేషణ చేసుకోవాలి. శక్తితో నిరంతరం కలిసి ఉండే వారి మనసు, మాట, శరీరం మూడూ శక్తివంతంగానే ఉంటాయి. సమాజానికి అత్యధికంగా వినియోగ పడుతుంటాయి. అందుకే నిరంతరం మన మానసిక కర్మలో శక్తితో కలిసి ఉండడం నేర్చుకోవాలి. శక్తివంతమైన, అత్యున్నతమైన భావాలకు ప్రాధాన్యత నివ్వాలి కాని, బలహీన భావాలకు, వాక్కులకు, పనులకు కాదు. ఎదుటివారు మనని సంతోషంగా అంగీకరిస్తున్నారంటే మనకు వారికన్నా కొంత శక్తి అధికంగా ఉంది అని. శక్తి తగ్గిన వస్తువైనా, వ్యక్తి అయినా బలమైన దానిని అనుసరించాల్సిందే.

మన శరీరాలను కూడా శక్తి వినియోగించుకుంటే ఈ శరీరంతో అత్యున్నతమైన కార్యక్రమాలను నిర్వహించగలం. లోపల అన్నీ అడ్డంకులే ఉంటే అందరూ బలహీన మవుతారు. బాహ్య శరీరాన్ని స్నానం ద్వారా, అంతర శరీరాన్ని యోగాదుల ద్వారా, మనస్సును జప, ధ్యానాదుల ద్వారా శుద్ధం చేసుకుంటే, ఈ శరీరం అత్యున్నత కార్యక్రమాల నిర్వహణకు వినియోగ పడుతూనే ఉంటుంది.

# ముచుకుందా నదీ ....



ఓ కవి! ముక్కు మూసికొనుచుంటివి నాకడ నిల్చి అంతగా
నీకు నసహ్యురాలనయి నిందితనైతిని గాని నాదు మా
ధ్వీక మరంద ధారలు చవింగొని ఈ ముచుకుంద యన్న ద
న్నాకము లోనిదౌ అలకనందకు దీటనివారు పూర్వజుల్.

మొల్లపాదుల పెంచు ముచుకుందనై నేను
      దిశల కామోదమ్ము తెచ్చినాను
కాలయవనుని నుగ్గాడింప వచ్చిన
      కమలాక్షు పాదాలు కడిగినాను
మాంధాతృసుతునికి మైబడలిక తీర్చి
      ఇచ్చోట సుఖనిద్ర పుచ్చినాను
గుహనుండి కదలని నృహరికి ఏ ప్రొద్దు
      మంచి తీర్థంబు లందించినాను.
ఎందరో పూర్వ మీ ముచుకుంద దరిని
ముక్కు మూసికొని జపించి మోక్షపదవి
కరిగినట్టి మహా మునీశ్వరులు గలరు
చివరికీవును ముక్కు మూసితివి గాదె?

ఇట్టులు ముక్కు మూసికొనె దిప్పుడు అల్లదె చూడు పూర్వపుం
గట్టడ మొద్దు నానుకొని కట్టిన రాజగృహంబు నాడు నా
గట్టున నిట్టివా రెవరు కాపురమున్నది లేదు, నా జలం
బిట్టులు కల్మషం బయినదే? పుడిసెందును పూర్వమందునన్?

జోతలకు నాదు ముచుకుందనైతి, ముక్కు
మూసికొనెడి వారికి నేడు మూసినగుచు
మశక సంకుల బహ్వపస్మార ఘోర
కలుష భారా నతాంగినై కదలుచుంటి

స్వాదు తీర్థమ్ములైన పావన సరస్వ
తులము మమ్ము కుగ్రామ వస్తువుల జేసి
వరలిన పురమ్ము స్వచ్ఛ జీవనము లేక
హేయమగును దుర్గంధ భూయిష్ఠ మగును

నాకున్ జీవనమన్న ప్రాణము, ప్రశాంతంబైన నా ఒడ్డునన్
వీకన్ కాపురమున్న నాగరికులం ప్రేమించి తజ్జీవనో
ర్వీ కాలుష్యము పైన వేసికొని వేరే దూర దూరాలకున్
పోకార్పం గలదాన నిప్పటికి నిప్పున్ మాతృభావంబునన్



అమ్మెయి నా తెరుంగున ధనాఢ్యుల వంచన చేత ప్రక్క గ్రా
మమ్ముల నుండి రోజు తరుమంబడి వచ్చెడి పేదసాద వ
ర్గమ్ములు నాదు పంచలనె కాదుర! గుండెల మీదనే నివా
సమ్మొనరింప నోర్చుకొని సాగుచునుంటి సహానుభూతితోన్

కలుషహరను నేను కాలేకపోతిని
మోపదరము గాని మురికి మోసి
పురము నొక్కవంక పెరిగి పోవుచునుండ
తరగుచున్న నన్ను నెరుగ రెవరు

నాలో గోతులు త్రవ్వి కైకొనిన వెన్నంబోని నా మట్టితో
లీలన్ బొమ్మలు చేసి అమ్ముకొనువారిం జూచి గర్వించెదన్
నాలోనున్న పవిత్రతల్ భువనవంద్యంబైన రూపాలతో
దౌలన్ శంకరులై గణేశులయి రాధాకృష్ణులై నిల్వగన్

మాకు స్వచ్ఛత లేకున్న మానె గాని
స్వచ్ఛతా పూర్ణ గావలె జ్ఞానగంగ
ముక్త పంకిల గావలె భక్తియమున
నన్ను లోగొన్న జాలు కృష్ణమ్మ తల్లి.

**కీ.శే. శ్రీమాన్ ఉత్పల సత్యనారాయణాచార్య**

**('పాతబస్తీ విలాసము' కావ్యం నుండి)**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2023

# బి.ఎన్.శాస్త్రి పురస్కారం....
# డా. గుంజి వెంకటరత్నం గారికి

శ్రీ బి.ఎన్.శాస్త్రి గారి జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం వారి పేరుమీదుగా అవార్డును ప్రదానం చేయడం జరుగుతుంది. ఈ అవార్డును వేద సంస్కృతి పరిషత్, 'మూసీ' మాస పత్రిక, మూసీ సాహిత్య ధార సంయుక్త ఆధ్వర్యంలో ఇవ్వబడుతుంది. ఈ అవార్డులను తెలుగు సాహిత్యం, భాష, చరిత్ర, శాసనాలపై ప్రత్యేక కృషి చేస్తున్న వారిని ఎంపిక చేస్తున్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం ఆచార్య గుంజి వెంకటరత్నం గారికి ఎంచుకోవడం జరిగింది. వీరు బి.ఎన్.శాస్త్రిగారి మార్గంలో విజ్ఞానసర్వస్వాలపై విశేషమైన కృషిచేసారు. వీరు వెలువరించిన **'మహాభారత విజ్ఞాన సర్వసం', 'హంస వింశతి – విజ్ఞాన సర్వస్వం'** వంటివి ఎందరికో ఉపయోగకరంగా ఉన్నాయి. అవన్నీ కొన్ని సంస్థలు చేయవల్సిన వాటిని ఒంటి చేతిమీద చేయడం, అందులో 86 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పటికి ఇప్పటికీ నిర్విరామంగా కృషిచేయడం గౌరవించదగ్గ అంశం. ఇంతటి మహనీయునికి ఈ సంవత్సర పురస్కారంతో సత్కరించుకోవడం ఆనందదాయకం. ప్రతి సంవత్సరం వేద సంస్కృతి పరిషత్, మూసీ మాస పత్రిక ఆధ్వర్యంలో పురస్కార గ్రహీతకు 25 వేల రూపాయలతో సత్కరిస్తున్న విషయం అందరికీ తెలిసినదే.

ఈ ఈ అవార్డు ప్రదాన సదస్సు డిసెంబర్ 10, 2022న ఉస్మానియా విశ్వవిద్యాలయం 'సురభారతి' వేదికగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ సదస్సుకు ప్రముఖ సాహితీవేత్త డా. శ్రీరంగాచార్య గారు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు డా. కె.వి.రమణాచార్య, ప్రధానవక్తగా శ్రీ గన్నమరాజు గిరిజామనోహర్‌బాబు గార్లు వేదికను అలంకరించారు. ఇందులో శ్రీరంగాచార్య గారు అధ్యక్షోపన్యాసం చేస్తూ బి.ఎన్.శాస్త్రి గారితో వారికున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సంవత్సరం గుంజి వెంకట రత్నానికి ఎంపిక చేయడం చాలా గొప్పగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేసారు. అనంతరం మూసీ ప్రధాన సంపాదకులు ఆచార్య సాగి కమలాకర శర్మగారు బి.ఎన్.శాస్త్రి గారి లక్ష్యాలు ఏ విధంగా ముందుకు సాగుతున్నాయో వివరించారు. వారు ప్రారంభించిన పత్రిక, వారు నిర్మాణం ప్రారంభించిన త్రిశక్తి దేవాలయాల గురించి ప్రస్తావిస్తూ ఈ అవార్డును ఇదివరకు ఎవరెవరికీ ఇచ్చారో ఒకసారి గుర్తుచేసారు. ప్రధాన వక్తగా విచ్చేసిన గన్నమరాజు గిరిజామనోహర్ బాబుగారు అటు బి.ఎన్. శాస్త్రిగారిని, ఇటు గుంజి వెంకటరత్నం గారిని కూలంకషంగా పరిచయం చేసారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి వారితో బి.ఎన్.శాస్త్రికి గల ప్రత్యేక అనుబంధాన్ని, మూసీపై వారికున్న అభిమానాన్ని, ప్రేమను వ్యక్తం చేసారు. అనంతరం అవార్డు స్వీకర్త డా. గుంజి వెంకటరత్నం ప్రసంగిస్తూ ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేసారు. దానితో పాటు వారు ఎదిగిన క్రమం, వారు ఈ సర్వస్వాల కోసం శ్రమించిన విధానాలను గురించి జనరంజకంగా ప్రసంగించారు. ఈ సమావేశానికి సమన్వయ కర్తగా ఉన్న డా. అట్టెం దత్తయ్య ఆహ్వానం పలకగా, డా. మంత్రి శ్రీనివాస్ వందన సమర్పణతో విజయవంతంగా ముగిసింది. ఈ సమావేశానికి ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, సాహిత్య ప్రియులు, విద్యార్థులు చరిత్ర పరిశోధకులు బి.ఎన్.శాస్త్రి కుటుంబ సభ్యులందరు పాల్గొనడం మరింత ఆనంద దాయకం. (కొన్ని ఛాయాచిత్రాలు లోపలి పేజీల్లో)

## తుకారాం అభంగం

పండరీ శ్రీపురి నివాస
ఉంచు నామీద ధ్యాస
హృదయ భాండమందు నింపు
నిండు కుండ నీదు ప్రేమ

వస్తి దాత నీ ద్వారము
వేడుకుంటి నిదే ఇవ్వు వరము
ఇచ్చి తీర్చిదిద్ది నన్ను
నిలుపు భక్త జనుల త్రోవ

పండరీ శ్రీపురి నివాస
ఉంచు నామీద ధ్యాస...

సకల జనుల సేవలోన
సాధు జనుల నీడలోన
వరలు భాగ్యమదే భాగ్యం
అదే నాకు శ్రీరామరాజ్యం

పండరీ శ్రీపురి నివాస
ఉంచు నామీద ధ్యాస...

తుకా ప్రాణి సేవలోన
తరియించు తన్మయాన
దేవా విఠల నీదు ప్రేమ
నింపి ఒంపు నామీద




అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3 7 హైదరాబాద్ జనవరి : 2023

# శిల్పం – విశ్వనాథ వివేచన

డా. పూర్ణ ప్రజ్ఞాభారతి (కె. చంద్రశేఖర రావు), ఫోన్ : 934 780 6246

ఆంగ్లంలో Style is the man అనే సూక్తి ఉన్నది. అంటే వ్యక్తి వ్యక్తికి ఒక ప్రత్యేక ధోరణి ఉంటుంది. ఒక కవి లేదా రచయితకు ఒక ప్రత్యేకశైలి ఉన్నట్లే, ప్రతి ప్రక్రియకు ఒక శిల్ప విధాన ముంటుంది. శిల్పదృష్టి ఉన్న రచనలే సార్థకాలౌతాయి.

తెలుగు సాహిత్య విమర్శలో శిల్పం అన్నదానికి విశిష్టార్థాన్ని కల్పించినవారు విశ్వనాథ సత్యనారాయణ. కట్టమంచి రామలింగారెడ్డి తమ కవిత్వతత్త్వ విచారంలో ఈ శిల్పశబ్దాన్ని **"గద్యపద్యములను శిల్పమునకుం జేరినవే"** (కవిత్వతత్త్వ విచారము, పు.13) అని పేర్కొన్నా, అది కేవలం కళ అనే అభిప్రాయంలో వాడారు. విశ్వనాథ కూడా ఇదే అర్థంలో **"శిల్పమునకొక దుర్వ్యాఖ్యానము బయలు దేరినది, శిల్పము కొరకే శిల్పము"** (వేయి పడగలు. పు484) అంటూ శిల్పాన్ని కళగా భావించారు.

అయితే విశ్వనాథ దృష్టిలో శిల్పశబ్దానికి ఇదమిత్థమైన అర్థం లేదు. ఈ విషయాన్ని **"శిల్పశబ్దము సునిర్దిష్టార్థము కాదు"** (అల్లసాని వాని అల్లిక జిగబిగి, పు. 3) అని వ్యక్తీకరించారు. దీనికి శారదా తనయుని **"ఒకే పదార్థమునకు వాఙ్మనః కర్మలచేత నానా రూప ప్రకల్పనము శిల్పము"** (ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ–సంప్రదాయక రీతి. పుట 221) అన్నది ఆధారం. శారదాతనయునికి పూర్వమున్న ఆచార్యులు శిల్పాన్ని రచనా కౌశలంగా, రచనా నైపుణ్యంగా భావించారే తప్ప దానిని విడిగా నిర్వచించే ప్రయత్నం చేయలేదు.

అలంకార శాస్త్రం కావ్యవిషయికంగా చెప్పిన కొన్ని అంశాలను విశ్వనాథ శిల్పం అన్న శబ్ద పరిధిలోకి తెచ్చారు. అలా శిల్పశబ్ద పరిధిలోకి తెచ్చిన లక్షణాలకు సూచ్యార్థ సూచనం, గండం మొదలైన కొన్ని ప్రత్యేక పేర్లున్నాయి. ఇట్టివాటిని కావ్యాల్లో ప్రయోగించ వచ్చునని విశ్వనాథ **"మహాకవి తాను స్వీకరించిన వస్తువునకు పరమోచితములైన తత్తన్మహా విషయములందలి సామాగ్రి సంపాదనము చేసి తన కావ్యము పరమశిల్ప భాండముగా చేయును, ఈ కావ్యసౌందర్యమధికముగా భాసించుట తత్తద్భిన్న విషయ సంగ్రహణము చేతనగును. అప్పుడది శిల్పము అనవచ్చునేమో?"** (అల్లసాని వాని అల్లిక జిగబిగి, పుట. 4) అంటూ పేర్కొన్నారు.

ఇది కొంత అనిర్దిష్టంగా కనిపిస్తున్నది. అయితే ఇందులో కొన్ని విషయాలు ఇమిడి ఉన్నాయి. అవి 1. కవి స్వీకరించిన వస్తువుకు బాగా తగి ఉన్న విషయాల్లోని సామాగ్రిని సంపాదించి కావ్యంలో సర్ది పుచ్చడం. 2. అలా గ్రథితం చేయబడిన భిన్న విషయాలవల్ల కావ్యసౌందర్యం ఇనుమడించడం.



ఈ రెంటిని గమనిస్తే రెండవ అంశంలో కావ్యప్రయోజనం శిల్పంద్వారా సిద్ధిస్తుందని తెలుస్తుంది. మొదటి అంశంలో కావ్యప్రయోగ విషయాలను ఏకత్రితం చేయడం కూడా శిల్పమేనని తెలుస్తుంది. మొదట అనిర్దిష్టంగా శిల్పాన్ని వివరించిన విశ్వనాథ తరువాత తరువాత మరింత స్పష్టతను చూపారు. **"శిల్పము రెండు లక్షణములు కలదని పూర్వము చెప్పితిని. ఇది రెండవ లక్షణమని చెప్పితిని. అనగా కావ్య నిర్మాణ కౌశలముచేత నొక విలక్షణమైన శిల్పము సంపాదించుటచేత కావ్యమునందేక వాక్యత కలిగించును. ఇది ఇచ్చట శిల్పలక్షణము"** (అల్లసాని వాని అల్లిక జిగబిగి, పుట. 4) అన్న వీరి అభిప్రాయానుసారం కవి తన కావ్యంలో తన రచనా కౌశల్యంతో ఏక వాక్యతను సాధించడం శిల్పమని తెలుస్తున్నది.

ఇంతేగాక **"శిల్పమనగా నొకమాటలో చెప్పినచో బహ్వర్థములు ఏకత్ర సమావేశ పరిచి, పఠితయొక్క మనస్సును భావనామయంచేసి ఉత్పథము నందు సంచరింపచేయుట. ఈ బహ్వర్థములు ఈవిధంగా సంధానపరచవచ్చును. అది కవియొక్క నిపుణత్వము మీద ఆధార పడును"** (పైదే) అంటారు. అంటే పఠిత మనస్సును భావనామయం చేస్తూ ఉత్పథంలో సంచరింప చేసేటట్లుగా అనేకార్థాలను ఒక్కచోట సమావేశ పరచడం శిల్పమని విశ్వనాథ భావించినట్లు తెలుస్తుంది.



విశ్వనాథ ఇదే వ్యాసంలో **"బహ్వర్థములు, బహుభావములు నేకత్ర సమయోజన చేసి పఠితబుద్ధి నొరిపిడి పెట్టుట శిల్ప లక్షణము"** (పైదే, పు. 15) అని మరోచోట వివరించారు. అంతేగాక **"ఒక కథ ఒక పద్ధతిగా జరుగుటకు హేతు నిరూపణము శిల్పములోని భాగము"** (పైదే, పు. 16) అని కూడా వివరించారు.

శిల్పం విషయంలో విశ్వనాథ పై అభిప్రాయాలను గమనిస్తే కావ్యనిర్మాణ కౌశలంచేత కావ్యంలో ఏకవాక్యత సాధించడం, అనేకార్థాలను, అనేక భావాలను ఒకే చోట సమయోజన చేసి, పఠిత మనస్సును భావనామయం చేసి ఉత్పథంలో విహరింపచేయడం, పఠిత బుద్ధికి ఒరిపిడి పెట్టడం, కథ జరుగడానికి గల హేతువును నిరూపించడం అనేవి శిల్పంలోని భాగాలని మనం గ్రహించవచ్చు.

ఈ పై లక్షణాలనే కాకుండా విశ్వనాథ **"పద్య రచనాది శక్తి లేనిచో కావ్యమే లేదు, కాని కావ్యగ్రథన కౌశలమే చివరి మెట్టు.... ఈ కావ్య గ్రథన కౌశలము కవియొక్క బుద్ధికి సంబంధించినది. పద్య రచనలు వాని కవితాశక్తికి సంబంధించినవి"** (పైదే, పు.17) అని చెప్పారు. కవితాశక్తిని, కావ్య నిర్మాణాన్ని రెండూ విడివిడి అంశాలుగా ప్రతిపాదిస్తూ హృదయాన్ని, బుద్ధిని సమన్వయ పరిచి చూపునదే కావ్యనిర్మాణమని వారు తలుస్తున్నారు.

విశ్వనాథ దృష్టిలో కవితాశక్తి బౌద్ధికం కాదు. కావ్యగ్రథన కౌశలం బౌద్ధికం. ఈ గ్రథన కౌశలం ఉన్నపుడే కవితాశక్తికి అధిక విలువ కలుగుతుందని వీరి భావం. ఈ గ్రథన కౌశలం నైసర్గికం కాదు. దానిని బయటినుంచి తెచ్చుకోవలసిందే. ఈ రెంటికి ఉన్న భేదాన్ని వివరిస్తూ ఆయన **"గ్రథన కౌశలము కవియొక్క శక్తికి బాహ్యమైనదని అనవచ్చును. వివేక సంయోగములేని కావ్యము కావ్యముగా పరిణమించదు. అట్లే మహాకావ్య పరిజ్ఞానము లేని తత్పరిజ్ఞానము వెలయించనేరని కావ్యము కావ్యముకాదు. ఈ పరిజ్ఞానాశయము భాసించిన కొలది మహాకావ్యమగును. అతడు మహాకవి యగును. ఇందు విప్రతిపత్తి లేదు"** (పైదే, పు.17) అని అంటారు.

గ్రథన కౌశలం అంటేనే శిల్పం. కేవలం ప్రతిభా జనితమైన శక్తి వ్యక్తిని మహాకవి చేయదు. అందుకుగాను కావ్యవిద్యను బాగా సాధించుకోవాలి. పూర్వాచార్యుల, పూర్వమహాకవుల కావ్యరచనా ధోరణిని బాగా అధ్యయనం చెయ్యాలి. ఈవిధమైన మహాకావ్య పరిజ్ఞానం కలిగితే ఆ రచయిత రచించే కావ్యం ఆతని పరిజ్ఞానాన్ని వెల్లడిస్తుంది. ఏ కావ్యమైనా కవితాశక్తితో పాటు శిల్పంతో కూడి ఉంటేనే మహాకావ్యమౌతుందని ఆయన భావించినట్లు తెలుస్తుంది.

అయితే నైసర్గికంగా ఉన్న కవితాశక్తి ఒక్కొక్కసారి కావ్యశిల్పానికి బాధకమౌతుంది. శిల్పసౌష్టవాన్ని దెబ్బతీస్తుంది. ఏ ఖండికకు ఆ ఖండిక లేదా ఏ పద్యానికి ఆ పద్యం అక్షర రమ్యతవంటి ప్రసాద లక్షణాల చేత మధురంగా ఉండవచ్చు. అది ఒక ఎత్తైతే ఆ రచన కావ్యగత శిల్పానికి తగిన విధంగా ఉండడం మరొక ఎత్తు. కావ్యపు ఏకవాక్యతకు ఇలాంటి రచన అడ్డు పడకూడదు. **"మధుర పద్యరచనానుబంధి వాక్ వ్యవహార మూలహేతుక విశిష్ట జీవలక్షణము కలవారి రచన ప్రజాదరణ పొందును. అతని రచనలో శిల్పము లేకున్నను ప్రజారంజనము బడయును"** (పైదే పు 40) అన్న విశ్వనాథ అభిప్రాయానుసారం ఒక్కొక్కసారి విశిష్ట జీవలక్షణం, శైలి వేర్వేరని తెలుస్తుంది.

విశ్వనాథ పద్యరచనాశిల్పం, కథాకథనశిల్పం అనే రెండు శిల్పశైలుల గురించి వివరించారు. కథాగమనంలో సన్నివేశానికి తగిన వృత్తాలను ఎంచుకోవడం, సమాస సంయోజన, భాషా ప్రయోగం వంటివి పద్యరచనాశిల్పం కాగా, మహాకావ్యానికే గాక ఇతర ప్రక్రియలకు సైతం వర్తించేది కథాకథన శిల్పం.

**"ప్రౌఢులైన కవులు పలు రహస్యాలను కథగా చెప్పుచు వినిపింతురు. ఇట్టి రహస్యాలను కథ చదువుచు పాఠకుడనుసరించి నచో విస్పష్టత ఎక్కువ కలుగదు"** (పైదే పు 52) అంటారు విశ్వనాథ. ఈవిధంగా పలు రహస్యాలను కథలో ఇమిడించడమే కథాకథనం.

**శిల్పంలోని ముఖ్యాంశం**

**"ఈ కథాకథన శిల్పమన్నమాట కొంతవరకు కొత్తది....కథ చెప్పుటలో నొక శిల్పమున్నదని గుర్తించినవారి సంఖ్యయే తక్కువని చెప్పవచ్చును"** (పైదే, ప. 90) అని వారు పేర్కొనడాన్ని బట్టిచూస్తే శిల్పవివేచనం చేయగల పాఠకుల సంఖ్య తక్కువని తెలుస్తుంది. ఈ కారణంచేతనే విశ్వనాథ చాలామందికి అవగతం కాలేదని భావించవచ్చు. పాఠకుల్లోని శిల్పవివేచన చేయలేని శక్తే విశ్వనాథను పాషాణపాకప్రభువును చేసిందని భావించడం అతిశయోక్తి కాదని నా భావన.

కథాకథనంలో కొన్ని మెలికలు పెట్టడాన్ని, ఆ మెలికలు ఔచితీవంతంగా ఉంటే దానిని శిల్పంగా అంగీకరించవచ్చని విశ్వనాథ అభిప్రాయపడ్డారు. అయితే ఆ మెలికలు కథలోని సులభగ్రాహ్యతకు అవరోధకాలైతే అది శిల్పసౌష్టవానికి భంగకారణమౌతుంది. కథలోని మెలికలు కూడా ప్రసన్నతను కలిగిస్తూ ఏకార్థాన్ని పోషించడమే శిల్పమని విశ్వనాథ భావించారు.

శిల్ప ప్రయోజనాన్ని వివరిస్తూ విశ్వనాథ **"జీవితము శిల్పము వంటిది. ప్రయోజన రహితముగా నేదియును ఉండదు. శిల్పమునకొక దుర్వ్యాఖ్యానము బయలుదేరినది. శిల్పము కొఱకే శిల్పమని, మతములలో నాస్తిక మతమెటువంటిదో శిల్ప సిద్ధాంతములలో నీ సిద్ధాంత మట్టిది. ఈ జగత్తిట్లే ఉన్నది."** (వేయిపడగలు, పు. 484) అంటారు. శిల్పం శిల్పం కొరకే, కళ కళకొరకే అనే దానికి విశ్వనాథ వ్యతిరేకని ఈ వాక్యంవల్ల తెలుస్తుంది.

కావ్య ప్రయోజనాన్ని పూర్తిగా రాబట్టడమే శిల్ప ప్రయోజనం. కావ్యంలోని కథ ఒక పరమార్థాన్ని బోధించాలి. అలా చేయడమే శిల్ప ప్రయోజనం. కథాగతంగా ఉన్న వస్తువు ఈ శిల్ప ప్రయోజనపు లక్ష్యం కారణంగా ధ్వంసం కాగూడదు. కవికి ఉన్న ప్రతిభకు కథాకథన కౌశలం, నేర్పు కలిస్తే ఆ రచనశిల్పంగా రూపుదిద్దు కుంటుందని విశ్వనాథ భావించారు.

ప్రతిభ రచనను ప్రయోజనవంతంగా తీర్చిదిద్దేది శిల్పం. ప్రతిభ ఔచిత్యాన్ని భంగపరిచేలా విస్తృతి పొందుతున్నపుడు దాన్ని నియంత్రించి ప్రతిభ అదుపు తప్పకుండా చేసేది శిల్పం. అందుకే విశ్వనాథ **"భారతీయ శిల్పము భారతజాతిమత ధర్మము వలెనే ఇంద్రియముల నదుపులో పెట్టి, సంఘమర్యాదల ననుసరించి నడువవలెనన్నట్లు, భావోద్రేకములను నియమించి తదంతర్గాఢత్వ మును ప్రకటించుచు బహిరున్మత్త విస్తృతిని నియమించి చెప్పును."** (ఆంధ్ర సాహిత్య విమర్శ- ఆంగ్ల ప్రభావము, పుట. 208) అంటారు.

విశ్వనాథ దృష్టిలో కావ్యమంటేనే **"శిల్పముతో కూడినది, శిల్పశక్తి తగ్గిన ఏ కావ్యమైనను పరిగ్రాహ్యమే యగును. శిల్పమక్షరము నుండి కావ్య మహార్థాంతమనుస్యూతమైన విషయము"** (పైదే).

ఈ విధంగా విశ్వనాథ శిల్ప సిద్ధాంతానికి కొత్త అర్థాలను సంతరించారు. ఏకార్థత, ఔచిత్యం, వస్తునిర్దేశం, బహ్వర్థాలను ఒకచోట సంయోజించడం, విషయ సామాగ్రిని సంపాదన చేయడం, పరితలను భావనామయులుగా చేసి వారిని ఉత్పథంలో విహరింప చేయడం, కథాహేతువును నిరూపించడం అనేవి విశ్వనాథ శిల్పంగా భావించిన అంశాలని మనం గ్రహించవచ్చు.

**ఉపయుక్త గ్రంథసూచి**

రామలింగారెడ్డి, కట్టమంచి - కవిత్వతత్త్వ విచారము, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, విశాఖపట్టణం, 1980

సత్యనారాయణ, విశ్వనాథ - వేయిపడగలు, విశ్వనాథ పబ్లికేషన్స్, విజయవాడ, 2004

సత్యనారాయణ, విశ్వనాథ - అల్లసానివాని అల్లిక జిగిబిగి, వి.యస్.యన్. అండ్ కో, విజయవాడ

సత్యనారాయణ, విశ్వనాథ - వేయిపడగలు, విశ్వనాథ పబ్లికేషన్స్, విజయవాడ, 2004

సుబ్రహ్మణ్యం, జి.వి. - ఆంధ్ర సాహిత్య విమర్శ - ఆంగ్ల ప్రభావం, జి.వి.యస్ సాహిత్యపీఠం, హైదరాబాదు. 1985.

# మూసీ సాహిత్య ధార ... లక్ష్య సాధన దిశగా .... ప్రసంగం.... శ్రీ ఆకెళ్ళ రాఘవేంద్ర గారిచే....



మూసీ సాహిత్య ధార (నిరంతర పరిశోధన ప్రవంతి)లో భాగంగా 24.12.2022 శనివారం నాడు జూనియర్ తెలుగు లెక్చరర్స్ ఉద్యోగాల కోసం సన్నద్ధమౌతున్న వారికోసం ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించడం జరిగింది. ఆ ఉద్యోగాలకు ఎలా చదవాలి, ఏమి చదవాలి? అనే అంశాలపై 'లక్ష్య సాధన దిశగా....' అనే శీర్షికతో తెలుగు పోటీ పరీక్షల నిపుణులు శ్రీ ఆకెళ్ళరాఘవేంద్ర గారు ప్రసంగించారు. సాధారణ అధ్యయనానికి, పోటీ పరీక్షల అధ్యయానికి ఉండే మార్పులను సూచిస్తూ, చదువవదగిన గ్రంథాలను తెలియజూస్తూ అపురూపమైన విశేషాలతో, ప్రేరణాత్మక ఉపన్యాసంతో అంతర్జాలం ద్వారా అభ్యర్థులను ఉద్యోగ సన్నద్ధులను చేసేందుకు మార్గ నిర్దేశం చేసారు. సుమారు గంట వరకు సాగిన ఈ ప్రసంగానికి వందకు పైగా విద్యార్థులు హాజరై స్ఫూర్తిని పొందినారు.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2023

# పద్యమనోహరం - 38

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448

**పర ధర్మానుగమైన కాంక్షలకు త్రోవల్ జూచుకోనెంచు ము**
**ష్కర భావాళికి కళ్ళెముల్ మెలపి శిక్షన్ జూపి విజ్ఞాన సుం**
**దర గీతామృత వాహినిన్ విజయమంత్రమ్మున్ రణోర్విన్ జగ**
**ద్గురువై బోధన జేయవే నరసఖా! గోపాల! ధర్మాకృతీ !**

"సర్వం కృష్ణమయం జగత్" అని లోకమంతా ఆ పరమాత్ముడైన కృష్ణుని జగన్నాథత్వాన్ని కీర్తిస్తూ ఉంటుంది. ఆ తత్త్వంలోని ఆంతర్యాన్ని విశదపరుస్తున్న ఈ పద్యం ప్రముఖ కవి శ్రీ బులుసు వెంకటేశ్వర్లుగారు రచించిన 'నీల మోహనం' అనే ఖండకావ్యంలోనిది.

కవి శ్రీకృష్ణుణ్ణి ప్రార్థిస్తూ **"మూర్తీభవించిన ధర్మరూపునివైన ఓ నరసఖా! గోపాలా! పరధర్మానుయాయులై ముష్కర భావనలకు దాసులై పోతున్న వాళ్ళకు నీ గీతా బోధ ద్వారా జ్ఞానామృత ప్రవాహాన్ని పారించి, విజయ మంత్రాన్ని జోడింపజేసే బోధను చేయాలని"** వేడుకున్నాడు.

కావ్యమంతా శ్రీకృష్ణతత్త్వ ప్రాముఖ్యాన్ని తన్మయత్వంతో వర్ణించిన తీరు కావ్యాన్ని కృష్ణపరిమళ భరితం చేసింది. ప్రతి పద్యంలోనూ పరిమళించిన భగవత్సంస్కార గంధం చదివిన ప్రతి పాఠకునిలో ఆత్మక్షాళనకు కారణమవుతున్నది. ఇది కవిలోని సంస్కారానికి ప్రతీకగా నిలుస్తుంది. సనాతన భారతీయ ధర్మం మానవ పురోగతికి భగవచ్చైతన్యమే మూలమన్న భావనను బోధిస్తున్నది. ఆ నేపథ్యం జాతి చరిత్రకు గొప్ప ఔన్నత్యాన్ని తెచ్చి పెట్టింది. బులుసు వారు స్వామి తత్త్వబోధనలకు, స్వామి లీలలకు మార్దవాన్ని జోడించి ఆ ప్రేమమూర్తిలోని ప్రేమతత్త్వాన్ని సాంస్కృతిక భావ నేపథ్యం ధ్వనించే రీతిలో చేసిన పద్యరచన ఉత్తమోత్తమ కావ్యస్థాయి నీల మోహనానికి సిద్ధింపజేసింది.














ఈ పద్యం నేటి సమాజానికి ఎన్నెన్నో సంస్కారాలను నేర్పిస్తుంది. ఈనాటి యువతరం మూర్ఖంగా, గుడ్డిగా వైదేశిక సంస్కృతినీ, విదేశీయ ధర్మాన్ని అనుసరిస్తూ తమ స్వధర్మాన్ని విస్మరిస్తున్న సందర్భం. ఈ విషయాన్ని గీతాబోధ నేపథ్యంతో చెప్పిన తీరు కొత్తతరాన్ని కళ్ళు తెరిపించే విధంగా పద్యం సాగింది. ఎప్పుడైనా మనది కాని ధర్మం కాని, మనవి కాని భావాలు కాని, మన సంస్కృతికి, మన జీవన విధానానికి సరిపడని ఆలోచనలు కాని "ముష్కర భావాళి"యేనన్న సత్యాన్ని పద్యం బోధిస్తూ ఉంది. అందుకే అటువంటి భావాల వెంట పడే వారిని భగవంతుడే శిక్షిస్తాడన్న సత్యాన్ని కవి గీతాబోధ రూపంలో వ్యక్తం చెయ్యడం ఇందులో విశేషం.

శ్రీకృష్ణ పరమాత్ముణ్ణి "నరసఖా" అని సంబోధించడం కూడా ఎంతో విశేషమైంది. శ్రీకృష్ణుడు కేవలం అర్జునుని సఖుడే కావచ్చు కాని ఆయన యావద్విశ్వంలోని నరులకు మిత్రుడే. మంచిని, సంస్కారాన్ని నేర్పే శాస్త్రం భగవద్గీత. శ్రీకృష్ణుడు గీతాచార్యుడు. ఆయన నరసఖుడు. పైగా మానవుల మంచిని కోరేవారెవరైనా ధర్మాకృతులేనన్న విషయం కూడా పద్యం చివరి సంబోధన తెలుపుతూ ఉంది.

పద్యం ధార ఎంతో ప్రశస్తం, శబ్ద ప్రయోగంలో విశేషమైన ప్రతిభ, ఔచిత్యాలు, ప్రతి పద్యమూ జ్ఞాన సముపార్జనకు భాండాగారంగా నిలిచే కావ్యం నీల మోహనం.

బందారం కథలు – 14

# ఉన్నదీ లేనిదీ...

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148



చంటి పిల్లాడు గుక్క తిప్పుకోకుండా ఏడుస్తున్నాడు. ఏడుపు వినిపిస్తున్నా పట్టించుకోకుండా వాకిట్లో సాన్పు చల్లుతున్నది గౌరవ్వ. అప్పటికే ఆలస్యమైపోయింది. పొద్దెక్కిపోతున్నది. పొరుగువాళ్ళు వాకిళ్లు పూర్తి చేసుకొని పొయ్యి దగ్గర వంటపనులు చేసుకుంటున్నారు. పిల్లాడి దగ్గర కూచుంటే గౌరవ్వకు సగవెట్టేవాళ్లెవ్వరూ లేరు. అయినా, పిల్లాడి ఏడుపు గమనించి పాలిచ్చింది. పడుకోబెట్టాలని చూసింది. ఎంతకూ ఏడుపు మానుకోలేదు. ఎక్కడి పనులు అక్కడే ఉండి పోతున్నాయని చంటి పిల్లాడిని చాపమీద పడుకోబెట్టింది. ఏడుపు మానుకోకపోయినా పనులు ఆగవు గదా. 'ఎండెక్కితే చేను పనికి ఆల్శమైందని' మొగడు గుర్రుమంటాడు. 'ఒంటి సంసారంల చంటిపిల్ల తల్లికి చావే' అనుకున్నది గౌరవ్వ. ఇటు చంటోడు. అటు వంటపని, ఇల్లు పని. అటెనుక సేను పని. బాయిపని. మూడు దిక్కుల చూసుకొనేసరికి ముక్కులోకి వస్తున్నది.

సాన్పు పూర్తయిందనిపించుకొనే సరికి చంటోని ఏడుపు ఆగిపోయింది. గౌరవ్వకు భయమైంది. పిలగానికేమైనా తను తట్టుకోలేదు. ఏమన్న అయితే మీదికెల్లి మగని తిట్లు. ఏడుపు వినిపించకపోయేసరికి ఆగమాగంగా వచ్చి చూసింది. ఏడ్చి ఏడ్చి చంటోడు ఊపిరి బిగపట్టాడు. ఏమాయెనో అని తనకు ఏడుపొచ్చింది. ఎత్తుకొని అటూ ఇటూ తిప్పింది. వీపులో తట్టింది. ఊపిరి వదిలి మళ్లా ఏడుపు అందుకొంటూనే ఊపిరి పీల్చుకున్నది గౌరవ్వ. ప్రాణం పోయి వచ్చినంత పనయింది. అట్లే చంటోన్ని భుజానేసుకొని కౌసల్య దగ్గరికురికింది. తనకు ఆమే పెద్ద దిక్కు. చెప్పగానే గాబరా పడింది కౌసల్య. లోపలికి వెళ్ళి చిన్న పావులో ఆముదం పోసుకొని వచ్చింది. "ఇగో ఈ పావు పట్టుకొని పాపయ్య సావుకారి దగ్గరికిపో. ఆయనె మంత్రమేసి ఇస్తడు. ఉగ్గుల కలిపి తినిపించు. ఆల్శెం జెయ్యకు" అని పావు గౌరవ్వకిచ్చింది.

గౌరవ్వ పిల్లగాన్నెత్తుకొని పావు పట్టుకొని పాపయ్య సావుకారి దగ్గరికి వచ్చింది. పాపయ్య పూజ చేసుకొంటున్నాడు. చంటిపిల్లగాని ఏడుపు వినగానే పూజ చేసుకొంటూనే భార్యకు సైగ చేశాడు. సత్తెవ్వ బయటికొచ్చి చూసింది. పిల్లవాడు ఏడుపు ఆపటంలేదు. సత్తెవ్వ ఎత్తుకొని చూసింది. ఆడించబోయింది. ఊకుంచటానికి ప్రయత్నించింది. పిల్లవాడు మరింత బిగ్గరగా ఏడుస్తున్నాడు. సత్తెవ్వకు పిల్లల్లేరు. చిన్నపిల్లలంటే ప్రాణం. ఊకుంచుతూ ఊకుంచుతుంటే సత్తెవ్వకు సుత ఏడుపొచ్చింది. 'సావుకార్ని పిలువవ్వ' అన్నది గౌరవ్వ.

పూజమీంచి లేచి వచ్చాడు పాపయ్య. దేవుడికి పెట్టిన పువ్వు తీసుకొచ్చి చంటోనికి ఇవ్వబోయాడు. పిలగాడు ఏడు పాపలేదు. గౌరవ్వ ఎత్తుకున్నది. పావు ఎత్తి పట్టుకున్నది. మంత్రం చదువుతూ మధ్యన పిల్లవాడి తలనుంచి కాలిదాకా సోకేటట్టు 'ఉఫ్'మని గాలి ఊదాడు. పై నుంచి కింది దాకా మళ్లా ఊదాడు. గాలి తగులుతుంటే పిలగాడు ఏడుపు మానాడు. తదేకంగా చూడసాగాడు. మళ్లీ మంత్రం చదివాడు. మళ్ళా మూడుసార్లు ఊదాడు. మూడుసార్లు ఆముదం పావుకు మంత్రం వేస్తూ పిలగాని మీదికి గాలి ఊదాడు. "ఉగ్గు, పాలు కలిపి అండ్ల ఆందెం కూడా కలిపి మెల్లగ తినపెట్టు. సాయంత్రం మల్లొచ్చి మంత్రం వేయించుకపో. మూడు పూటలు పడాలె" పాపయ్య గౌరవ్వకు వివరించాడు. ఏమీ కాదని ధైర్యం చెప్పాడు. పిలగాడు ఏడుపు మానుకున్నందుకు గౌరవ్వ కుదుటపడింది.

పాపయ్య పేరుకు సావుకారే. చిన్న దుకాణమున్నది. ఉప్పు, మిరపకాయ, చాయ్‌పత్తా, చక్కర, పొగాకు, బీడి వంటి చిన్న చిన్న సామాన్లే ఉంటాయి. ఆ వాడ అవసరాలకు తగినట్లు చిన్న దుకాణంతో జీవనం సాగిస్తుండు పాపయ్య. పాపయ్య తండ్రి జమానాల ఊరికి పెద్ద దుకాణం వాళ్లదే. తమిశెట్టి రాజయ్య నాలుగూర్లల్లో పేరెల్లిన సావుకారే. ధాన్యం వ్యాపారం, మిత్తీ నాగులు అన్నీ జోరుగా సాగేవట. ఊరికి పెద్ద సావుకారి రాజయ్యే. రాజయ్యకు ఇద్దరు కొడుకులు. చిన్నకొడుకు పాపయ్య. చురుకైనవాడే. కొడుకులు చిన్నపిల్లలు కావటం వల్ల వ్యాపారం పనులు చూడటానికి దూరపు బంధువుల్లో తెలిసిన మనిషిని నియమించుకున్నాడు. అతని పేరు కూడా రాజయ్యే.

సోమరాజయ్య. నాలుగేళ్లు నమ్మకంగా పనిచేశాడు. ఊర్లో స్వంత పరపతి పెంచుకున్నాడు. అయిదేళ్ల తర్వాత అదే ఊర్లో స్వంత వ్యాపారం ప్రారంభించాడు. మర్యాదకు దీవించమని అడిగితే తమిశెట్టి రాజయ్య సోమరాజయ్యను దీవించక తప్పలేదు.

పాపయ్య వ్యాపార బాధ్యతలు చేపట్టిన నాటికి ధాన్యం వ్యాపారం సన్నగిల్లింది. నాగులు, మిత్తీ, ధాన్యం, అప్పులు అన్నిటికీ ఊరు సోమరాజయ్య వైపు తిరిగింది. బంగారు వస్తువులు కుదువపెట్టుకొని అప్పులివ్వడం వల్ల కొత్త ఆకర్షణ మొదలైంది. కొద్దిరోజుల్లోనే సోమ రాజయ్య స్వంత వ్యవసాయం ప్రారంభించాడు. తమిశెట్టి రాజయ్య కండ్లముందే తన వ్యాపార వైభవం కూలిపోవటం వల్ల రంధి పెట్టుకుని తనువు చాలించాడు. ఉన్న డబ్బు మూటగట్టుకొని సుఖాలు వెతుక్కుంటూ వెళ్లిపోయాడు పెద్దకొడుకు. అట్లాంటి కష్టకాలంలో పాపయ్య ఇంటిని నడపటానికి దుకాణమొక్కటే దిక్కయింది.

పాపయ్య యువకుడుగా ఉత్సాహంగా దుకాణం తీర్చిదిద్దాడు. పాత నిత్యావసర వస్తువులతో పాటు పట్టణంలోకి వస్తున్న కొత్త సరుకులను కూడా ఊర్లో అందుబాటులోకి తెచ్చాడు. చీరలు ధోతుల నుంచి సిగరెట్ల దాకా దుకాణం పెరగటం వల్ల బందారం ఊరికి అదే పెద్ద దుకాణంగా పేరొచ్చింది. పాపయ్య సావుకారిగా మంచి పేరొచ్చింది. వ్యాపారంతో పాటు వ్యవహారం తెలిసినవాడు. జమా ఖర్చు లెక్కా పత్రం రాయటం బాగా వచ్చినవాడు. భూమికి సంబంధించిన పత్రాలు రాయించుకునేవారు. యువకుడుగా విద్య నేర్చుకుంటున్నప్పుడే భజనలు, కీర్తనలు, మంత్రాలు కూడా నేర్చుకున్నాడు. గరకపోచలకు, ఆముదానికి, బియ్యానికి మంత్రమేసి ఇచ్చేవాడు. జ్వరాలకు, జబ్బులకు మాత్రమే వైద్యం. పాము కరిచినా, తేలు కరిచినా మంత్రాలతో చికిత్స చేసేవాడు. చిత్ర విచిత్రమైన కళల్లో ఆసక్తి ఉండేది. ఏ పని చేసినా మనసు పెట్టి చేయటం పాపయ్యకు ఇష్టం. చివరకు పాపయ్య వంట చేసినా అతనికి అతనే సాటి అని పేరు తెచ్చుకున్నాడు. తనకు తెలిసిన విద్యలన్నీ ఊరికి మంచి చేయడానికే ఉపయోగించాడు.

పాపయ్య సావుకారి నల్లగా ఉంటాడు. వెడల్పాటి నుదురు. నుదుటన తనే స్వయంగా తయారు చేసిన గుండ్రటి అగరుబొట్టు. పెదవుల మధ్య చిరునవ్వు. కళ్లల్లో ఆకట్టుకునే చూపు. నల్లటి ఒంటి మీద తెల్లటి జంధ్యం. ఉతికిన తెల్లటి ధోతి. పౌరాణిక పాత్ర మాదిరిగా ఉంటాడు తప్ప వ్యాపారస్తుడుగా తోచడు. అయినా ఆయన దుకాణస్తుడే.

దుకాణంలో గిరాకీ జోరుగా పెరగటం వల్ల కాపు యువకున్ని పనిలో పెట్టుకున్నాడు. లక్ష్మయ్య చాలా చురుకైనవాడు. పాపయ్య చేతికింద ఒదిగిపోయాడు. చకచకా పనులు చక్కబెట్టడంలో లక్ష్మయ్య మరింత పేరు తెచ్చుకున్నాడు. పాపయ్యకు లక్ష్మయ్య కుడిభుజంగా అతికినట్టు కుదరటంవల్ల దుకాణం మరింత వెలిగింది. తల్లిపోరు వల్ల పాపయ్య పెళ్లికి సిద్ధపడ్డాడు. తాను నలుపు కావటం వల్ల తెల్లటి పిల్ల కావాలని తెగ తిరిగాడు. తిరిగి తిరిగి అదమైన తెల్లటి యువతి సత్తెవ్వను పెళ్లి చేసుకొన్నాడు. తమ కులంలో తమ ప్రాంతంలో అటువంటి అందగత్తె దొరుకదని, ఆమె వేరే అయి ఉండవచ్చని కొందరు అన్నా, కొందరు అనకున్నా పాపయ్య సత్తెవ్వల దాంపత్యం, అన్యోన్యం ఊరు గుర్తించింది.

పాపయ్య జీవితం సాఫీగా సంతోషంగా నాలుగేళ్లు సాగిపోయింది. మలుపులేవీ లేకపోతే జీవితానికి ప్రత్యేకత ఏదీ ఉండదు. ఊర్లో ఓ వెలుగు వెలుగుతున్న దుకాణానికి లక్ష్మయ్య పనితనం కలిసి వచ్చినా, లక్ష్మయ్యకు పుట్టిన స్వంత దుకాణం ఆలోచన పాపయ్యను దెబ్బ కొట్టింది. లక్ష్మయ్య స్వంత దుకాణం పెట్టగానే పాపయ్య దుకాణం ఢీలా పడ్డది. కొద్దిరోజుల్లోనే ఊరు లక్ష్మయ్య దుకాణం దారి పట్టింది.

పాపయ్య దుకాణం కోసం దుకాణం నడుపలేదు. దుకాణందారులతో పోటీ పడలేదు. తన సంసారం మందం దుకాణం నడిస్తే చాలనుకున్నాడు. తన విద్యలు, తన జీవితం ఊరికి ఉపయోగించటానికి నిర్ణయించుకున్నాడు. పిల్లలు కలుగకపోయినా, సత్తెవ్వ కొంచెపడలేదు. ఇరుగు పొరుగు పిల్లల్ని చేరదీసి సంతోష పడసాగింది.

పాపయ్య చంటోడికి మంత్రం వేసి పంపిచిన తర్వాత తిరిగి పూజ పూర్తి చేసుకున్నాడు. దేవుని పటం ముందు కొబ్బరికాయ కొట్టాడు. లేచి వక్కల్లోంచి కొబ్బరిముక్కలు వొలిచాడు. దుకాణం లోంచి బెల్లం ముక్కలు తెచ్చి కలిపాడు. సత్తెవ్వకిచ్చాడు ఆంజనేయ స్వామికి మొక్కి చెరికొంచెం ప్రసాదం నోట్లో వేసుకున్నారు. సత్తెవ్వ బయటకు వచ్చి ‘‘పలారముల్లో’’ అని గొంతెత్తి అరిచింది. ఆడుకుంటున్న పిల్లలు మరికొందరు పరెగెత్తికొచ్చారు. సత్తెవ్వ పళ్లెంలోంచి పలారం పంచి ఇస్తుంటే పిల్లల ముఖాల్లో పట్టరాని సంతోషం. కొబ్బరిముక్క బెల్లం చూసుకుంటూ, ఒకరికొకరు చూపించుకుంటూ మురిసిపోతున్నారు. ఒకరిద్దరు పిల్లల తల్లులు కూడా వొచ్చారు. వాళ్లూ ప్రసాదం తీసుకున్నారు.

తర్వాత పాపయ్య భోజనం పూర్తి చేసుకొని పెద్దపీట మీద ఒరిగాడు. బాయి దగ్గరినుంచి వచ్చి భోంచేసి సరాయించుకుంటూ వచ్చాడు రాములు. ‘పాపయ్య బావా, పన్నవా. ఒక్క బీడి పడెయ్యరాదు ...” అడిగాడు. పాపయ్య దుకాండ్లకెల్లి అట్టపెట్టె చింపి బీడికట్టలోంచి ఒక బీడి ఇచ్చాడు. “సావుకారీ, నా దిక్కు కూడ జూడు” అనుకుంటూ చేరుకున్నాడు రాజలింగం. అతనికొక బీడీ ఇచ్చాడు. లైటర్ ముట్టించి ఇస్తే ఇద్దరూ బీడీ ముట్టించుకున్నారు. “రాయలింగూ, నీకోసం జూస్తన్న. పొయ్యిలకు కట్టెలయిపొయినయి. ఎప్పుడు కొడతవో యాదికి పెట్టుకోని వచ్చి కొట్టి పో జర” అన్నాడు పాపయ్య. “ఎప్పుడో ఎందుకు సేటూ కట్టెలు కొట్టినంకనే బీడి తాగుత” “గంత జల్ది ఏం

లేదులే. ముందు నిమ్మలంగ బీడి తాగు....” బీడీలు తాగుతూ ముచ్చట పెట్టుకున్నారు తర్వాత కట్టెలు కొట్టటానికి లేచాడు రాయలింగం. “ఎండిపోయిన మొద్దు బాయి కాడ ఉత్తగనే ఉన్నది. తెచ్చేస్త తియి బావ” అని లేచాడు రాములు.

కునుకు పడుతుండగానే “పాపయ్య బావ పడుకున్నాడా” వచ్చాడు రామానుజం. పాపయ్య లేచి పలకరించాడు. దుకాండ్లకు వచ్చి మాట్లాడుకుంటుండగానే సోమిరెడ్డి వచ్చాడు. “సోపల్ల లేదా సోమిరెడ్డి” అడిగాడు రామానుజం. “లేదు” అనుకుంటూ లోపలికొచ్చాడు సోమిరెడ్డి. ముగ్గురు కలిస్తే తందనాన రామాయణం పారాయణం చేస్తారు. పాపయ్య పుస్తకం తెరిచాడు. “నిన్న ఎక్కడిదాక అయింది?” అంటూ యుద్ధకాండ తీసి చదువుతున్నాడు పాపయ్య.

“అంత సౌమిత్రి లేచెను జయరామ ఇంద్రజిత్తునే జూచెను జయరామా” “అన్న రామున్ని తలచెను జయరామ అప్పుడు నారి సంధించెను జయరామ” చాలా ఆసక్తిగా యుద్ధ సన్నివేశాన్ని వినిపిస్తుంటే రామానుజం పరవశిస్తున్నాడు. అరగంటసేపు చదివిన తర్వాత సోమిరెడ్డికిచ్చాడు. సోమిరెడ్డి బాలుడు గనుక మరింత ఉత్సాహంతో గంటసేపు చదివాడు. కొంతసేపు రామాయణం గొప్పతనం చెప్పుకున్నారు. సీతాదేవి గురించి బాధపడ్డారు. తర్వాత ఊరి గురించీ బాధ పడ్డారు.

“పాపయ్య నాయనా, కొద్దిసేపు ఆర్మని నేర్పనా” అడిగాడు సోమిరెడ్డి. పుస్తకం భద్రంగా చెక్కమీద పెట్టి హార్మోనియం తెరిచాడు పాపయ్య. అటూ ఇటూ సర్ది శ్రుతి చేసుకున్నాడు. రాగం సాగుతుంది. మెట్లు వొత్తుతూ సరిగమలు పలికించాడు. “లంబోదర లకుమికరా అంబాసుత అమరవినుత” పలికించి చూపాడు. సోమిరెడ్డి తిరిగి పలికించబోయాడు. విన్నంతసేపు వచ్చినట్టే అనిపిస్తుంది. తీరా పలికించబోతే ఒకటి సరిగా పలకదు. అంటూ అటూ ఇటూ గంటసేపు హార్మోనితో తంటాలు పడ్డారు. వొచ్చీరాని కీర్తన నేర్పుతుంటే పాపయ్యకొక ఆనందం. నేర్చుకుంటుంటే సోమిరెడ్డిదొక సంతోషం. అరాకొరా అయినా సరే విని మైమరుస్తాడు రామానుజం.

మూడు గంటలకు నర్సిరెడ్డి వచ్చాడు. ఆయనొస్తే ఇస్పేటాట. రామానుజం లేచి ఇంటికి వెళ్లాడు. ఇస్పేటు జోరుగా నడుస్తున్నది. “పాపయకయ మామా, ఉన్నవా.... గడ్డి కోస్తంటె మల్లిగానికి పాము కర్శింది” బండి మీద వేసుకొని అటొకరు ఇటొకరు పట్టుకొని లాక్కుంటూ నలుగురైదుగురు చేరుకున్నారు. బండిమీద నుంచి దించి అరుగు మీద కూర్చుండబెట్టారు. మల్లయ్య నోట్లోంచి నురుగు వస్తున్నది. పాపయ్య పాము కాటు వేసిన చోట చూచాడు. రెండు కాట్ల పక్కన తాడుతో కట్టు కట్టించాడు. మంత్రం వేశాడు. ఊదాడు. కాలు జాడింపచేశాడు. మిరపకాయలు తినిపించాడు. కొంతసేపటి తర్వాత మళ్లా మంత్రం వేస్తూ ఊదాడు. పెరట్లోకి వెళ్లి ఏదో ఆకు తెచ్చాడు. ఒకటి రెండు దినుసులు కలిపి ఇస్తే సత్తెవ్వ రోట్లో వేసి దంచింది. కాటు వేసినచోట ఆకుపసరు పట్టీ వేశాడు. నురగ ఆగిపోయింది. మళ్లా మంత్రం వేశాడు. మల్లయ్య కళ్లు తెరిచాడు. మెల్లగా కాలు కదిలించి లేచాడు. వచ్చినవాళ్లు తేరుకున్నారు. మరికొంత ఆకుపసరు ఇచ్చి పెట్టుమన్నాడు.

చీకటి పడుతుండగా సత్తెవ్వ ఊడ్చి నీళ్లు చల్లి ఆరిన తర్వాత చాప వేసింది. భజనమండలి ఒక్కొక్కరు చేరుకుంటున్నారు. ప్రతి శనివారం పాపయ్య ఇంటిముందు భజన. ఊర్లో ఏ సావుకారి ఇంటిముందూ సందడి ఉండదు. ముచ్చట్లు పెట్టే అమ్మలక్కలు అక్కడికే చేరుతారు. ఆడుకునే పిల్లలు అక్కడే, ప్రసాదం కోసం పడిగాపులు పడేవాళ్లూ అక్కడికే. భజన చేసేవాళ్లు, పాడేవాళ్లు, చూసేవాళ్లు, వినేవాళ్లు శనివారం ఆ ఇంటిముందు కోలాహలం.

భజన దగ్గర పాపయ్య, లక్ష్మయ్య ఇద్దరూ కలుస్తారు. పాపయ్యకు భక్తి కాలక్షేపం. లక్ష్మయ్యకు భక్తులతో సంబంధం. మాటకారితనం, మంచి గొంతు. లక్ష్మయ్యకు పాపయ్య భజనలు నేర్పాడు. భజననృత్యం నేర్పాడు. లక్ష్మయ్య మంచికంఠంతో మరింత బాగా పాడుతాడు. కోలాటం నేర్చుకోవటం నవయువకులకు గొప్ప ఉత్సాహం. వాళ్లకు నేర్పటంలో, డ్రెస్సులు తయారు చెయ్యటంలో పాపయ్యకు ఉత్సాహం. పాపయ్య ఇంట్లో భజన సామగ్రి చేయించి చెట్టాడు. చిరుతలు, తాళాలు, మద్దెల, బిళ్లంగుత్తులు, గజ్జెలు, హారతిపళ్లెం, మాణిక్యాలు... ఒకటని కాదు సమస్త భజన సామాగ్రి సంపాదించి భద్రపర్చాడు. వాటిని భజనలో ఉపయోగించి ఉపయోగించి భక్తులు అలిసిపోతారు కాని పాపయ్యసేటు అలిసిపోడు.

ఊళ్ళో ఎవరింట్లో పెళ్లి పెట్టుకున్నా పాపయ్యసావుకారికే పని. దూలాలకు, సరాలకు అంటించే రంగు కాయితాలు కత్తిరించే కళలో ఆయనదే నైపుణ్యం. కాయితాలు కత్తిరించి పువ్వులూ, రథాలు, పక్షులూ, నెమళ్లూ అందంగా తయారుచేస్తాడు. భజన చేస్తున్నప్పుడే రాజేశ్వర్ రెడ్డి వచ్చి రంగు కాగితాలు ఇచ్చి వెళ్లాడు. రూపాయి తీసుకోకుండా వాటిని కత్తిరించి ఇవ్వటం పాపయ్యకిష్టం. బతుకమ్మ పండుగ వస్తే శిఖరం మీద పెట్టే పూల కిరీటం చేసివ్వటం అంతే ఇష్టం. ‘సావుకారీ, దుకాణం ఎట్లా నడుస్తుంది’ అని అడిగితే చిన్న చిరునవ్వు విసురుతాడు.

“లక్షాధికారయిన లవణమన్నెమె కాని – మెరుగు బంగారంబు మింగబోడు” శేషప్ప పద్యం చదువుతాడు. ఇంకా ఎవరైనా సాగదీస్తే “రామదాసుకే తప్పలేదు తిప్పలు. నేనెంత?” అంటాడు. “శ్రీరామ నామాం మరువాం – మరువాం – చిత్తాన యమునికి వెరువాం వెరువాం॥” అని పాపయ్య కీర్తన చెప్పుతున్నాడు. లీనమై చెప్పుతుంటే ఎదుటివాళ్లు అదే నుడుగు అందుకుంటున్నారు. కీర్తన అయిపోగానే ‘అప్’ అన్నాడు. నిశ్శబ్దంగా, వేగంగా చలీలో మోగిస్తున్నారు

భజనసామాగ్రి.

పరమ ఆధ్యాత్మికంగా, పల్లెకు ఉపకారిగా జీవిస్తున్న పాపయ్యకు మరో దెబ్బ తగిలింది. ఆ వాడలో ఆ చిన్న దుకాణానికి పోటీగా మరో దుకాణం వెలిసింది. ఆ కాస్త అమ్మకాలు పోయాయి. ఆదాయం పోయింది. తిండి మానేయలేదు. భజన మానేయలేదు. సాయాలు మానేయలేదు. ఉన్న చిన్నచిన్న నగలు అమ్మి ఉన్న జీవితం ముగించుకుందామంటే వెళ్లటం లేదు.

ఆలూ మగలిద్దరూ తర్కించుకున్నారు. తగువు పెట్టుకున్నారు. ఊరు విడిచిపోదామని సత్తెవ్వ, విడిస్తే ప్రాణమే విడుస్తానని పాపయ్య. అరుచుకున్నారు. ఆలోచించుకున్నారు. చివరకు మరో ఊరు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఉన్న ఊర్లో చావయినా పండుగలా ఉంటుంది. కొత్త ఊరు పండుగయినా వెలవెల బోతుంది. అయినా మరో ఊరు దారి తప్ప మరో దారి కనబడలేదు.

ఈ ఇల్లు కిరాయికి ఇచ్చారు. మైళ్ల అవతల మరో ఊర్లో ఇల్లు కిరాయికి తీసుకున్నారు. మరో ఊరు, మరో దుకాణం. సామాన్లు తీసుకెళ్లటానికి ఎడ్లబండి బాడుగకు మాట్లాడాడు. పాపయ్య సావుకారి పెద్ద సావుకారిని కలిసి చెప్పాడు. 'రాత' అన్నాడు ముభావంగా. పెద్ద పటేలుకు వార్త తెలిసింది. "పాపం" అన్నాడు వెటకారంగా.

పెద్దబండి సామాన్లతో నిండింది. వాడ పెద్ద బాల్‌రెడ్డి బండికి అడ్డం తిరిగాడు. "మేమంతా లేమా.... ఊరు గొడ్డుపోయిందా...." అని హడావుడి చేశాడు. "ఊరికి ఒక్క సంసారం బరువా... ఇంత పెద్ద ఊరు ఇద్దర్ని సాదలేదా.... పాపయ్యన్నా... జిద్దొద్దు. దయ తల్వు" బతిలాడాడు. నచ్చచెప్పాడు. పాపయ్య వినలేదు. ముఖమంతా చిన్నబోయింది.

వాడంతా వార్త తెలిసింది. ఒక్కరొక్కరే వాడంతా అక్కడికి చేరుకున్నది. పిల్లలు పాపయ్య చెయ్యి పట్టుకొని "నాయనా పోవొద్దు..." గిసకొడుతున్నారు. సత్తెవ్వను కావిలించుకుని ఆడవాళ్లు ఏడుస్తున్నారు, తుడుచుకుంటున్నారు. వరుసబెట్టి వాడంతా బతిలాడింది. బామాడింది. తల దించుకున్నాడు పాపయ్య.

బాడుగాయిన కానికి ఎడ్లు కట్టాడు. సిపాయిలు తీసాడు. బండి కదిలింది. బండి వెనుక పాపయ్య దంపతులు కదిలారు. వాళ్ల వెనుక వాడ కదిలి వస్తున్నది.

"అది నాది ఇది నాది యని భ్రాంతి జెందుదు ప్రాప్తమేదో యెఱుగవలను గాదు"

"ఊరేది? పేరేది? ఉన్నదేది? లేనిదేది? ఉన్నయని అనుకున్నవన్ని ఉన్నన్నాళ్ళే.."

చెరువుకట్ట చేరువ కాగానే పాపయ్య కండ్లల్లో నీళ్లు తిరిగాయి. రాముడు గుర్తొచ్చాడు. "తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకూ...." రామదాసు గుర్తొచ్చాడు. ఎందరి కన్నీళ్లో తుడిచిన పాపయ్య సావుకారి కండ్లల్లో కనబడని కన్నీళ్ల సుడి దిరుగుతున్నాయి. ఎత్తుకోవచ్చు, దింపవచ్చు. ఊరు ఊరే. ఊరు దాటడం కష్టంగా ఉంది.


# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3

హైదరాబాద్ జనవరి : 2023

# "కవిత్వం, సినిమా నాకు రెండు కళ్ళు"

## కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత (2022)

## శ్రీ వారాల ఆనంద్ గారితో .. మూసీ ముచ్చట



శ్రీ వారాల ఆనంద్ గారికి 2022 సంవత్సరానికి గాను అనువాద విభాగంలో 'ఆకుపచ్చ కవితలు' అనే అనువాద గ్రంథానికి కేంద్రసాహిత్య అకాడెమి అవార్డు లభించింది. ఈ గ్రంథం ఆంగ్లంలో గుల్జార్ గారి 'గ్రీన్ పోయమ్స్'. వీరు వృత్తిరీత్యా లైబ్రేరియన్‌గా 1980 నుండి 2016 వరకు వివిధ జూనియర్, డిగ్రీ కళాశాలలలో పనిచేసారు. వీరు అనువాద విభాగంలోనే కాకుండా తెలుగు సినిమా రంగంపై విశేషమైన కృషిచేస్తూ ఎన్నో వ్యాసాలు రాసారు. వారితో ఈ మాసం మూసీ ముచ్చట...

**చైతన్యవంతమైన ప్రాంతం నుండి వచ్చిన మీ మీద అక్కడి ఉద్యమాల ప్రభావం ఏమేరకు ఉంది.**

ఎప్పుడయినా ఎక్కడయినా తన చుట్టూ ఆయాకాలాల్లో పెల్లుబికిన సామాజిక చైతన్యం, సంఘర్షణ, సామాజిక మార్పు ప్రతి సృజనకారుడి పైనా వుంటుంది. తన జీవితం, చదువు, ఆలోచనలన్నింటి పైనా ఆ ప్రభావం ఖచ్చితంగా వుంది తీరుతుంది. అయితే ఆ సృజనకారుడి ప్రతిస్పందన మాత్రం ఆతని అవగాహన, మానసిక స్థితి, స్వీకరించి ప్రతిస్పందించే లక్షణం మీద ఆధారపడివుంటుంది. నా మట్టుకు నేను అన్నివాదాలనీ ఉద్యమాలనీ చాలా దగ్గరి నుంచి చూసాను. కలిసి నడిచాను. పూర్తిగా ఉద్యమంలో భాగం కాకున్నా విడిగా మాత్రం లేను. భావ పరంగా చైతన్య పరంగా వాటి వెంటే వున్నాను. నా ఆచరణ మాత్రం సాహిత్యం సినిమాల ద్వారా కొనసాగించాను. వేములవాడ లాంటి మామూలు గ్రామంలో 1981 లోనే సత్యజిత్‌రే, మృణాల్ సేన్, బి.నరసింగ రావు లాంటి దర్శకుల సినిమాల్ని ప్రదర్శించి చర్చలు సెమినార్లు పెట్టాం. నేనెప్పుడో రాసుకున్నట్టు "ఈ సమాజం అచ్చుతప్పులున్న గొప్ప పుస్తకం, ఇప్పుడు కావలసింది తప్పొప్పుల పట్టిక తయారు చేయడం కాదు, ఆ పుస్తకాన్ని పునర్ముద్రించాలి" అన్న భావనలోనే వున్నాను

**మీకు సాహితీ సృజనకు ప్రేరణ ఎవరు?**

నిజానికి కరీంనగర్ లో మా నానమ్మ తాతలది మిఠాయి దుకాణం. గాజుల షాపూ వుండేది. మిఠాయి సత్యమ్మ షాపు అంటే అప్పుడు చాలా ప్రసిద్ధి. అట్లా మాది ప్రధానంగా వ్యాపార నేపథ్యం వున్న కుటుంబం. పెద్ద చదువుల నేపథ్యం కానీ సాహిత్య వాతావరణం కానీ వుండేది కాదు. అయినప్పటికీ మా చిన్నప్పుడు మా నాన్న ఉర్దూ లో అనేక పుస్తకాలు చదివేవారు. క్లాక్ టవర్ దగ్గర మా ఇంటి దగ్గరలో పుస్తకాలు అద్దెకు ఇచ్చే శ్రీ కృష్ణా బుక్ స్టాల్ అనే ఓ షాపు వుండేది. చిన్నప్పటినుంచే అందులోంచి డిటెక్టివ్ పుస్తకాలు తెచ్చుకుని చదవడం అలవాటు అయింది. అప్పటినుండే నాకు టెక్స్ట్ బుక్స్ నుంచి ఇతర పుస్తకాలు చదివే ధోరణి మొదలయింది. దానికి తోడు మా వేములవాడ అమ్మమ్మ వాళ్ళింట్లో సాంఘిక నవలలు ఉండేవి. దాంతో యద్దనపూడి, అరికెపూడి, మాదిరెడ్డి, రంగనాయకమ్మ లాంటి మహిళా రచయిత్రుల నవలలు విరివిగా చదివాను. డిగ్రీ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరిన తర్వాత నా చదివే ఒరవడి పూర్తిగా మారిపోయింది. శ్రీశ్రీ కవిత్వం, చివరకు మిగిలేది, అసమర్థుని జీవ యాత్ర, అమీనా, అంపశయ్య లాంటి నవలలు చదవడం మొదలయింది. రాయాలనే కోరికా శురూ. చిన్న కథలు రాసే ప్రయత్నం మొదలు పెట్టాను. మొదటి కథ పురాణం రామచంద్ర సంపాదకత్వంలో వచ్చిన 'చిత్రిక' వార పత్రిక లో ప్రచురితమయింది. అంతే కాకుండా మినీ కవిత్వం రాయాడమూ ప్రారంభించాను.



**కవిగా మీ ప్రస్థానం?**

సాహిత్య పరంగా నాపైన మొదట ప్రభావం కలిగించిన సంస్థలు వేములవాడలోని నటరాజ కళానికేతన్, ఉస్మానియా విశ్వవిద్యాలయం లో ఉస్మానియా రైటర్స్ సర్కిల్. ఈ రెండు సంస్థలూ నా అధ్యయనాన్ని ఆలోచన రీతినీ మార్చాయి. వేములవాడలో శ్రీ చొప్పకట్ల చంద్రమౌళి సలహాదారుగా ఏర్పడ్డ సంస్థ నటరాజ కళా నికేతన్ సమయం లోనే ప్రముఖ కవులు కే.శివారెడ్డి, దేవిప్రియ, జ్వాలాముఖి, కుందుర్తి లాంటి ఎందరినో దగ్గరినుంచి చూసే అవకాశం కలిగింది. అప్పుడు వజ్జల శివకుమార్, పీ.ఎస్.రవీంద్ర, జింబో లాంటి కవి మిత్రుల సహచర్యం సాహిత్యం వైపునకు నన్ను నడిపించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నందిని సిధారెడ్డి, సుంకి రెడ్డి నారాయణ రెడ్డి, మర్రి విజయ రావు, నందిగం కృష్ణారావు లతో సన్నిహితంగా వున్నాను. ఈ అందరి మిత్రుల స్నేహం సాహిత్యం రచనల వైపునకు దారి తీసింది. తర్వాత జూకంటి జగన్నాథం, అలిశెట్టి ప్రభాకర్ ల కవిత్వమూ ఆకట్టుకుంది. వాళ్ళతో స్నేహాన్నీ కలిపింది.

అట్లా రాయాలనే కోరికా శురూ అయి రాయడం మొదలు పెట్టాను. ఆ క్రమంలో మినీ కవిత్వం, చిన్న కథలు రాయడం ఆరంభించాను. అది ముందుకు సాగి మొదటి పుస్తక ప్రయత్నంగా అలిశెట్టి ప్రభాకర్, వజ్జల శివకుమార్, జింబో, పీ.ఎస్.రవీంద్ర లతో కలిసి “లయ” మినీ కవితా సంకలనం తెచ్చాం.

**వారాల ఆనంద్ అనగానే ఒకప్పుడు కరీంనగర్ కేంద్రంగా జరిగిన సమాంతర సినిమా ఉద్యమం గుర్తొస్తుంది. మీరు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఆ నేపథ్యాన్ని, ప్రస్థానాన్ని వివరించండి. సినీ రచనల గురించి కూడా..**

సాహిత్య సృజన కొనసాగుతూ ఉండగానే అర్థవంతమయిన సినిమాల వైపు నా దృష్టి మరలింది. నిజానికి చిన్ననాటి నుండే హిందీ సినిమా పాటలు వినడం రోజూ ‘పురానీ ఫిల్మోంకా గీత్’ , వారం వారం ‘బినాకా గీత్ మాలా’ వినడం ఒక వ్యసనంగా వుండేది. గుల్జార్, గురుదత్ లాంటి వాళ్ళ సినిమాలు అంతకు ముందే తెలుసు. కొంత అవగాహన పెరిగాక అంపశయ్య నవీన్, డి.నరసింహారావు లాంటి వాళ్ళు స్థాపించిన కరీంనగర్ ఫిలిం సొసైటీ లో చేరాను.. సినిమా చాలా ప్రభావ వంతమయిన మాధ్యమమని గొప్ప సినిమాల్ని సామాన్య ప్రజలకు, విద్యార్థుల దగ్గరికి తీసుకెళ్లాలని చూపించాలని ఫిలిం సొసైటీ ఉద్యమంలో ప్రధాన బాధ్యతను తీసుకున్నాను. దానికి ముందే 1981 లోనే వేములవాడ ఫిలిం సొసైటీని ప్రారంభించాను. సిరిసిల్ల లో రుద్రా రవి లాంటి మిత్రులు సిరిసిల్లా ఫిలిం సొసైటీ ఆరంభించారు. క్రమంగా నేను సమాంతర సినిమాలు చూడడం చూపించడం, వాటి పైన రాయడం మొదలు పెట్టాను. అట్లని సాహిత్య అధ్యయనం మాత్రం వదల లేదు, నిరంతరం కొనసాగింది. కవిత్వం, కథలు, పిల్లలకోసం కథలు, సినిమాలు, డాక్యుమెంటరీ ఫిలిమ్స్ తీయడం, విమర్శ, అనువాదాలు, కొంతకాలం జర్నలిజం ఇట్లా ‘సాహిత్య బంజారా’ లాగా తిరుగుతూ వచ్చాను. ఏదో తెలుసుకోవాలనీ, తెలుసుకున్నది తెలియజెప్పాలన్న నా ఈ చిన్న యాత్ర కొనసాగుతూ వున్నది. అదే క్రమంలో ‘మానేరుతీరం’, మనిషి లోపల, అక్షరాల చెలిమె, ముక్తకాలు లాంటి కవితా సంపుటాలు వెలువరించాను.

**సిరిసిల్ల, జగిత్యాల, వేములవాడ, కరీంనగర్ మీ యవ్వనంలో ప్రభావవంతమైన ప్రాంతాలు వాటి ప్రభావం మీ సాహిత్యంపైన... మీ మిత్రులపైన ఎలా ఉండేది.**

అప్పుడు సిరిసిల్లా జగిత్యాల అంటేనే ఒక గొప్ప ఉద్వేగం, ఉత్సాహం. అప్పుడు మేమే కాదు యవ్వనంలో వున్న వాళ్ళందరి పైనా ఆ ఉద్యమాల ప్రభావం ప్రత్యక్షంగానో పరోక్షంగానో అమితంగా వుండేది. రగులుతున్న పల్లెలు ఒక పక్క, మరోపక్క అణచివేత ఎన్కౌంటర్లు అంతా ఒక సంఘర్షణాత్మక స్థితి. ఎప్పుడే భీభత్సం జరుగుతుందోనన్న స్థితి నెలకొని వుండేది. ఆ నేపథ్యంలో ఆ ఉద్యమ ప్రభావం నాపైనా, నా మిత్రుల పైనా స్పష్టంగా వుండేది. మా రచనల్లో ప్రతిఫలించేది. అయితే కవితల్లో కవిత్వం తో పాటు అంతర్లయగా ఉద్యమం ధ్వనించేది.

**మౌలికంగా మీరు సృజనకారులు. అనువాదం వైపుకు నడవడానికి కారణం?**

నిజమే సృజన రంగంలో నేను కవిత్వం, కొన్ని కథలు, పిల్లల కథలు, సినిమా వ్యాసాలూ రాసాను. అయితే – ‘ఇచ్చి పుచ్చు కోవడం’ అన్న భావనే మనిషి మనుగడకు మూలాధారం కదా. అంతే కాదు **‘తెలియంది తెలుసుకోవడం తెలిసింది పంచుకోవడం’** అన్నది మానవ సంస్కృతిలో అంతర్భాగమయిన జీవనమార్గం. ప్రపంచ వ్యాప్తంగా వేలాది లక్షలాది సంవత్సరాలుగా భిన్న భాషలు సంస్కృతులతో కొనసాగుతున్న మానవాళి ఈ భాషా,సాహిత్య, సాంస్కృతిక,

సామాజిక, అభివృద్ధి రంగాల్లో కొనసాగుతున్న ఈ 'ఆదాన్ ప్రదాన్' భావనతోనే ముందుకు సాగుతున్నది. మనిషి తనను తాను వ్యక్తం చేసుకోవడానికి కాలక్రమంలో భాషను గొప్ప మాధ్యమంగా రూపుదిద్దుకున్నాడు. అయితే ఆ భాష అన్ని ప్రాంతాలకూ ఏక రూపకంగా కాకుండా భిన్న రూపాల్లో వ్యక్తమయి ఎదుగుతూ వచ్చింది. కేవలం మన దేశవిషయం చూసినా భారత రాజ్యాంగం మొదట 14 భాషల్ని అధికార భాషలుగా గుర్తించి తర్వాత ఆ సంఖ్యను 23 వరకు పెంచింది. కానీ నిజానికి మన దేశంలోనే ఇంకా ఎన్నో లెక్క లేనన్ని భాషలున్నాయి. వాటిల్లో లిపి ఉన్నవీ లిపి లేనివీ కూడా వున్నాయి.మరయితే ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఎన్ని భాషలున్నాయో. చెప్పడం కష్టం. ఆ స్థితిలో ఒక ప్రాంతంలో ఒక భాషలో జరిగిన విషయాలు, విజయాలూ, సృజనాత్మక విషయాలూ ఇతర ప్రాంతాలకు చేరడానికి వాటిని ఒక భాష నుంచి మరో భాషలోకి చేరవేయడానికి తర్జుమా అవసరమయింది. దాన్నే అనువాదం అన్నారు. అ ఆనువాదం ప్రాముఖ్యతను అర్థం చేసుకుని నేను అనువాదాలు చేయడం ఆరంభించాను. అన్ని భాషల కవిత్వాన్ని విస్తృతంగా చదవడం ఒక అలవాటుగా మారిన తర్వాత వివిద భాషల్లో నాకు నచ్చిన కవితల్ని తెలుగు లోకి అనువదించడం ఆరంభించాను. అట్లా ఓ 'సాంస్కృతిక బంజారా' లాగా అనేక సృజనాత్మక రంగాల్లో కృషిచేసాను. అనువాదంలో సచ్చిదానందన్, జావేద్ అక్తర్, గుల్జార్ తదితరుల కవితల్ని అనువదించాను. అట్లా అనువాదం నా సృజన జీవితంలో ముఖ్యమయిన అంశం అయిపోయింది.







**ఇప్పటివరకు ఎన్ని తెలుగులోకి అనువదించారు? ఆకుపచ్చ కవితల నేపథ్యం ఏమిటి ?**

అనువాదాలు చేయడం మొదలు పెట్టి వివిధ భాషల నుంచి 'ఇరుగు–పొరుగు' శీర్షికన ఇప్పటివరకు 17 భారతీయ భాషల నుంచి 70 కవితల దాకా అనువదించాను. ఆసియా నెట్ ఆన్లైన్ పత్రికతో సహా పలు సామాజిక వేదికల్లో ప్రచురించాను. అనువాదం నా మౌలిక కవిత్వ రచన తో పాటు సమాంతరంగా కొనసాగుతూనే వుంది.

ఆకుపచ్చ కవిత్వం మూల రచయిత కవి గుల్జార్ అంటే నాకు నా కాలేజీ రోజుల నుంచీ అభిమానం.ఆయన రచనలు చాలా ఏళ్లుగా చదువుతూ వున్నాను. ఆయన్ను మొట్టమొదట ఇష్టపడింది 'పరిచయ్' సినిమాలో ఆయన రాసిన ముసాఫిర్ హూన్ యారో... పాటతో. ఆ తర్వాత రాజేష్ ఖన్నా "ఆనంద్" సినిమాకు గుల్జార్ రాసిన మాటలు నన్నెంతో ఆకట్టుకున్నాయి. తర్వాత ఆయన కోషిష్, ఖుష్బూ, మౌసం, అందీ లాంటి సినిమాల్లో కనిపించిన సున్నితత్వం ఆయనకు నన్ను మరింత దగ్గర చేసింది. తర్వాత గుల్జార్ కవిత్వంపై నా దృష్టి పడింది. గ్రీన్ పోయెమ్స్, సస్పేక్టేడ్ పోయెమ్స్, నెగ్లేక్టేడ్ పోయెమ్స్, గ్రీన్ పోయెమ్స్ ఇట్లా అనేక సంకలనాలు చదివాను. అంతేకాదు ఆయన చేసిన టాగోర్ 'భాగ్బాన్' అనువాదం కూడా చదివాను. వాటిల్లో గ్రీన్ పోయెమ్స్ బాగా నచ్చింది, అందులో ఆయన స్పృశించిన పర్యావరణ అంశం బాగా హత్తుకుంది. చెట్లు, మబ్బులు, నదులు, పర్వతాలు ఇట్లా అనేక అంశాలూ వాటికీ మనిషి వున్న అనుబంధం అన్నింటినీ ఇందులో గుల్జార్ సున్నితంగా ఆవిష్కరిం చాడు దాంతో ఆ పుస్తకాన్ని అనువాదం చేయాలనుకున్నాను.




**అనువాద సాహిత్యంలో కేంద్ర సాహిత్య అవార్డు రావడం పట్ల మీ అనుభూతి?**

అవార్డుల పట్ల ఎప్పుడూ పెద్ద ఆసక్తి లేదు.. అట్లని వైముఖ్యమూ లేదు. ఆకుపచ్చ కవితలు అనువాదం చేస్తున్నప్పుడు అవార్డులను ఆశించలేదు. కేంద్ర సాహిత్య అవార్డు వస్తుందని అస్సలు అనుకోలేదు. 'నచ్చిన కవిత్వాన్ని వచ్చిన రీతిలో' అనువదించాలి అనుకున్నాను అంతే. నాకు నచ్చినవి అందరితో పంచుకోవాలనుకున్నాను. కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు రావడం నిజంగా గొప్ప ఆనందమే. దాంతో మనసులో ఆనందంతో పాటు తలపైన భారం కూడా పెరిగినట్టే. 'ఆకుపచ్చ కవితలు' పుస్తకాన్ని జాతీయ అవార్డుకు ఎంపిక చేసిన జ్యూరికి, అకాడెమీ బాధ్యులకు ధన్యవాదాలు.








**మీ అమ్మ, నాన్న కుటుంబం నేపథ్యం ఉద్యోగం ఇతర వ్యాపకాలు**

నేనింతకు ముందే చెప్పినట్టు మాది ప్రధానంగా వ్యాపార నేపథ్యం ఉన్న కుటుంబం. కానీ మా నాన్న గారు వారాల అంజయ్య ఉపాధ్యాయునిగా నిలబడ్డారు. ఎంతో మందిని నిలబెట్టారు. మా అమ్మ రాధ వేములవాడలో పేరెన్నిక గన్న వైద్యుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం-సత్యమ్మల పుత్రిక. తోటి వాళ్ళ పట్లస్నేహంగా ఆప్యాయంగా వుండడం ఆమె నుంచే నేను నేర్చుకున్నాను. నాన్న తలత్ మహమూద్ పాటలు పాడే వాడు. దిలీప్ కుమార్ అంటే ఆయనకు ఎంతో ఇష్టం. హిందీ పాటలు, ఉర్దూ సాహిత్యం ఆయనకు చాలా ఇష్టం. ఇంట్లో ఆయన నెలకొల్పిన వాతావరణమే నాకు సినిమా, సాహిత్యాల పట్ల ఆసక్తిని కొంత అభినివేశాన్ని కలిగించింది.

**అనువాదం ఒక త్యాగం వంటిది. దానిని ఎలా చేయాలి. రచయిత అనువాదకుల రచనల మధ్య ఏ బంధం ఉండాలి. అనువాదాలు ఎలా ఉండాలి. రావలసిన మార్పులు ఏమైన ఉన్నాయా?**

అనువాదం ఒక బాధ్యత అని నేననుకుంటాను. తెలుగులో అనువాదకునికి రావాల్సినంత గౌరవాభిమానాలు రావడం లేదన్నది నిజం. అయితే అనువాదకులు తమ పని తాము చేసుకుంటూ పోతున్నారు. అది మామూలు విషయం కాదు.

అనువాదం చేయడానికి నిబద్ధత కావాలి అర్హతలు అంటూ ఏమీ ఉండవు. ఫలానా వాళ్ళు మాత్రమే అనువాదం చేయాలని ఏమీ వుండదు అయితే ఏ భాష లోంచి అయితే అనువాదం చేయాలనుకుంటామో దాన్ని మూల భాష అనీ, ఎందులోకి చేయాలనుకుంటామో దాన్ని లక్ష్య భాష అనీ అంటున్నాం. అనువాదం చేయాలనుకున్న అనువాదకునికి మూల భాష, లక్ష్య భాషలు రెండింటిలో మంచి ప్రవేశం వుండాలి. ఆయా భాషల గ్రామర్ సింటాక్స్ తెలిసి వుండాలి. అంటే అనువాదకుడు ద్విభాషా పరిజ్ఞానం కలిగి వుండాలి. కేవలం భాషలే కాకుండా అనువాదకునికి ఆ రెండు సంస్కృతుల విషయ పరిజ్ఞానం వుండి తీరాలి. అప్పుడే మూల భాషతో పాటు ఆ భాషా ప్రాంతపు వాతావరణం కూడా లక్ష్య భాషలోకి సమర్థవంతంగా అనువదించబడుతుంది. ఇక మూల రచయితకు అనువాదకునికి వీలయినంత మేర మంచి సంబంధాలు వుండాలి. గౌరవాభిమానాలు వుండాలి. అనువాదం చేస్తున్న సమయంలో ఇద్దరి నడుమా అనువాదం విషయం లో చర్చలు జరిగి మూలానికి అతిదగ్గరగా అనువాదం రాగలిగితే చాలా మంచిది అనుకుంటాను.

సాహిత్యానువాదాల్లో యథాతథానువాదం కంటే సేచ్చానువాదం అభిలషణీయం అనుకుంటాను. అట్లని స్వేచ్ఛ కూడా పరిధి దాటకూడదు.

**గుల్జార్ సాహిత్యంలోని ప్రత్యేకత ఏంటీ? ఆయన సాహిత్యాన్ని అనువాదానికి ఎంచుకోవడానికి కారణం?**

మొత్తంగా గుల్జార్ కవిత్వంలో సరళత సున్నితత్వం నాకెంతో ఇష్టం. అంతే కాదు ఆయన రచనల్లో అంతర్లయగా ధ్వనించే కమిట్ మెంట్ అంటే నాకింకా ఇష్టం.

'ఆకుపచ్చ కవితలు'తో సహా గుల్జార్ సాహిత్యంలో అంతర్లీనంగా ఒక సామాజిక కామెంట్ వుంటుంది. ఆయన గొప్ప భావుకుడు మాత్రమే కాదు ఆయన రచనల్లో మనిషి, మానవత్వం, ప్రధానంగా కనిపిస్తాయి. ఇక ఆయన భాష, శైలి చాలా సున్నితంగావుండి హృదయానికి హత్తుకునేలా వుంటాయి. ఆయన కవిత్వంలో బలం అంతా ఆయన తీసుకునే ఇమేజెస్. అవి అద్భుతంగా వుంటాయి. అన్నీ దాదాపుగా మనం రోజూ చూసే, అనుభూతించే అంశాల్లానే అనిపిస్తాయి. కానీ వాటిల్లో ఒక ఫ్రెష్ నెస్, టచ్ నెస్ మనల్ని కదిలిస్తుంది. మనసు కదిలిపోతుంది.

**'గగన సీమలో ఆకాశం / అతుకులు అతుకులుగా విడిపోతున్నది, / ఎన్ని ప్రాంతాల్నుంచి / ఈ గుడారం విడిపోతున్నదో /**

**నా కవిత్వంతో రోజంతా ఒక్కో కుట్టూ కుడుతూ / మెలికల కుట్లేస్తున్నా'** లాంటి సున్నితమయిన భావాల్ని చదివిన తర్వాత ఆయన కవిత్వం నాపై గొప్ప ప్రభావాన్ని కలిగించింది.

**ఇంకో కవితలో**

**'భయపడకు నేనున్నాను / భయపడకు నేనున్నాను**

**ఆ ఒంటరి ఆకు/ చెట్టుకు ధైర్యాన్నిస్తూ/ చెబుతూనే వుంది'** లాంటివి చదివాక అనువదించాలి అనుకున్నాను.

**చారిత్రక మాస పత్రిక- బి.ఎన్.శాస్త్రి గారి మానస పుత్రిక మూసి గురించి?**

గొప్ప చారిత్రక నేపథ్యం ఉన్న 'మూసీ' అంటే నాకెంతో అభిమానం. ఇన్ని దశాబ్దాలుగా మౌనంగా అది చేస్తున్న సాహిత్య చారిత్రక సేవ. అనితర సాధ్యమయింది. శాస్త్రి గారికి హృదయ పూర్వక నమస్సులు.

---

**ఇంటర్వ్యూ : డా. పత్తిపాక మోహన్**

**ఫోన్ : 99 66 22 9548**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3 19
UGC Care List Approved Journal
హైదరాబాద్ జనవరి : 2023

# వేమన్న బసవన్న భావసారూప్యత

**వేలేటి శైలజ,** పరిశోధక విద్యార్థి, కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం. ఫోన్ : 94415 44806

చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం వేమన 16వ శతాబ్దానికి చెందిన కవి. ఈయన సమాజంలోని మూఢ విశ్వాసాలపై పోరాడటానికి తన సాహితీ ప్రస్థానాన్ని కొనసాగించాడు. మానవుల నడవడికలో మరియు వ్యక్తిత్వ నిర్మాణంలో ఉన్నత స్థానం కొరకు అలతి అలతి పదాలతో కూడిన ఆటవెలదులతో ఆటవిడుపుగా నేర్చుకునే విధంగా పద్యాలను రచించి సమాజాభివృద్ధికి కాంక్షించిన ధార్మిక, ఆధ్యాత్మిక తత్వవేత్త. తెలుగునాట వేమన పద్యాలు తెలియని తెలుగువారు లేరంటే అతిశయోక్తి కాదు యుక్తవయస్సులో వేమన దురలవాట్లకు లోనయ్యాడు. దాని నుండి మరల్చడానికి ఆయనకి పెళ్లి చేశారు. అయినప్పటికీ, ఆయనలో ఎలాంటి మార్పు రాలేదు.



వేమన తన దురలవాట్ల ద్వారా భంగపడి విరక్తితో తన స్నేహితుడైన అభిరామయ్యతో కలిసి తగిన గురువును అన్వేషిస్తూ పర్యటించే క్రమంలో తంజావూరుప్రాంతంలోని అంబికా శివయోగి అనే ఋషిని కలిసి అతని వద్ద జ్ఞానోదయం పొంది అనేక యోగ రహస్యాలను తెలుసుకొని మోక్షమార్గంలో పయనిస్తూ సమాజానికి తన పద్యసూక్తుల ద్వారా మార్గనిర్దేశనం చేశాడు.



బసవన్న 12వ శతాబ్దికి చెందిన కవి. ఈయన వీరశైవ మత వ్యాప్తికి తన రచనల ద్వారా దోహదం చేశాడు బసవన్న. రచనా ప్రక్రియ వచనం. వచనం అనగా వచించునది, మాట్లాడునది అంటే బసవన్న మాటలే అతని వచనాలు. బసవన్న తన రచనల ద్వారా సమాజంలో మార్పును ఆశించాడు. మనుషుల్లో తక్కువ ఎక్కువ అనే భేదాలు ఉండవద్దు అని వివక్ష ఉండకూడదని సందేశాలు ఇచ్చాడు. బసవన్న వచనాలకు మూలం భక్తి. శివభక్తుల అనుభవాలను ఒకరికొకరు పంచుకునే వేదిక అనుభవ మంటపం. అనుభవ మంటపం లోని అనుభవాల సారమే బసవన్న వచనాలు శివ భక్తి ద్వారా సమాజంలో ఉన్నతమైన వ్యక్తుల నిర్మాణమే బసవన్న ఆశయం. సమాజంలోని కుల, వర్ణ, వర్గ, లింగ వివక్షత లేకుండా "కాయమేకైలాసము" అని శ్రామిక గౌరవానికి పెద్ద పీట వేస్తూ వెల్లువలా దూసుకొచ్చి దక్షిణాదిపై ప్రభావం చూపిన మతం వీరశైవ మతం. వీరశైవ మతానికి ప్రవక్తగా, ప్రచారకుడిగా బసవన్న ఆద్యుడు. వేమన తెలుగునాట బసవన్న కన్నడ ప్రాంతంలో సమాజ శ్రేయస్సుకు పాటుపడ్డారు. 12వ శతాబ్దంలో ఉన్న సామాజిక అసమానతలను బసవన్న తన వీరశైవ భక్తిమార్గంలో వచనాల ద్వారా రూపుమాపడానికి ప్రయత్నిస్తే, వేమన 16వ శతాబ్దంలో సామాజిక వివక్షతను మార్చడానికి ప్రయత్నించాడు బసవన్న తన వచనాలలో కులవృత్తికి ప్రాధాన్యమిచ్చాడు. శ్రమ గుర్తింపు ద్వారా ఆర్థిక అభివృద్ధి గౌరవం దక్కాలని ఆశించాడు. "సమాన పనికి సమాన వేతనం" అన్న నేటి రాజ్యాంగ సూత్రాన్ని బసవన్న ఆనాడే గుర్తించి సమాజంలో మార్పుకి ప్రయత్నించాడు. "కాచి కుమ్మరి అయ్యే ఉతికి చాకలి అయ్యే నేసి సాలే అయ్యే వేదములు చదివి విప్రుడయ్యే" అంటూ ప్రతి వృత్తికి సమాన ప్రాధాన్యత ఇచ్చాడు. మనిషి కుండలు కాల్చడం ద్వారా కుమ్మరివాడు అవుతున్నాడు. మురికి బట్టలు ఉతకడం ద్వారా చాకలి వాడు అవుతున్నాడు. బట్టలు నేయడం ద్వారా సాలెవాడు అవుతున్నాడు. వేదములు చదవడం ద్వారా విప్రుదు అవుతున్నాడు.

అంతేగాని మానవులందరూ శివాంశ సంభూతులే అందరూ సమానులే అనే భావన సమాజంలో నిలిపాడు. పని వల్ల మనిషికి కులములు ఏర్పడ్డాయి కానీ మనుషులంతా ఒక్కటే అందరిలోనూ శివుడే ఉన్నాడు అని బసవన్న చెపితే,

**"జీవు నరసి కనుడు శివుడే యగును**
**జీవుడు శివుడు సిద్ధము తెలియ రా"**

అంటూ సకల జీవులు శివ స్వరూపమే, భేదాలు మానమని వేమన తెలియజేస్తాడు అలాగే, "కులముకన్న గుణము ప్రధానము" అని ఎరుక పరుస్తాడు శ్రమైక జీవన గౌరవాన్ని బసవన్న కోరితే "శ్రమము లోన పుట్టు సర్వము శ్రమయేఅవును" అని వేమన చాటాడు.

ఒక చోట బసవన్న "దేవుడు ఒక్కడు నామాలు వేరు" అంటే, అదే భావనతో తో లిపసుల వన్నె వేరు పాలెల్ల ఒక్కటి" అని వేమన చాటాడు. బసవన్న వచనాలు కన్నడంలో అనేకంగా ప్రచురింప బడ్డాయి. బసవన్న గురించిన అనేక గ్రంథాలు రచింపబడ్డాయి. అతని వచనాలపై జీవితంపై అనేక సిద్ధాంత వ్యాసాలు వచ్చాయి. వేమన పద్యాల పైన కూడా తెలుగునాట అనేక పరిశోధనలు, సిద్ధాంత వ్యాసాలు వెలుగుచూశాయి. అతని రచనలపై అనేకమంది వ్యాఖ్యాన గ్రంథాలు రచించారు. వేమన బసవన్న కాలాలలో సుమారు నాలుగు శతాబ్దాల అంతరం ఉన్నప్పటికీ, వారిద్దరి రచన ప్రక్రియలు వేరే అయినప్పటికీ, వారి ధ్యేయము, ఆశయము ఒక్కటే. బసవన్న తన కాలంలో ఉన్న సామాజిక అంతరాలను తన రచనల ద్వారా ఆక్షేపిస్తే, వేమన తన కాలంలో ఉన్న సామాజిక రుగ్మతలను తన పద్యాల ద్వారా అధిక్షేపించాడు. దీని ద్వారా వారిద్దరి భావాలు ఒకటే అని మనకు తెలుస్తుంది. ఇది కాకుండా బసవన్న బిజ్జలుడి ఆస్థానంలో దండనాయకుడుగా పని చేస్తున్నప్పుడు జంగమదేవరలకు భూరి దానధర్మాలు చేస్తాడు. ఆ విషయాన్ని తోటి ఉద్యోగులు బిజ్జలుడికి ఫిర్యాదు చేస్తారు. రాజు బసవనను పిలిపించి లెక్కలు అడుగుతాడు. అప్పుడు బసవన్న చాలా ధీటైన సమాధానాలు చెప్తాడు. పరమేశ్వరుడి భక్తి అనే కామధేనువు, శివ భక్తి అనే కల్పతరువు, కామారి భక్తి అనే చింతామణి తన దగ్గర ఉండగా పరాయి సొమ్ము నేనెందుకు వాడతాను అంటూ అడవిలో ఉండే సింహం గడ్డి మేస్తుందా? ఏనుగు పిల్లలు పంది పాలు తాగుతాయా? క్షీర సాగరంలో విహరించే హంస మురికినీటిలో విహరిస్తుందా? అంటూ తన దగ్గరున్న ధనంతో కూడిన పెట్టెలను తీసి చూపగానే అందులో లెక్క కు సరిపోయే ధనం ఉంటుంది. అది చూసి రాజు ఆశ్చర్యపోతాడు. ఈ సంఘటన బసవన్న యొక్క భక్తి ప్రపత్తులకు ఉన్నతమైన వ్యక్తిత్వం నిజాయితీకి ప్రతీక. అలాగే వేమన కూడా తనకు జరిగిన అవమానానికి విరక్తితో యోగిగా మారి జనంలోని మురికిని పక్షపాతాన్ని మోసాలను ప్రక్షాళన చేయడానికి అనేకమైన నీతిని, మంచితనాన్ని లోకజ్ఞతను బోధించే పద్యాలను జనబాహుళ్యంలోకి తీసుకెళ్లి తన ప్రబోధాల ద్వారా సమాజంలోని చెడుని నిర్మూలన చేయడానికి పూనుకొన్నాడు. దీని ద్వారా వేమన వ్యక్తిత్వం మనకు తెలుస్తుంది.

బసవన్న హైందవ మతాన్ని సంస్కరించిన విశ్వ గురువుగా కనిపిస్తాడు. సమాజంలోని భేదాలు తొలగించడానికి లింగాయత ధర్మం స్థాపించిన యుగకర్త. చిన్నతనంలోనే పురాణ గాథలను అవగాహన చేసుకున్న బసవన్న కర్మకాండలపై నమ్మకం పోయి ఉపనయనాన్ని తిరస్కరించి కూడల సంగమ అనే పుణ్యక్షేత్రం చేరి సంగమేశ్వరుని దయకు పాత్రుడై కళ్యాణపురం చేరుకున్నాడు.

అక్కడ బిజ్జలుని ఆస్థానంలో చిన్న ఉద్యోగిగా చేరి నమ్మకం సంపాదించుకుని అధికారిగా పదోన్నతిని పొందాడు. బసవన్న వేలమంది జంగమదేవరలకు మృష్టాన్న భోజనాన్ని ప్రతిరోజు అందించేవాడు. భోజనానంతరం తన వచనాలు ఉపదేశించేవాడు దీనికి అనుభవ మంటపం వేదికగా మారేది.

వేమన బసవన్న ఇద్దరి రచనల సారం ఒకటే. "మనుషులంతా ఒకటేనని అందరికీ బట్ట, ఇల్లు, తిండి, జ్ఞానం, వైద్యం సమానంగా అందాలని, కులాలు ఉపకులాలు లేవని, అందరూ శివాంశ సంభూతు లేనని, శివుడే సత్య, దైవ, ధర్మ ప్రతిరూపమని, దేహమే దేవాలయమని, స్త్రీ పురుష లింగ భేదాలు లేవని, శ్రమను మించిన సౌందర్యం లేదని, భక్తి కన్నా సత్ప్రవర్తన లేదని, స్వర్గము నరకము లేదని" వేమన బసవన తమ రచనల ద్వారా సమాజానికి తెలిపారు.

"నా కాళ్ళే స్తంభాలు. దేహమే దేవాలయము. తల పసిడి కలశం అయ్యా" అని అని అంటే, "దేవుడనగ వేరె దేశమందున్నాడె దేహి తోడ కూడి దేహమందు" అని అని వేమన అంటాడు అలాగే ఇంకోచోట "కుక్కకు కొబ్బరి రుచిస్తుందా" అని బసవన్న అంటే "చెప్పు తినెడి కుక్క చెరుకు తీపెరుగునా?" అని వేమన చెప్తాడు. ఇలా ఉదహరించ కుంటూ పోతే వేమన బసవన్నల భావసారూప్యత చాలాచోట్ల మనకు కనబడుతుంది. బసవన్న వేమన ఇద్దరూ యుగకర్తలు, తాత్వికులు, మహా మానవతావాదులు, సిద్ధాంతకర్తలు మాత్రమే కాకుండా నూతన వ్యవస్థను పాదుకొల్పాలని భావించిన సృజనశీలురు. తమతమ కాలాల్లో కొనసాగుతున్న సాంఘిక అధర్మాలు అనాచారాలు వివక్షతలు ఖండించడంలో ఎవరి ప్రత్యేకత వారిదే. తమ అభిప్రాయాలను సులభంగా ప్రజలకు అందించడం కోసం బసవన్న వచనాలు సందేశాలు అయితే, వేమన ఆటవెలదులతో ప్రజల్లో నూతన చైతన్యాన్ని కలిగించడం కనిపిస్తుంది. వీరి కాలాలు వేరైనా వీరి వ్యక్తిత్వం, అంతరంగం ఒకేలా కనిపిస్తుంది వీరిద్దరూ సమాజాభివృద్ధి కోసం చేసిన ప్రయత్నాలపై తులనాత్మక అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2023

# భారతీయాకరణ - 8

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయాకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయాకరణ. భారతీయాకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయాకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయాకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయాకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత - భారతీయత మధ్య గల తేడా, భారతీయాకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.

ఆంగ్లేయులీ దేశాన్ని పాలిస్తున్నంతకాలం, ఈ దేశం పై తమ అధికారాన్ని నిలుపుకోవడానికి మెకాలే రీతి భారతీయుల వర్గాన్ని సృష్టించడంలోని తమ ఉద్దేశాన్ని రహస్యంగా ఏమీ దాచుకోలేదు. అధికంగా ఆంగ్లేయాకరింపబడిన వారిలో కొందరు- నెహ్రూ కుటుంబానికి చెందినవారి వంటివారు- స్వాతంత్ర్యోద్యమ రాజకీయాలలోకి గాంధీ గారి ప్రభావం కారణంగా ఆకర్షింపబడినా రనేది సత్యమయిన విషయం. సాగుతున్న ఈ పరిస్థితులలో తమకుతామై వారు బహిరంగంగా ఇమిడిపోయినా గూడా, వారికి ఆంగ్లం మీద, యూరోపియ జీవిత విధానం మీద, తదాలోచనారీతి మీద అంతరికంగా ఉన్న విశ్వాసం, ఎన్నిక వారిని వదిలిపెట్టలేదు. అందుకనే, గాంధీజీ తనకూ జవహర్ లాల్ నెహ్రూకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గూర్చి- ఒకవేళ కొంతకాలం ఆంగ్లేయులు మనదేశంలో ఉన్నగూడా, ఆంగ్లత్వం మాత్రం ఈ దేశంలోంచి తప్పక పోవలెనని తాను వాంఛింపగా, ఆంగ్లేయులు ఈ దేశంలో నుంచి తప్పక పోవలెననీ, కానీ ఆంగ్లత్వం మాత్రం ఉండవలెనని నెహ్రూ వాంఛిస్తాడు - అని తరచుగా అంటూ ఉండేవారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో స్వాతంత్ర్య సంపాదన అన్న ఒక్క అంశం మీదనే గాంధీజీ తన సర్వదృష్టినీ కేంద్రీకరించడం మూలంగా ఆ ఇరువురు మహా వ్యక్తుల ధోరణులలోని మౌలికమయిన ఈ వ్యత్యాసం ఆనాడు ఎక్కువమంది దృష్టికి రాలేదు. కాని గాంధీ గారే మరికొంత కాలం జీవించి ఉన్నట్లయితే స్వతంత్ర భారతదేశపు ఆర్థిక సాంఘికాది విషయాలకు సంబంధించిన అనేకాంశాలలో ఈ వ్యత్యాసం తప్పకుండా బయటపడి ఉండేది.





ఆర్థిక విద్యారంగాలలో భారతీయ దృక్పథం లేకపోవడం మరింత స్పష్టంగా గోచరిస్తుంది. భారతదేశం లోని కొన్ని వాస్తవిక పరిస్థితులు, USA,USSR ఇంకా అట్లాంటి పశ్చిమ దేశాలలోని పరిస్థితులకన్నా చాలా భిన్నంగా ఉన్నయి. ఉదాహరణకు USA, USSR లలో కావలసినంత భూమి ఉన్నది. మిగులు మూలధనం బోలెడంత ఉన్నది. శ్రామికుల సంఖ్య చాలా తక్కువ. అందుకని ఆదేశాల ఆర్థిక విధానం తప్పనిసరిగా "మూలధన కేంద్రీకృతం" (Capital intensive) కావలసి వచ్చింది. మరి భారతదేశంలో చూస్తే, భూమి తక్కువ. మూలధనం (capital) తక్కువ, జనాభా మాత్రం ఎక్కువ - మనుష్య శక్తి అధికం - ఇందులో 80 శాతం పల్లెల్లో జీవిస్తున్నది. వ్యవసాయంతో గడుపుతున్నది.

ఈ వాసవికతలు ఆధారంగా, ఆహార వస్తువుల, జీవితావసర వస్తువుల ఉత్పాదనకు అధిక ప్రాధాన్య మిస్తూ, చేతినిండా పనికల్పించే విధంగా పల్లె ప్రాంతాల్లో వ్యవసాయం మీద అధికంగా దృష్టి

కేంద్రీకరిస్తూ భారతదేశం "శ్రమ కేంద్రిత" (Labour intensive) ఆర్థిక విధానాలను, తప్పనిసరిగా అనుసరించి ఉండ వలసింది. ఇది జరిగి ఉండినట్లయితే, సామాన్యుడి బ్రతుకు మెరుగయి ఉంటే, మొత్తం ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన మార్పు వచ్చి ఉ ండేది. అంతేకాదు, భారీ పరిశ్రమల అభివృద్ధికీ, వాటిని నిలుపుకొని విస్తృత పరుచుకోవడానికి వీలుగా కొనుగోలు శక్తిని పెంచే వనరులు అధికం అయ్యేవి.

కాని పండిత నెహ్రూ పాశ్చాత్య దేశాల ఆర్థికాభివృద్ధిని చూచి మంత్ర ముగ్ధుడయిపోయినాడు. సామ్యవాదపు అందమైన ఊహలు, మార్క్స్ లెనిన్ లు సూచించిన ప్రణాళికా విధానం ఆయన మేధను ముట్టడించినయి. దానితో భారతదేశ జీవితపు వాస్తవికతలకు పూర్తిగా దూరమయినారు. ఆ కారణంగా 18 సంవత్సరాల తన పాలనా నిర్వహణ కాలంలో భారతీయార్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసినాడు. అవాస్తవికమయిన ఆర్థిక విధానాలతో నెహ్రూ కుటుంబం రేపిన కల్లోలం, స్వాతంత్ర్యం తరువాత ఈ 22 సంవత్సరాలలో మన ప్రజల సామాన్య జీవిత పరిస్థితులను సరిగా పరిశీలిస్తే, ఎంత తీవ్రమైనదో స్పష్టంగా నిర్ణయించవచ్చు. విదేశాల నుంచి సులభంగా లభించే ఆర్థిక సహాయాలూ, అప్పులూ, పెద్దయెత్తున విరజిమ్మబడిన నోట్ల ముమ్మరం,ఈ డబ్బులో అధిక భాగం అనుత్పాదకాంశాలమీద అధికంగా ఖర్చు చేయడం వీటితో దేశం తీవ్రమయిన ద్రవ్యోల్బణంలో చిక్కుకుపోయింది. తత్కారణంగా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జీవితావసరాలవస్తువుల ధరలు 400 శాతం పెరిగినయి. ఫలితంగా, పెరుగుతున్న ధరలకూ, వచ్చే ఆదాయానికీ ఎక్కడా పొత్తు కుదరక సామాన్యుడి బ్రతుకు 1947 నాటి కన్నా మరింత ఘోరంగా తయారయింది.

ఈ విధమయిన ఆర్థిక వ్యాధికి గల కారణాలను నిశితంగా పరిశీలించడానికి బదులు భారతీయార్థిక విధానంలో సామ్యవాదాన్ని జొప్పించడం జరుగుతున్నది. ఇది, ఈ దేశంలో సామ్యవాదాన్ని బలపరిచే వారిలో ప్రధానులయిన కమ్యూనిస్టులకు వారి అనుయాయులకు భారతదేశంలో శ్రామికరాజ్యాన్ని ఏర్పాటు చేయడానికి ఒక ప్రాథమిక సాధనమవుతున్న అంశం గుర్తింపబడటం లేదు. ఆ ఉద్దేశ్యంతోనే వారు సామ్యవాదం పేరిట దేశంలోని అన్ని రకాలయిన ఉత్పాదక సాధనాలను పంపిణీ రీతులను ప్రభుత్వ యాజమాన్యంలోకి తీసుకురావలెనని వత్తిడి చేస్తున్నారు. దేశ ప్రజలందరినీ తమ తమ బ్రతుకు కోసం ప్రభుత్వం మీద ఆధారపడి ఉండేట్లు చేయడమే వారి సామ్యవాదం యొక్క ప్రధాన లక్ష్యం. ఇది ఒకసారి గనుక సాధింపబడినట్లయితే, ఆలోచనా విధానాన్ని మొత్తంగా ఒక గాడిలో నడిపించడం, తద్ వ్యతిరేకతను అణచడం పెద్ద కష్టమేమీ కాదు. వారి తరహా సామ్యవాదానికి సామాన్య ప్రజల శ్రేయస్సుతో పనిలేదు. అందుకే, తమను సామ్యవాద దేశాలుగా చెప్పుకుంటున్న ఇజ్రాయిల్, స్వీడన్, పశ్చిమ జర్మనీ మొదలయిన వాటిని సామ్యవాద దేశాలుగా వారు గుర్తించరు. ఆ దేశాలలో సామ్యవాదం అంటే, ఆర్థికవ్యవస్థ మీద ప్రభుత్వ నిరంకుశ యాజమాన్యం ఉండటం కాదు. సామాన్య ప్రజలకు తగిన జీవిత స్థాయిని సమకూర్చుతూ వారి వారి ప్రజాస్వామిక స్వేచ్ఛలనూ, సంస్థలనూ కాపాడటం దాని లక్ష్యం. భారతదేశంలో సామ్యవాదాన్ని గూర్చి ఊరికే బాకాలుదేవాళ్లందరూ ఆదేశాలను పెట్టుబడిదారీ దేశాలుగా నిందిస్తూంటారు. వారిదృష్టిలో సామ్యవాద దేశాలంటే కేవలం రష్యా, చైనా వంటి కమ్యూనిస్టు దేశాలు మాత్రమే.

అందుకని మన ఆర్థిక విధానాల, వాటిని గూర్చిన ఆలోచనల భారతీయీకరణ అత్యంతావశ్యకమవుతున్నది. ఇతర దేశ ప్రజల అనుభవాలను మనం ఉపయోగించుకొనడంలో తప్పేమీ లేదు. అయితే, మన దేశ పరిస్థితి వంటి స్థితి గల దేశాల అనుభవాలు మాత్రమే, ఏ మాత్రమయినా ప్రయోజనకరంగా ఉంటాయి. అందుకనే మన రాష్ట్రపతి వి.వి.గిరి, ఈ దేశంలోని లక్షలాది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభించవలెనంటే, జపాన్‌ను ఆదర్శంగా తీసుకొనవలసి ఉంటుందన్నారు. భారతదేశం కన్నా జపాన్ జనాభాతో పిక్కటిల్లింది. 1944 లోని హిరోషిమా బీభత్సం నుంచి బయటపడి, అన్ని రంగాలలోనూ ప్రజాస్వామిక వ్యవస్థలను రక్షించుకొంటూ సాధించిన అభివృద్ధి ఈనాడు ప్రపంచం మొత్తం మీదనే అద్భుతమయిన విషయం. ఆ దేశపు అనుభవాన్ని లాభకరంగా భారతదేశం ఉపయోగించుకోవచ్చు. కానీ, ప్రతి విషయంలోనూ, అయితే అమెరికా, లేదా రష్యా కళ్ళతో మాత్రమే చూచే మన దేశ నాయకత్వపు మానసిక దాస్యం మన ఆర్థిక విధానాలనూ తదాలోచన లనూ పునర్నవీకరించడంలో ఆటంకమవుతున్నది. అందువల్ల ఆర్థిక రంగంలో కూడా భారతీయీకరణ ప్రస్తుతావసరమవుతున్నది.

మన విద్యావిధానం గూడా ఆంగ్లేయ విద్యా విధానాన్ని అనుసరించే తయారు చేయబడింది. ఈ విధానాన్ని భారతదేశంలో ప్రవేశపెట్టిన మెకాలే ఉద్దేశ్యంలో, ఆయన ఒక చోట వ్రాసినట్లు – భారతీయ సర్వ విజ్ఞానం బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయంలోని బీరువాలోని ఒక అరలో సమకూర్చి ఉంచిన విజ్ఞానానికి గూడా సమానం కాదు. ఇదీ భారతీయులనూ, వారి ప్రాచీన విజ్ఞానాన్ని గూర్చి ఆయన భావన.

ఈ ఆంగ్లేయ విధానం, ఆలోచనలోనూ, వ్యవహారంలో ప్రవృత్తి లోనూ, భారతీయులను ఆంగ్లేయులుగా తయారుచేయడానికీ, ఈ దేశంలో ఆంగ్లేయ పాలనా నిర్వహణ యంత్రాంగం సరిగా పని చేయడానికి క్రింది స్థాయిలో ఉపయోగపడే వ్యక్తుల్ని తయారు చేసేందుకు స్పష్టంగా ఉద్దేశింపబడింది. అందువల్ల జ్ఞాన విజ్ఞానాది రంగాలన్నింటిలోనూ పాశ్చాత్యాధిక్యం భారతీయ విద్యార్థులను గాఢంగా ప్రభావితం చేసే విధంగా ఆంగ్లేయులు చూచుకొన్నారు. రోమన్ న్యాయ సూత్రాలాధారంగా ఏర్పడ్డ తమ ఆంగ్ల న్యాయ

సూత్రాలను ఈ దేశంలో ప్రవేశపెట్టినారు. వారు ప్రవేశపెట్టిన న్యాయ విద్య, ధర్మశాస్త్రం మొత్తం రోమన్ ధర్మశాస్త్రం మీద ఆధారపడినదే. కాని, కొన్ని విధాలుగా చూస్తే, రోమన్, లేదా పాశ్చాత్య ధర్మశాస్త్రం కన్నా ఎంతో అభివృద్ధి పొంది, ఆధునికంగా కూడా అనుసరణ యోగ్యమై ఉన్న భారతీయ న్యాయశాస్త్రాన్ని, ధర్మశాస్త్రాన్ని గూర్చి ఒక్కమాట కూడా న్యాయ విద్యా ప్రణాళికలో చేర్చబడలేదు.

ఒక దేశపు న్యాయశాస్త్రం, ఆ దేశపు జీవిత మూల్యాలనూ, నాగరికతనూ, సాంఘిక- ఆర్థిక విధానాలోచనలనూ ప్రతిబింబిస్తుం దనేది సర్వవిదితమే. అందువల్ల న్యాయ విద్యా, న్యాయ విధానాల భారతీయీకరణ అవసరం.

వైద్య విద్యారంగంలో చూస్తే, దేశీయ వైద్యరీతులన్నింటినీ సంపూర్ణంగా నిర్లక్ష్యం చేస్తూ అలోపతి విధానం సింహాసనాన్ని ఆక్రమించింది. ఏ అమెరికనులో, యూరోపియులో కొన్ని ఆయుర్వేద ఔషధ శక్తులను పొగిడినప్పడే, వాటికి ఈ దేశంలోని అధికారవర్గంలో కొంత కొంత గౌరవం లభిస్తున్నది. భారతీయ వైద్యవిద్యా పట్టభద్రు లకు గ్రీకు వైద్యుడయిన హైపోక్రటీస్ (Hypocrites) ప్రమాణం. కాని వారిలో ఏ కొందరికయినా భారతదేశంలోని ధన్వంతరిని గూర్చి గానీ, చరకుడు సుశ్రుతుడూ మొదలయిన ఔషధ - శస్త్రచికిత్స వేత్తలనుగూర్చిగానీ ఏమాత్రం పరిజ్ఞానమూ ఉండటం లేదు. భారతీయ వైద్య పట్టభద్రుడు హైపోక్రటీస్‌కు బదులు ధన్వంతరి మీద చరకునిమీద ఎందుకు ప్రమాణం చేయగూడదు, భారతీయ వైద్యవిద్యా ప్రణాళికలో ఆయుర్వేదానికి చెందిన ప్రాథమిక విజ్ఞానం కొంతయినా ఎందుకుండకూడదు?

పాఠశాలలోనూ, కళాశాలలోనూ ఆంగ్లభాషా ప్రాధాన్యం అధికమయి భారతీయ భాషలు నిర్లక్ష్యం చేయబడుతున్నయి. కొన్ని విజ్ఞాన శాఖలలో విజ్ఞాన సముపార్జనకు ఆంగ్లం కన్న గూడా అధిక సంబంధం గల కొన్ని విదేశ భాషలు గూడా త్రోసివేయబడినయి. ఇదంతా స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గూడా మన విద్యావిధానం భారతీయేతరంగానే సాగుతున్నదనడానికి, ఉదాహరణ మాత్రమే కాదు, దీని భారతీయీకరణ ఆవశ్యకమనడానికి మరొక కారణం గూడ.

ఈ విధంగా భారతీయీకరణ అన్న భావన, దాని కార్యక్రమం ఏమాత్రమూ సంకుచితమయింది కాదు. సమాజంలోని అన్ని రంగాలనూ, జాతీయ ప్రవృత్తులను ఇది పొదువుకొంటుంది. ఇట్లా, కొంచెం ఎక్కువ తక్కువలుగా, కుల, మత, భాషా నిమిత్తం లేకుండా భారతీయులందరికీ ఇది వర్తిస్తుంది. మనలో ప్రతివాడు ఆలోచన లోనూ, ప్రవృత్తిలోనూ ఉత్తమ భారతీయుడు కావటం నేర్చుకొనవలసి ఉన్నది.

అయితే, దేశ సమగ్రతకూ, జాతియైక్యతకూ వాటిల్లే తత్ క్షణ ప్రమాదాల దృష్ట్యా మన సమాజంలోని కొన్నివర్గాల వారి భారతీయీకరణ మరింత త్వరితంగా ఆవశ్యకమవుతున్నది.

ప్రాధాన్య వివక్షతోచూస్తే, ఇట్లాంటి వారిలో మొదట వచ్చేది కమ్యూనిస్టులు, పైకి కనిపిస్తున్న విధంగా వారు ఈనాడు CPI - భారత కమ్యూనిస్టు పార్టీ - అనీ CPI(M) - భా.క.పా (మార్క్సిస్టు) అనీ నక్సలైట్లుగా ప్రసిద్ధి చెందిన CPI(ML)- భా.క.పా (మార్క్సిస్టు లెనినిస్ట్) - అని మూడు వర్గాలుగా చీలిపోయినారనేది సత్యమే. అయితే, CPI కి చెందిన శ్రీ ఇంద్రజిత్ గుప్త లోకసభలో చెప్పినట్లుగా - CPI (ML) అనేది CPI (M) గర్భాన్ని చీల్చుకొనిరాగా CPI గర్భం నుంచి CPI (M) బయటపడింది. నిజానికి CPI కూడా సోవియట్ యూనియన్ లోని కమ్యూనిస్టు పార్టీ విస్తరణలో ఒక శాఖగా ఏర్పడింది మాత్రమే. (సశేషం)




## శ్రీ బి.ఎన్.శాస్త్రి పురస్కార ప్రదానం.. డా. గుంజి వెంకటరత్నం గారికి



## సాధన పంచకమ్

**క్షుద్వ్యాధిశ్చ చికిత్స్యతాం ప్రతిదినం భిక్షౌషధం భుజ్యతాం**
**స్వాద్వన్నం న తు యాచ్యతాం విధివశాత్ ప్రాప్తేన సంతుష్యతామ్**
**శీతోష్ణాది విషహ్యతాం నతు వృథావ్యాం సముచ్చార్యతాం**
**ఔదాసీన్య మభీప్స్యతాం జన కృపా నైష్ఠుర్య ముత్సృజ్యతామ్॥**

**తాత్పర్యం :** 1. ఆకలి రోగమును నయం చేసికొనవలెను. 2. ప్రతిదినము భిక్షాన్నమును ఔషధముగా భుజింపవలెను. 3. రుచికరమైన ఆహారమును కోరకుండా ఉండవలెను. 4. విధివశాత్తుగా లభించిన దానితో తృప్తి చెందవలెను. 5. శీతోష్ణాదుల వంటి ద్వంద్వములను సహించవలెను. 6. వ్యర్థమైన మాటలను మాట్లాడకుండా ఉండవలెను. 7. ఉదాసీనమును ఇష్టపడవలెను. 8. జనుల యొక్క కృపను కోపగించుటను (నిష్ఠురత్వమును) విడిచి పెట్టవలనెను.

**వివరణ**

**3. స్వాద్వన్నం న తు యాచ్యతమ్ –**

రుచికమైన ఆహారమును ఆశించకుండా ఉండవలెను. ఇంతకు ముందు చెప్పుకొన్నట్లుగా ఆహారాన్ని భిక్షగా స్వీకరించి ఔషధంవలె స్వీకరించాలి. రసవర్జ్యం ... అన్నట్లు రుచిని కోరకుండా ఆకలివేళ తన ముందుకు వచ్చిన ఆహారాన్ని భగవంతునికి నైవేద్యం పెట్టి, దానిని భగవత్ ప్రసాదంగా భావించి సేవించాలి. అప్పుడది ఔషధంగా మారి ఎటువంటి రోగాలు రాకుండా కాపాడుతుంద్మిలై . రోగం తగ్గడానికి వైద్యుడు ఇచ్చిన చేదు మందును మ్రింగినట్లుగా, ప్రాణధర్మమైన ఆకలిని చల్లార్చడానికి రుచులు కోరకుండా భగవంతునికి నివేదించిన ఆహారాన్ని భిక్షగా, ఔషధంగా భుజించాలి సాధకుడు.

**4. విధివశాత్ ప్రాప్తేన సంతుష్యతామ్ –**

విధివశాత్తుగా అంటే ప్రారబ్దవశాత్తుగా లభించిన దానితో తృప్తి చెందవలెను. గత జన్మలలో కూడబెట్టిన కర్మబీజములే సంచిత కర్మలై ప్రస్తుత జన్మలో ప్రారబ్ద ఫలాలుగా అనుభవింపబడుతున్నాయి. ఇక ఈనాడు పురుషార్థంగా చేస్తున్నదంతా రాబోవు భవిష్యజ్జన్మకై ఆగామిగా ఖాతాలో చేరిపోగలదు.

కర్మఫలాన్ని ప్రసాదించేది భగవంతుడు. కావున ఈ జన్మలో లభించెడు ప్రారబ్ద ఫలాన్ని భగవంతుడు అనుగ్రహించిన ప్రసాదంగా భావించి, ప్రసన్నంగా, పరితాపం చెందకుండా అనుభవించాలి. ఎప్పుడు? ఎవరికి? ఏది? ఎట్లు? ఎంత? అందించవలెనో ఆ సర్వజ్ఞుడైన భగవంతునికే ఎరుక. ఏది ఎందుకు అందనిదో, ఏది అందకుండా ఎందుకు పోయిందో ఎవరికీ అంతుబట్టదు. కావున మనిషికి తన జీవితంలో ప్రారబ్ధఫలంగా లభించిన దానిని ప్రసాదంగా భావించి సంతృప్తిని చెందెను సదభ్యాసమును పెంపొందించకోవలెను అని చక్కని ఉపాయం చెప్పుతుంది సాధన పంచకమ్.

## సత్సంగం





### ఆత్మజ్ఞానం

ఆత్మజ్ఞానమంటే ఆత్మగా ఉండటమే. ఆత్మగా ఉనికే. అంటే నీ ఉనికే. ఎవ్వరూ తన ఉనికిని కాదనలేరు కదా. కళ్ళని స్వయంగా చూచుకోలేక పోయినా, తనకి కళ్ళు లేవని ఎవ్వరూ అనలేరు కదా. అద్దం ముందు నిలబడి నీ కళ్ళని వేరుగా చూస్తావు – అట్లాగే, ఆత్మ కూడా వేరేదానిగా భావించాలనుకుంటావు.. ఉన్న చిక్కంతా ఇదే. ఎప్పుడూ ఈ వేరేవిధంగా భావించుకోవటానికి అలవాటు పడిపోవటం వల్లే నీ గురించి జ్ఞానాన్ని పోగొట్టుకున్నావు. ఆత్మని అట్లా భేదభావంతో ఊహించలేం. ఆత్మని తెలుసుకోవలసిం దెవరు? జడ పదార్థమైన శరీరం తెలుసుకోగలదా? ఎప్పుడూ నీ గురించి చెప్పుకుంటావు. ఆలోచిస్తావు. కాని ప్రశ్నించినప్పుడు ఆ "నేను" ఎవరో తెలియదంటావు. నువ్వే ఆత్మవి. అయినా ఆత్మని తెలుసుకోవట మెట్లా అని అడుగుతావు. ఇందులో భగవంతుని లీలగాని, దానిలో కాఠిన్యం గాని ఎక్కడ నుంచి వచ్చాయి? ఈ ఆత్మని మనుష్యులు గుర్తుంచుకపోవటం వల్లనే శాస్త్రాలు మాయ గురించీ, లీల గురించీ చెప్తాయి.

ఆత్మజ్ఞానం ఇతరులకు తప్పకుండా సహాయపడుతుంది. అన్నింటికన్నా గొప్ప సహాయమదే అవుతుంది. అయినా, సహాయం చేయడానికి ఇతరులంటూ ఎవరైనా ఉంటేగా. ఆత్మసాక్షాత్కారం పొందిన వ్యక్తి ఆత్మని తప్ప దేనినీ చూడడు. రకరకాల నగలలో ఉన్న బంగారమెంత? అని అంచనా వేసే కంసాలి, వాటిలోని బంగారాన్ని తప్ప దేనినీ పట్టించుకోనట్టే ఇదీను. నువ్వు శరీరంతో తాదాత్మ్యం చెందినప్పుడే ఇతర నామరూపాలుంటాయి. కాని దేహానికి అతీతమైన తరువాత అవి కూడా, దేహమంటే నీకు గల స్పృహవలె, మాయమవుతాయి.

చెట్లూ చేమలూ... ఆత్మకి భిన్నంగా ఉన్నాయా అవి? కనుక్కో, నువ్వు వాటిని చూస్తున్నానుకొంటున్నావు. ఆ భావం ఆత్మ నుండి లేస్తుంది. అదెక్కడ నుంచి లేస్తుందో కనుక్కో. ఆలోచనలు ఇంక ఉదయించవు. మిగిలేదల్లా ఆత్మే.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3 (25) హైదరాబాద్ జనవరి : 2023

గ్రంథాంతరంగం
20

# జానకమ్మ ఇంగ్లడ్ యాత్ర

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076



**"చింతకాయ తొక్కు చూచితే నోరూరు"** అంటారు తాళ్ళపాక అన్నమాచార్యులు. మరి, పాత చింతకాయ తొక్కు మరింత నోరూతుంది కదా!

అలాంటప్పుడు పోతం జానకమ్మ రాఘవయ్య అనే మద్రాసు నివాసిని 1873లో భర్త, సేవకులతో కలిసి ఇంగ్లండ్ యాత్ర చేసి, ఆ మధురానుభవాల్ని సాటి తెలుగువాళ్ల కూడా ఆస్వాదించాలని భావించి, వాటిని తెలుగులో పుస్తక రూపంగా గుదిగుచ్చిందంటే దాన్ని చదవడం భక్త రామదాసుకు రామనామం **'ఎంతో రుచి, ఎంతో రుచి, ఎంతో రుచి'** గా తోచినట్లు పాఠకులు ఈ పుస్తకం చదవడం ఎంతో ఆనంద దాయకమవుంది. గుడ్డిలో మెల్ల అన్నట్లు పోతం జానకమ్మ రాఘవయ్య గారి మనోల్లాసకరమైన, విజ్ఞాన దాయకమైన అనుభవాలు 1876లో "పిక్చర్స్ ఆఫ్ ఇంగ్లండ్" అనే పేరుతో ఇంగ్లీషు పుస్తక రూపంలో మద్రాసు నుంచి వెలవడింది. ఈ పుస్తకం లోపలి పేజీలో ఇది తెలుగు నుంచి అనువదింపబడిందనీ, పోతం జానకమ్మ రాఘవయ్య గారి సంపాదకత్వంలో వెలువడినట్లుగా చెప్పబడింది. ఈ సందర్భంగా ఇంగ్లీషు యాత్రా చరిత్రను పోతం జానకమ్మ గారే రాశారా లేదా, తెలుగులో రాయబడ్డ ఇంగ్లండ్ యాత్రను ఆమే ఇంగ్లీషులోకి అనువదించారా? అన్న ప్రశ్న రేకెత్తుతుంది.

**'జానకమ్మ ఇంగ్లండ్ యాత్ర'** 15వ పేజీలో ఈ పుస్తకపు ఆంగ్ల ప్రతి **'పిక్చర్స్ ఆఫ్ ఇంగ్లండ్'** ట్రాన్స్‌లేటెడ్ ఫ్రమ్ ది టెలుగు. ఎడిటెడ్ బై పోతన జానకమ్మ రాఘవయ్య 1876 అన్న మాటలు గమనార్హాలు. అలాంటప్పుడు ఇంగ్లీషులో అనూదితమైన మూల తెలుగు పుస్తకం పేరేమిటి? అది అచ్చయిందా? లేదా? పోతం జానకమ్మగారు తెలుగులో రాసి, దాన్ని ముద్రించారా? లేక లిఖిత ప్రతి ఎండకన్ను ఎరగకుండా దాగి వుందా? 'జానకమ్మ ఇంగ్లండ్ యాత్ర' లోని 15వ పేజీలో ఎడిటెడ్ బై పోతం జానకమ్మ రాఘవయ్య అని ఉంది. 'పిక్చర్స్ ఆఫ్ ఇంగ్లండ్' అనే ఆంగ్లానువాదాన్ని ఆమె మార్పులు, చేర్పులు, కూర్పులు చేసే బాధ్యత వహించిందా? అలాంటప్పుడు ఆ ఇంగ్లీషు పుస్తకాన్ని తెలుగు నుంచి ఇంగ్లీషులోకి అనువదించిన పుణ్యాత్ము లెవరు? ఒకవేళ పోతం జానకమ్మ ఇంగ్లీషులోకి రూపాంతరం చేసి వుంటే అనువాదకురాలు కూడా తానే అని చెప్పుకుని వుండేదిగా.

**'జానకమ్మ ఇంగ్లండ్ యాత్ర'** ను ఇంగ్లీషు నుంచి తెలిగించిన డా. కాళిదాసు పురుషోత్తం గారు **'భావోదయంలో విహంగ విహారం'** అనబడే పీఠికలో **"మద్రాస్‌లోని ఉన్నత వర్గాలతో ఆమె పరిచయాలను గమనిస్తే పర్యటనానుభవాలను ఇంగ్లీష్‌లో రాయగల సామర్థ్యమున్న వ్యక్తిగానే అనిపించింది."** (పేజి: 8) అని అంటారు. డా. కాళిదాసు పురుషోత్తం గారికి పోతం జానకమ్మ రాఘవయ్య గారి ఇంగ్లీషు రచనా సామర్థ్యం పట్ల నమ్మకం ఉన్నంత గాఢంగా నాకు లేదని చెప్పడానికి విచారిస్తున్నాను. అందుకు వత్తాసుగా ఈ సాక్ష్యాలు పొందుపరుస్తున్నాను. పోతం జానకమ్మ తన ఆంగ్లభాషా పరిచయం గురించి ఇలా అంటారు. **"ఓడ సిబ్బందితోను, సాటి ప్రయాణికుల తోను మాట్లాడానని అన్నప్పుడు మీలో కాస్త కుతూహలం కలిగి ఉంటుంది. నా ఆలోచనలను ఎదుటివాళ్లకు తెలియజేయగలిగినంత ఇంగ్లీష్ నాకు వచ్చు. అంటే కొద్దిగానే, ఆ పరిమిత జ్ఞానంతో నేనన్న మాటలను మా ఆయన ఎదుటి వాళ్లకు వ్యాఖ్యానించి వెలువరించే వారు. ఆయన నా పక్కన లేనప్పుడు నా ఆయా తనకొచ్చిన తప్పుల తడకల ఇంగ్లీష్‌లో నా మాటలను వివరించేది. ఏమైనా నా అభిప్రాయాలను చక్కగా వివరించి చెప్పగలిగే దాన్ని. ఎదుటివాళ్లు బాగానే అర్థం చేసుకొన్నట్లనిపించేది."** (పేజి: 34) పై మాటల వల్ల జానకమ్మ ఇంగ్లీషు భాషాజ్ఞానం అంతంత మాత్రమే అని బోధపడుతుంది. ఆమె తనకు తెలిసిన అల్ప, స్వల్ప ఇంగ్లీషు భాష గురించి మరోచోట ఈ విధంగా ప్రస్తావిస్తారు– **"నాకొచ్చిన తప్పుల తడక ఇంగ్లీషు అంతంత మాత్రమే అయినా, వాళ్ళ భాషను అర్థం చేసుకోవడంలో చిక్కులున్నా, నా పరిమితులేవో తెలిసినా, విక్టోరియా రాణి ఏలుబడిలో లేని దేశాలను కూడా చూసి రావాలనే కోరిక కలిగింది."** (పేజి: 97) జానకమ్మ ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం మిడి మిడి స్థాయిలోనిదేనని ఈ మాటలు సాక్ష్యమిస్తున్నాయి.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3 (26) హైదరాబాద్ జనవరి : 2023

పోతం జానకమ్మ రాఘవయ్య తమ యూరపు యాత్రానుభవాల్ని మొదట తెలుగులో రాశారా లేదా ఇంగ్లీషులో రాశారా అన్నది చర్చనీయాంశమే. జానకమ్మ తన ముందుమాటలో ఇలా అంటారు. **"ఈ పుస్తకం ముఖ్యంగా మన దేశ స్త్రీల కోసమే రాశాను. వాళ్లలో అత్యధికులు ఇంగ్లీష్ నేర్చుకోవడంలో గొప్ప పురోగతి సాధిస్తున్నారు. త్వరలోనే ఈ పుస్తకంలోని అభిప్రాయాలను సులభంగా గ్రహిస్తారని ఆశిస్తున్నా, వాళ్ల సముద్ర ప్రయాణాలను తలపెట్టకపోయినా"** (పేజీ: 17) ఆమె ఇంకా ఇలా అంటారు. **"భవిష్యత్తులో ఈ పుస్తకం తెలుగులో కావాలని ఇంగ్లీష్ రాని పాఠకులు అత్యధికులు కోరితే, అప్పుడా సంగతి ఆలోచిస్తాను."** (పేజీ:17) ఈ మాటలు గమనిస్తే పోతం జానకమ్మ తమ యాత్రా చరిత్ర Pictures of England ను మొదట1876లో ఇంగ్లీష్ ప్రచురించిందనీ, ఈ పుస్తకం తెలుగు ప్రతి కూడా సిద్ధంగా వుందనీ తెలుస్తుంది. ఆమె వ్యాపారస్తుల కుటుంబ స్త్రీ కాబట్టి తమ పుస్తకం ఇంగ్లీషులో వెలువడితే అధిక పేరు ప్రసిద్ధులతో పాటు స్వల్ప ధనలాభం కూడా చేకూరుతుందని ఆశించి వుండొచ్చు. ఒకవేళ ధనికురాలైన ఆమెకు పేరు ప్రఖ్యాతులే ముఖ్యమై, ఆర్థిక లాభం గౌణమై వుండొచ్చు కూడా. 1876లో వెలుగు చూసిన Picture of Englandకు మూలమైన తెలుగు ప్రతి అసలు అచ్చయిందా లేదా? లిఖిత రూపంలోనే వుండిపోయిందా? పోతం జానకమ్మ యూరపు యాత్రానుభవాలు కొక్కొండ వెంకటరత్నం పంతులు గారి సంపాదకత్వంలో వెలువడే **'శ్రీయాంధ్ర భాషా సంజీవని'** పత్రికలో వెలుగు చూసింది కూడా. ఆ తెలుగు వ్యాసం మనకిప్పుడు దొరకకున్నా దాని ఇంగ్లీషు అనువాదం జానకమ్మ గారే లేఖరూపంలో పంపితే మద్రాసు నుండి వెలువడే 'ఎథీనియం అండ్ డైయిలీ న్యూస్' దినపత్రికలో 1874 ఏప్రిల్ 18వ తేదీన అచ్చయింది. ఆమె తన ఇంగ్లీషు లేఖను పత్రికా సంపాదకులకు పంపుతూ **"ఈ లేఖలో తప్పులను సవరించి మీ పత్రికలో ప్రచురిస్తే నేను ధన్యురాలిని."** (పేజీ: 22) అని మనవి చేసుకుంది. పత్రికా సంపాదకులు ఆ లేఖను ప్రచురిస్తూ సమీక్షాత్మక వ్యాసాన్ని ప్రచురించారు. కానీ సంపాదక మహాశయులు రచయిత్రి పోతం జానకమ్మ **"ఉదాత్తమైన ఈ సాహస గుణాన్ని"** (పేజీ: 23) మెచ్చుకుంటూ, మరో వైపు **"ఇంగ్లండ్ వెళ్లినందువల్ల మనదేశంలో వాడుకలో ఉన్న తప్పుడు భావనలు, లోపాల పట్ల రచయిత్రికి కనువిప్పు కలిగింది. తన ప్రియతమ దేశం నాగరికతాభివృద్ధిలో ఎంత వెనకబడిపోయిందో బహుశా ఆమె గ్రహించి వుంటారు."** (పేజీ:23) అంటూ భంగ్యతరంగా భారతదేశ సభ్యత సంస్కార ఔన్నత్యాన్ని కించపరిచారు. పైగా **"యుగ యుగాలుగా పాతుకు పోయిన అశాస్త్రీయమైన భావజాలంతో జీవించే ఈ దేశీయులకు వాటిని వదిలించుకోవడానికి కొత్త విషయాలు తెలుసుకోవాలనే కాంక్ష ఒకటే స్ఫూర్తినిస్తుంది. దేశ పౌరులుగా ఇతర దేశాల పరిస్థితులను తెలుసుకోవాలనే ఆసక్తితో కొద్ది కాలమైనా విదేశాలకు వెళ్లి, అక్కడి ఆచారాలు, సంప్రదాయాలు, ఆ దేశాలు సాధించిన ప్రగతి గ్రహిస్తే తమ నాగరికతలో కూడా పురోభివృద్ధి సాధ్యమవుతుంది."** (పేజీ:26)

ఈ సమీక్షాత్మక వ్యాసం చివర్లో ఉన్న మాటల్ని మనం జాగ్రత్తగా చదివితే పోతం జానకమ్మ తెలుగులో తమ యాత్రానుభవాల్ని మొదట్లో రాశారనీ, ఆంగ్ల రచయితలెవ్వరో దాన్ని తర్వాత ఇంగ్లీషులోకి అనువదించి వుంటారన్న ధ్వని అవగతమవుతుంది కూడా. సంపాదక మహాభాగుల మాటలిలా వున్నాయి– **"ఈ లేఖ తెలుగులో రాసినది. కొద్దిగా ఇంగ్లీషుతో పరిచయం, మాతృభాషలో మంచి విజ్ఞానం ఉన్నవాళ్లు ఇందులోని భావాన్ని గ్రహించగలుగుతారు. ఈ మహిళ అన్నట్లు మంచి విషయాలను చదువుకోవడానికి అనువుగా ఎవరు రాసినా, వాటిని ఇంగ్లీషులోనికి అనువదించేవాళ్ళు తప్పక ఉంటారు."** (పేజీ: 26) మద్రాసు ప్రెసిడెన్సీలో అంతర్భాగాలైన ప్రజలు మాట్లాడే ప్రాంతీయభాషలోని రచనల్ని వాటి గుణం కొద్దీ, ఇంగ్లీషులోనికి అనువదించాలనే ఉత్సుకత, సంకల్పం ఆనాటి విద్వాంసులకు ఉండేదన్న సంగతి సూచితమవుతుంది ఈ మాటల్లో. ఇక పోతం జానకమ్మ రాఘవయ్య తమ యూరపు యాత్రనుభవాల్ని ఎలా వెల్లడించారో, ఆమె జిజ్ఞాస ఎటువంటిదో, దృక్పథం ఏ విధంగా వుండేదో తెలుసుకుందాం.

పోతం జానకమ్మ విద్యావతి, జిజ్ఞాసాపరురాలు, వివేకవతి, వినయవతి కూడా. ఆమె తమ ఇంగ్లండ్ యాత్రలో "కళ్లారా చూసి, అనుభవం లోకి తెచ్చుకున్న విషయాలనే "పిక్చర్స్ ఆఫ్ ఇంగ్లండ్" రాశానని వెల్లడించారు. (ముందుమాట పేజీ: 17) జానకమ్మ ఇంగ్లీషు భాష నేర్చినందువల్ల ఆనాటి సమాజంలో ఉన్నత వర్గాల వాళ్లతో కలిసి మెలిసి వ్యవహరించిందని తెలుస్తుంది. ఆమె తమ ఇంగ్లీషు యాత్రా కథనాన్ని ఆనాటి మద్రాసు ప్రెసిడెన్సీ ఆక్టింగ్ గవర్నరు విలియం రోజ్ రాబిన్సన్ భార్య జూలియా ఎలిజబెత్ రాబిన్సన్‌కు అంకితమిచ్చిందంటే, ఆమె సామాజిక స్థాయిని మనం ఊహించవచ్చు.

పోతం జానకమ్మ రాఘవయ్య రాసిన ఇంగ్లండ్ యాత్రానుభవాల్ని గురించిన లేఖ (ఏప్రిల్ 18,1874)ను మద్రాసు నుంచి వెలువడే 'ఎథీనియం అండ్ డైయిలీ న్యూస్' ప్రచురిస్తూ, సంపాదకవర్గం వాళ్లు రాసిన సమీక్షాత్మక వ్యాసంలో రచయిత్రిని పొగుడుతూ, భారతీయులకు సముద్ర ప్రయాణ చరిత్ర అవగాహన లేదని పేర్కొన్నారు. ఈ మాటలు రాసిన ఆ మహానుభావుడు ఎవడో కాని, అతని అజ్ఞానాన్నీ, అహంకారాన్నీ, తెలియచేస్తాయి. – **"సముద్రాలు దాటి ఇతర దేశాలు సాధించిన అభివృద్ధిని తెలుసుకోవడానికి అవసరమైన ఆత్మవిశ్వాసం హిందువుల్లో కొరవడింది. కార్యశూరులైన పాశ్చాత్యులు తమ దేశానికి తీసుకొచ్చిన కళలను అనుసరించేందుకు కూడా వారికి ఓపిక లేదు. హిందూ దేశపు జార్జి స్టీవెన్‌సన్, లివింగ్‌స్టన్‌లు ఏరి, ఎక్కడున్నారు?...... జర్మనీ దేశపు సంగీత**

సృష్టికర్త మెండల్సన్ వంటి వాళ్లు పోతం జానకమ్మ రాఘవయ్య రాసిన లేఖను ప్రచురిస్తూ 'ఎథీనియం అండ్ డెయిలీ న్యూస్' సంపాదకుడు ఇలా సమీక్షిస్తాడు– **"ఆమె ఈ లేఖలో ఇంగ్లీష్ వాళ్ల సౌఖ్యాలు, విలాసాలు, యూరప్ ప్రకృతి అందాలు మొదలైన వాటికి రెండో స్థానం ఇచ్చారు. ఇంగ్లీష్ వాళ్ల ఆయుధాగారాలు, నౌకాశ్రయాలు, నౌకా పరిశ్రమలను ప్రముఖంగా వివరించారు. వాటన్నిటిని తన దేశీయులు ఎందుకు చెయ్యలేకపోయారనే భావమే ఆమె లేఖ అంతటా ధ్వనించింది. హిందూ దేశంలోని లోపాల గురించి ఆమె అభిప్రాయాలు తర్కబద్ధమైనవి, ఆలోచనలను రేకెత్తించేవి. సముద్రాలు దాటి ఇతర దేశాలు సాధించిన అభివృద్ధిని తెలుసు కోవడానికి అవసరమైన ఆత్మ విశ్వాసం హిందువుల్లో కొరవడింది. కార్యశూరులైన పాశ్చాత్యులు తమ దేశానికి తీసుకొచ్చిన కళలను అనుసరించేందుకు కూడా వారికి ఓపిక లేదు."** (పేజి: 25) ఈ మాటల్లో ఆ ఆంగ్ల పత్రికా సంపాదకుని జాత్యహంకారం ప్రస్ఫుట మైనంతగా ఆలోచనాశక్తి కొరవడటం విచారించదగ్గ విషయం.

జానకమ్మ ఇంగ్లండ్ యాత్ర వివరాలు తెలుసుకొందాం. ఆమె తమ భర్త, పరివారంతో 1873 జూలై 20 వ తేదీన 'ఆస్ట్రేలియా' అనే స్టీమరులో ఎక్కి మద్రాసు రేవు నుంచి బయలుదేరింది. 1873 సెప్టెంబర్ 1 తారీఖున సురక్షితంగా గమ్యం చేరింది. అక్కడ సుమారు నాలుగు నెలల పాటు వుండి లండను, ప్యారిస్ వగైరా ప్రదేశాలు చూసి, 1874 ఫిబ్రవరి 1వ తేదీన నిమ్మళంగా మద్రాసు ముట్టింది. మొత్తం మీద జానకమ్మ, భర్త రాఘవయ్య, సేవకులు ఇంగ్లండ్ క్షేమంగా వెళ్లి, లాభంగా తిరిగి వచ్చారన్న మాట. అన్నమాచార్యుల వారన్నట్లు **"పొలమెల్లాదిరిగిన తేటికి పూబొదయే నెలవుగదే."**

జానకమ్మ భర్త ఇంటి పేరు పోతంశెట్టి. వీళ్లు మద్రాసు నగరంలోని పేరు మోసిన బలిజ కులానికి చెందిన వ్యాపారస్థులు. ఇంగ్లీషు భాష నేర్చుకొని, వ్యాపార రీత్యా ఆంగ్లేయ వ్యాపారులతో, అధికార వర్గాలతో సన్నిహిత సంబంధాలున్న సంస్కారవంతమైన కుటుంబం వీళ్లది. పోతం జానకమ్మ తెలుగు భాషపై పట్టు కలిగి, ఇంగ్లీషు భాషా పరిచయం కల మహిళ.

పోతం జానకమ్మ ఇంగ్లండ్ యాత్ర ఆషామాషీ వ్యవహారం కాదు. ఆకాలం రీత్యానే కాదు, ఈ కాలం దృష్టితో చూసినా అది బహుళార్థ సాధక పర్యటనే. ఆమె కొత్త ప్రదేశాల్ని చూసే చూపు, సుఖ సంతోషాల్ని అనుభవించే రీతి, అక్కడి ప్రజల ఆచార వ్యవహారాల్ని, పండగ పబ్బాల్ని పరిశీలించి, పులకరించే విధానం, ఆప్రాంతపు నాగరికత, సంస్కృతుల్ని ఆకళించుకునే వైనం సాధారణమైనవి మాత్రం కావు. విశేషమైనవీ, విలక్షణమైనవీనూ. జానకమ్మ తమ స్టీమరు ప్రయాణంలో పొందిన విలాసవంతమైన స్నాన సుఖం, మన దేశం స్నాన విధానానికి తీరా భిన్నమైనదీ, సౌఖ్య ప్రదమైనది కూడా. స్టీమరు ఉద్యోగులు, యాత్రికులు చాలా స్నేహపూర్వకంగా




మెలగడంతో ఆమెలో గూడుకట్టుకున్న గుబులు, సంకోచం, భయం తటాలున మాయమై ప్రయాణం సాఫీగా, సంతోషంగా సాగింది. జానకమ్మ చదువుకున్న, చలాకీ యువతిగా కనపడతారు యాత్ర ఆద్యంతం.

జానకమ్మ మాంసాహారి కాబట్టి భోజన విషయంలో ఆమెకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. తిండి తీర్థాలు, భోజనం వేళలో ఆడామగా కలిసి ఉత్సాహంగా కబుర్లు చెప్పుకోవడం ఆమెకు ఎంతగానో నచ్చింది. స్టీమర్లో ఎవరైనా మరణిస్తే, జరిగే ప్రార్థనా సమావేశం ఆమె హృదయాన్ని తాకి, మన దేశంలోనూ, ఇలాంటి విధానాన్ని అనుసరిస్తే ఎంతో బాగుంటుందనుకొంటుంది. **"దీని అర్థం నేను క్రైస్తవమతాన్ని ప్రచారం చేస్తున్నట్లు కాదు. ఈ లోకంలోని సంపదనంతా నాముందు కుప్ప బోసినా నేనాపని చెయ్యను గాక చెయ్యను."** (పేజి: 29) అని ఢంకా బజాయించి చెప్తుంది. మరోసారి ఇంకో వ్యక్తి అంత్యక్రియ ప్రార్థనలో పాల్గొన్న జానకమ్మ స్టీమర్ కెప్టన్ బైబిలు వాక్యాల్ని విని విషాదం చెందింది. కర్మకాండలప్పుడు మన పురోహితులు చదివే శ్లోకాలు తెలుగులోకి అనువదింపబడితే మనకు బాగా అర్థమవుతాయి కదా. ఆ రోజు త్వరలో రావాలని కోరుకుంటారు జానకమ్మ. (పేజి: 33)

ఏడెన్ రేవులో ఆగిన తర్వాత చిన్న చిన్న తెప్పల్లో స్థానికులు కేకలు పెడ్తూ యాత్రికుల్ని తమ వైపు ఆకర్షిస్తారు. అప్పుడు కొందరు యాత్రికులు చిల్లర నాణాల్ని నీటిలోకి విసిరితే, వాళ్లు నీళ్లలో మునిగి ఆ నాణాల్ని చేజిక్కించుకుంటారు. జానకమ్మ ఈ దృశ్యాన్ని విసుగు లేకుండా చాలాసేపు చూసి ఆనందించింది. (పేజి: 36) ఇలాంటి కుతూహలకరమైన, ఉల్లాసకరమైన దృశ్యాలు మనకు నేడు కూడా వారణాసి గంగా ఘాట్లలోనూ, ప్రయాగరాజ్ త్రివేణి సంగమంలోనూ కనపడతాయి.

జానకమ్మ దంపతులు, సేవకులు సౌతాంప్టన్‌లోని ఓ హోటలులో బస చేస్తారు. అక్కడి పనివాళ్లలో ఎక్కువ మంది స్త్రీలే వుండటం, వాళ్లు మగ సేవకుల కంటే హుషారుగా, చక్కగా పని చేస్తారని జానకమ్మ గ్రహించింది. (పేజి: 46) వెంట తెచ్చుకున్న సేవకులు ప్రయోజనం లేకుండా పోయారనీ, హోటళ్లలోని ఇంగ్లీషు సేవికలే భేషుగ్గా తోడ్పడ్డారని చెప్పారామె. (పేజి: 48) లండన్ నగరంలోని హాక్సెల్ హోటల్లో బస చేసిన ఆమెకు అది నచ్చక గోల్డెన్ క్రాస్ హోటలుకు మార్చేటప్పుడు ఆ హోటలు విదేశీయులైన వీళ్ల నుంచి బాగా డబ్బు గుంజారన్న సంగతి తెలిపి, గుణపాఠం నేర్చుకొని బ్రాంప్టన్ ప్రాంతంలో సౌకర్యంగా వున్న ఇల్లు కుదుర్చుకొంది. ఆ ప్రాంతం జానకమ్మ కుటుంబానికి ఎంత నచ్చిందంటే మద్రాసులోని స్వగృహానికి 'బ్రాంప్టన్ హోమ్' అన్న పేరు కొన్నారామె. లండన్ నగరం చూడాలని ఆమె ఎంత ఉబలాట పడిందంటే **"నాలాగా పంజరం నుంచి బయటికి వచ్చిన పక్షికి ఆకలి దప్పిక, అలసట లేకుండా ఇక్కడి వింతలు చూడడానికి పొద్దున్నుంచి పొద్దుపోయేదాకా తిరిగినా తనివి తీరదు. షాపులు రాత్రి బాగా పొద్దు పోయే దాకా తెరచి ఉంటాయి. వాటి ముందు రకరకాల గ్యాస్ లైట్ల వెలుగుకు తోడు కార్పొరేషన్ వాళ్లు వెలిగించిన దీపాల కాంతులతో అంతా శోభాయమానంగా ప్రకాశంగా ఉంటుంది.**

**లండన్ నగరంలో ఖర్చులు పెరిగి పోవడం, జీవితావసరాల కోసం ఇబ్బంది పడడం రెండూ త్వరత్వరగా జరుగుతున్నట్లు నేను చూసినంతలో అనిపిస్తోంది."** (పేజి: 49) పై మాటలు జానకమ్మ నగర సందర్శనాభిలాష, అక్కడి ప్రజల కష్ట సుఖాల పట్ల ఆసక్తి, జిజ్ఞాసలను ప్రకటిస్తాయి. ఆమె సూక్ష్మ పరిశీలనా దృష్టికి అద్దం పడతాయి కూడా.

జానకమ్మ పరివార సమేతంగా నాలుగంతస్తుల అందాల మేడలోకి మారింది. ఆ అద్దె ఇంటికి కావలసిన వంట సరుకులు, పాలు పెరుగు, వార్తా ప్రత్రికలు ఇంకా ఇతరత్రా సామగ్రి చేరవేసే మనుషులు దొరికారు. వారం చివరో, నెలాఖరులోనో లెక్కచూసి డబ్బు తీసుకుంటారు. ఇంగ్లీషు మెయిడ్ శిక్షణలో ఆమె సొంత సేవకులు పని బాగా నేర్చుకొన్నారు కూడా. ఇంగ్లండుకు వచ్చిన తర్వాత జానకమ్మ నేర్చుకొన్న పాఠం ఏమిటంటే భర్తతో కలిసి హైడ్‌పార్కులో చాలా దూరం నడవడం.

ఆమె ఆరోగ్యానికి శ్రీరామరక్ష అయింది. ఇంగ్లండులో ఇంటిపని చేసే వాళ్ల నెల జీతాలు మన దేశంలోని ప్రభుత్వ గుమాస్తాల నెల సంబళంతో ఆడ హౌస్ కీపర్‌దే బాధ్యతలన్నీ, అలాగే బట్లర్ మగ పనిమనుషుల మీద అజమాయిషీ చేస్తాడు మొత్తం మీద లండన్‌లోని సంపన్న కుటుంబీకుల ఇళ్లల్లో కాలికొకరు చేతి కొకరు పని మనుషులుంటారు. (పేజీలు: 49–53)

జానకమ్మ లండను వాసుల అతిథి సేవను చాలా ప్రశంసిస్తారు. ఆమె వాళ్లు అతిథుల్ని ఎంతో మర్యాదగా ఆహ్వానిస్తారనీ, ప్రేమగా పలకరిస్తారనీ, తిండి తీర్థాల, భోజనాల పట్ల ఎంతో జాగ్రత్త వహిస్తారని అంటారు. అక్కడి ఆంగ్ల మహిళల్లో కొందరు భారతీయ స్త్రీలని తేనీటి విందులకు ఆహ్వానించి, ఇష్టా గోష్ఠులు నిర్వహించి ఈస్ట్ ఇండియా పాలనలో వాళ్ల బాగోగుల గురించి వాకబు చేస్తారామె. (పేజి: 53–54)

పోతం జానకమ్మ లండన్‌లో భూగర్భ రైళ్లల్లో గుర్రపు బగ్గీల కన్నా చౌకధరలో ఎన్నోసార్లు ప్రయాణం చేసింది. నగర పోలీసులు రాజూ పేదా తేడా పట్టించుకో కుండా సమదృష్టితో సానుభూతితో సహకరిస్తారని అంటారామె. అచ్చెరువు కలిగించే క్రిస్టల్ ప్యాలెస్ వైభవం, దాన్లోని వస్తు ప్రదర్శనశాలలు, చిత్రశాలలు, మానవ శిలా విగ్రహశాల ప్యాలెస్ బయట అందాలు చిందే తోటలు, విశాలమైన కాలి బాటలు, జల యంత్రాలు, పటాకుల జిలుగు వెలుగులు సందర్శకులకు అపారమైన ఆనందోత్సాహాల్ని కలిగిస్తాయి.

మేడం టుస్సాడ్ మైనపు శిల్పాల ప్రదర్శన అద్భుతమనిపించింది జానకమ్మకు. జీవకళ ఉట్టి పడేటట్లు కనపడే మైనపు శిల్పాల్ని చూసి నోట మాటరాని సందర్శకుల్ని చూసి మైనపు విగ్రహాలేవో, చేష్టలుడిగిన సజీవ వ్యక్తులెవరో తెలుసుకోవడం కష్టమనిపించింది ఆమెగారికి. మేడం టుస్సాడ్ మైనపు విగ్రహాలశాల ఆమెకు మహాభారత ఇతిహాసంలోని మయసభ జ్ఞప్తికి వచ్చింది. (పేజి: 59) వెస్ట్ మినిస్టర్ అబీ– ప్రసిద్ధమైన చర్చి, దీని ఆవరణలో ప్రఖ్యాత వ్యక్తులు షేక్ స్పియర్, మిల్టన్, స్పెన్సర్, డ్రైడెన్, గోల్డ్ స్మిత్ మొదలైన వాళ్ల సమాధులున్నాయి. లండన్‌లోని దర్శనీయ స్థలాల్లో ఇదొకటి.

పోతం జానకమ్మలో ఉరకలు వేస్తే ఉత్సాహం నిండి నిబిడీకృతమై వుంటుంది. సిడ్నీ వాటర్లూ లండన్ నగరం మేయర్ గా పుర వీధుల్లో మాజీ మేయర్లు, షరీఫులు, అధికారులతో పాటు వైభవోపేతంగా మెరవణి కావడాన్ని కన్నారగ చూసి మహదానందం అనుభవించింది. అంతే కాక సర్ సిడ్నీ వాటర్లూ లండన్‌లో స్వార్జిత సిరి సంపదల్ని ప్రజాహిత కార్యాలకు నాలుగు చేతులా వినియోగించిన ధన్యజీవి. ఎండాకాలం సెలవుల తర్వాత న్యాయస్థానాలు తెరవబడే రోజున న్యాయమూర్తు లందరూ వూరేగుతూ కోర్టులో ప్రవేశిస్తారు. ఈ

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2023

దృశ్యాన్ని చూసి జానకమ్మ ఎంతో సంతోషించారు. (పేజి: 73-75)

ఆమె లండనుకు ఆరుమైళ్ల దూరంలో వున్న రిచ్‌మండ్ గ్రామ సమీపంలోని పార్కును నాలుగైదు సార్లు తిలకించి పులకించింది భారతదేశం నుంచి దిగుమతి చేసుకున్న తాటి మొక్కల్ని పెంచి పోషించారా వనంలో గ్రీన్ విచ్ లోని అనాథ బాలల పాఠశాల దర్శించడం ఆమె కరుణార్ద్ర దృష్టికి నిదర్శనం.

జానకమ్మ లండన్ నగరంలోని బ్రైటన్ పట్టణం పర్యటించారు. అక్కడ సముద్ర తీరంలోని ఓల్డ్ షిప్ హోటల్లో బసచేశారు. వేసవిరోజుల్లో మొలబంటి లోతుల్లో చక్రాల బళ్లలో సిద్ధ పరిచిన కొయ్య తొట్టెల్లో, ఒక్కొక్కదాన్లో ఆరుగురికి పైగా స్త్రీలు తెరల మరుగులో స్నానం చెయ్యడం చూసి జానకమ్మ ఆనందించింది- **"ఈ పద్ధతి చాలా విడ్డూరంగా అనిపించినా, హిందువులకు నచ్చుతుంది."** అని అంటారామె. (పేజి: 77) బ్రైటన్ పట్టణంలోని సముద్రతీరం చూడగానే ఆమెకు మద్రాసు జ్ఞప్తి కొచ్చింది. పోతం జానకమ్మ తన ఇంగ్లండ్ యాత్రలో ఎన్నోసార్లు మద్రాసు నగరాన్నీ, భారతీయ సంప్రదాయాల్ని జ్ఞాపకం చేసుకొని, సామ్య వైషమ్యాల్ని పోల్చుకోవడం గమనించాల్సిన సంగతి. ఆమె విండ్సర్ కోట, పరిసరాల్ని దర్శించి, ఆ కథల్ని **"తప్పు లేకుండా ఏకరువు పెట్టగలను"** అని ఎంతో ఆత్మ విశ్వాసంతో చెప్పుతుంది. (పేజి: 77)

రచయిత్రి బ్రిటిష్ మ్యూజియం, నేషనల్ గేలరీ, కోవెన్ట్ తోట మొదలైన వాటిని చూసి హర్షించిన తర్వాత ఆసియా ప్రజల విడిది గృహం చూసి ఆనందం పట్టలేక పొయ్యారు. ఆసియా దేశాల అనాథల కోసం దాతల విరాళాలతో ఓ శరణాలయం స్థాపించబడింది. దారి తప్పి వీధుల్లో తిరుగాడుతున్న జానకమ్మ గారి ఓ సేవకుడు మూడు వారాల పాటు ఇక్కడే ఆశ్రయం పొందాడు. చాలా కాలం కిందట మద్రాసు నివాసి, ప్రఖ్యాత వ్యక్తి మొదలిగారు తినడానికి తిండిలేక, వుండటానికి గూడు లేక కొంత కాలం పాటు ఈ అనాథాశ్రమంలో రోజులు వెళ్లబుచ్చాడట. ఈ సమాచారం విని జానకమ్మ ఇలా అంటారు.- **"మన దేశంలోని ప్రెసిడెన్సీల ముఖ్య పట్టణాల్లో కూడా మన రాజాగార్లు ఇలాంటి అనాథాశ్రమాలు నెలకొల్పితే వాళ్ల దాతృత్వం, ఔదార్యం సార్థకమవుతాయి."** (పేజి: 82) పోతం జానకమ్మ తన ఇంగ్లండు యాత్రలో ఏ భవనాలు చూసినా, వీధులు తిరిగినా స్వదేశంలోని భవంతుల్ని, వీధుల్ని మరవలేదు. రెండు దేశాల తారతమ్యత పరిశీలించక మానలేదు.

ఆమె శీతాకాలంలో చలిబాధ తట్టుకోలేక నానా అవస్థలు పడింది కాని జబ్బుకు లోను కాలేదు. గడగడ వణికించే చలికాలంలో కూడా ఆమె సౌందర్య దృష్టి మసకబారలేదు. ఆమె తాను చూసి, అనుభవించిన చలికాలాన్ని ఇలా వర్ణించింది. **"ఖగోళశాస్త్ర పరిచయం లేని మనవాళ్లకు ఇంగ్లండ్ లో శీతాకాలం ఎంత భయంకరంగా ఉ**


PICTURES OF ENGLAND

Translated from the Telugu.

EDITED BY

POTHUM JANAKUMMAH RAGAVIAH,

HER VISIT TO EUROPE.

MADRAS:
GANTZ BROTHERS,

1876.

**ంటుందో తెలియదు. ఉదయం 8,10 ప్రాంతంలో చాలా ఆలస్యంగా సూర్యోదయమై, మధ్యాహ్నం 3.50 దాటగానే దీపాలు పెడతారు. ఒక్కో రోజు సూర్యుడు మబ్బుల చాటున ఉండడంతో పగలు కూడా రాత్రిలాగే చీకట్లు ముసురుకొని ఉంటుంది. పక్షి ఈకలు మెల్లమెల్లగా గాలిలో తేలుతూ నేల మీద వాలినట్లుగా శీతాకాలంలో మంచు తరగలు నేల మీద వాలుతున్న దృశ్యం కనువిందుగా ఉంటుంది. మేం పారిస్ నుంచి మా ఆవాసానికి రైల్లో వెళ్తున్నప్పుడు కనువిందుగా మంచు కురిసింది. ప్రకృతి విచిత్రాల గురించి మాట్లాడుకొంటూ ఈ దృశ్యాన్ని ఎంతో ఆస్వాదించాం."** (పేజి: 87) జానకమ్మ శీతాకాల సౌందర్యాన్ని ఓ మధురానుభూతిగా భావించినా, మరోవైపు 1873 నవంబరులో లండన్‌లో మంచు సృష్టించిన బీభత్సాన్ని కూడా వర్ణించక విడవలేదు- **"చలి ధాటికి పశువులు చచ్చిపోయాయి. జనం కాళ్లూ చేతులు పొగొట్టుకొని అంగ వికలురయ్యారు. కొందరు చచ్చిపోయారు కూడా. పొగమంచు లండన్ నగరాన్ని మూడు పగళ్లు, రెండు రాత్రులు కమ్ముకొని చీకటి మయం చేసింది. రోడ్లలో రాకపోకలు నిలిచిపోయాయి."** (పేజి: 88) జానకమ్మ దంపతులు ఆ ఎముకలు కొరికే చలి కాలంలో ప్యారిస్ నగరంలో వుండి బతికి పొయ్యారు. జానకమ్మ శీతాకాలంలో ప్రకృతి సౌందర్యానికీ పరవశించిందీ, అలాగే ఆ ఋతువు సృష్టించిన బీభత్సానికీ నివ్వెరపోయింది. ఆమె నిబ్బరానికి మనం చకితులం కావాల్సిందే.

రచయిత్రి 9 అధ్యాయంలో **'లండన్‌పై నా అభిప్రాయాలు'** అని రాసిన మూడు పుటల ముచ్చటైన- అంతకంటే అమూల్యమైన

అనుశీలనాత్మకమైన సమీక్ష మనకు అచ్చెరువు కలిగిస్తుంది. (పేజి: 89-92) జానకమ్మ సునిశిత మతి. ఆమె లండన్ నగరాన్ని ఎంత లోతుగా పరిశీలించిందో చూడండి.- **"ఇక్కడ మంచీ, చెడు అనే బలీయ శక్తులు ఆధిపత్యానికి పోటీపడుతుంటాయి. అత్యుత్తమ మానవులతో పాటు పరమ దుర్మార్గులు కూడా ఇక్కడ ఉన్నారు. మనం అబ్బుర పడేంత సంపద, కటిక పేదరికం రెండూ ఉన్నాయి. గొప్ప విజ్ఞానం, మహా అజ్ఞానం, మేలైన విజ్ఞాన దాయకమైన దానితో పాటు జుగుప్సాకర వ్యసనాలు, పాపాలు సహజీవనం చేస్తున్నాయి. ప్రతి ఒక్కరూ నిరంతరం ధన సముపార్జనలో తలమునకలై ఉన్నారు. సుఖభోగాల జీవితానికి, విజ్ఞానాభివృద్ధికీ అన్నిటికీ ఇదే కేంద్రం. క్రూరత్వానికి, దౌర్జన్యాలకూ ఈ నగరమే మూలం."** (పేజి: 90) ఈమెగారి ఈ బ్రిటీషు ప్రజల జీవన సరళి విమర్శ చదువుతుంటే డా. సామ్యుయెల్ జాన్సన్ తన శిష్యుడైన బాస్వెల్ ప్రాపు ప్రజలు ఎలా జీవిస్తున్నారన్న ప్రశ్నకు "The rich live very magnificently and the poor very miserally" అన్న సమాధానం గుర్తుకొస్తుంది. ఈ మాటలు నేను బి. ఏ. ఉపవాచకం 'బాస్వెల్స్ లైఫ్ ఆఫ్ జాన్సన్' లో 1962 లో చదివిన పంక్తి, జానకమ్మ గారి పాదరసం లాంటి చురుకు బుద్ధి లోతును ఎలా కొలవాలి?!

పోతం జానకమ్మ పెద్ద చదువులు చదువుకున్న మహిళ కాదు. కాని ఆమె పరేంగిత జ్ఞానం మాత్రం బహుదొడ్డది. ఆధునిక కన్నడ మహాకవి, జ్ఞానపీఠ బహుమతీ గ్రహీత ద.రా. బేంద్ర **"రసవె జనన, విరస మరణ, సమరసవే జీవన"** (రసమే పుట్టుక, విరసమే చావు, సామరస్యమే జీవితం) అని అన్నారు. జానకమ్మ క్రైస్తవ, హిందూ మతాల గురించి రాస్తూ, ఎంత సమతౌల్యంతో ఈ మాటలు రాశారో చూడండి - **"ప్రపంచలోనే అతి ప్రాచీనమైన హిందూ మతంపై లోతైన చర్చ లేకుండానే ఆంగ్లేయ సమాజంలో జీవించిన నా దేశీయులు కొందరు క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. ఈ సృష్టికర్త, జగద్రక్షకుడు నిర్మల దృష్టిలో హైందవం, క్రైస్తవం రెండూ సమానమే. పిడివాదులు, రవంత ఔదార్యం కూడా లేనివాళ్లు మాత్రమే దీనికి విరుద్ధంగా భావిస్తారు. హిందూమతంలో ఆక్షేపించదగిన, అసంబద్ధమైన ఆరాధనా పద్ధతులెన్నో ఉన్నమాట నిజమే గానీ, అనంతుడైన, నిత్యుడైన ఈశ్వరుని దృష్టిలో ఆ మతం మంచిదే."** (పేజి: 91-92)

పారిశ్రామిక కేంద్రమైన మాంచెస్టరును వర్తక కుటుంబీకురాలు జానకమ్మ మరింత లోతుగా పరిశీలించింది. ఆంగ్లేయుల పారిశ్రామికాభివృద్ధిని కొనియాడుతూనే, మరోవైపు మన దేశం కూడా మానవ వనరులు అధికంగా వుండీ వస్త్ర పరిశ్రమలో ముందంజ వేయాలని కోరుకుంది. మన పాలకులు- ఈస్టు ఇండియా కంపెనీ అధికారులు ఇక్కడ పరిశ్రమలను ప్రోత్సహించాలని గొంతెమ్మ కోరికలు ఆశించింది. (పేజి: 95)

జానకమ్మ పడవలో ప్రయాణం చేసి ఫ్రాన్సు దేశం చూసింది. ఫ్రెంచి నౌక, రైల్వే అధికారులు ప్రయాణికులతో మర్యాదకరంగా ప్రవర్తించరని బాధపడింది. వీళ్లకంటే ఆంగ్లేయులే మేలని చెప్పింది. (పేజి: 98) ఆమె సకుటుంబంగా ఓ ఫ్రెంచి నాటకాన్ని చూడటానికి వెళ్లింది. నాటకశాలలో ఫ్రెంచి ప్రేక్షకుల కాకిగోల భరించలేక, ప్రదర్శన మధ్యలోనే బయటికి వచ్చేసింది. (పేజి: 104) ఆమె పారిస్ నగర సౌందర్యానికి, పరిశుభ్రతకు ముగ్ధురాలైంది. **"పారిస్ అందమైన నగరం. ఆరోగ్యకరంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. లండన్ లాగా పరిశ్రమల నుంచి వెలువడే పొగ, దుమ్ము ధూళి లేకుండా శుభ్రంగా ఉంటుంది. ఖర్చులు కూడా ఇంగ్లండ్ కన్నా తక్కువ. పర్యాటకులకు ఫ్రెంచి భాష వస్తేనే పారిస్ సౌఖ్యాలను అనుభవించ గలుగుతారు. లేకుంటే చాలా కష్టం."** (పేజి: 105) అని అంటారామె.

పోతం జానకమ్మ రాఘవయ్య ఆఖరిదైన 12వ అధ్యాయం చివరి పేజీల్లో రాసిన వాక్యాలు మనం పదేపదే గుర్తు చేసుకోవాల్సి వుంటుంది- **"బ్రిటిష్ అధికార ప్రతినిధులు మన దేశంలో అనేక తప్పులు చేశారు. అనాలోచిత చర్యలకు పూనుకొన్నారు. మన ప్రజల అవసరాలను, ఆకాంక్షలను గ్రహించ లేక అజ్ఞానంతో, నిర్లక్ష్యంతో అలా చేశారె గాని, వాళ్ల మనసుల్లో ఎలాంటి దురుద్దేశం, విద్వేషం లేనే లేవు. పొరపాటేమిటంటే, ఆంగ్లేయులు హిందూ దేశాన్ని తమదిగా భావించలేక పోవడం. ఏదో కొంతకాల మిక్కడ గడపడానికి వచ్చామను కొంటారు. కాబట్టే తరచూ తమ విధులను యాంత్రికంగా అనడం సరైన అభివ్యక్తేననుకొంటాను. వాళ్లు తమకు సుదూరంగా ఉన్న హిందూ దేశాన్ని కూడా తమకు జన్మనిచ్చిన అందమైన ఇంగ్లండ్ లాగే స్వదేశంగానే భావించి, ఇక్కడి ప్రజల యోగక్షేమాల కోసం, సీమలోని తమ ఆత్మీయ బంధువుల కోసం పనిచేస్తున్నట్లు అమిత శ్రద్ధాసక్తులతో పనిచేస్తే గతంలో జరిగిన తీవ్రమైన తప్పిదాలు మళ్లీ జరగవు."** (పేజి: 112-113)

ఈస్ట్ ఇండియా కంపెనీ, బ్రిటిషు ప్రభుత్వ అధికారుల మనస్సులో భారత దేశీయుల పట్ల దురుద్దేశాలూ, విద్వేషాలూ మస్తుగా వున్నాయి. వాళ్లు భారతదేశపు సిరిసంపదల్ని కొల్లగొట్టడానికి శాయశక్తులూ ప్రయత్నించారు. వాళ్లు ఈ దేశాన్ని తమ దేశంగా ఏమాత్రం భావించకుండా, ఈ దేశీయుల్ని తమ బానిసలుగా భావించి పీడించారు. ఈ కఠోరసత్యం జానకమ్మ గారికి తెలియక పోవడం చింతిచాల్సిన సంగతే.

'పోతం జానకమ్మ రాఘవయ్యగారి 'Pictures of England' అన్న ఇంగ్లీషు పుస్తకాన్ని డా. కాళిదాసు పురుషోత్తంగారు 'జానకమ్మ ఇంగ్లండ్ యాత్ర' సులభ సుందరమైన తెలుగులోకి అనువదించి పాఠకుల కృతజ్ఞతలకు పాత్రులయ్యారు. ఈ సందర్భంలో తాళ్ళపాక అన్నమాచార్యులవారి 'సేవలు సేసేవారి సేతలెల్లా నింపులే' అన్న మాటల్ని జ్ఞప్తికి తెచ్చుకోవాలి.

# ఆధునిక వ్యాస రచనా శైలి, శిల్పం

**యెల్చాల నర్సింలు**, తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 924 733 5278



వచన రచనా ప్రక్రియలలో వ్యాసం ఒకటి. కథ, నవల, నాటకం, వచన కవితల లాగే వ్యాసం కూడా ఆధునిక కాలంలో పుట్టింది. కథలు, నవలలు, నాటకాలు, కవిత్వం వంటివి ఏ ప్రకియలో రాసినా వాటన్నిటి గురించి వ్యాసంలో చెప్పదగిన విషయాలు కొన్ని తప్పక ఉంటాయి. రచనాకాలంలో తెలుగు రచనలు ప్రధానంగా పద్య రూపంలో ఉండేవి. పద్యం గద్యం కలిసిన చంపు కావ్యాలు అని రెండు రకాలుగా ఉండేవి. చంపు కావ్యాలలో అక్కడక్కడ కొంత గద్యం ఉన్నా అది ఛందస్సులేని పద్యం వంటిదే. తిక్కన రాసిన నిర్వచనోత్తర రామాయణం లాంటి కేవలం పద్య కావ్యాలు ఒకటి అరా మాత్రమే ఉన్నాయి. ప్రాచీన తెలుగు సాహిత్యం అంటే ప్రధానంగా చంపూ కావ్యాలే. వీటన్నిటిని కలిపి స్థూలంగా పద్యకావ్యాలు అంటున్నాం. కవిత్వమే గాక అలంకార శాస్త్ర గ్రంథాలు కూడా పద్య రూపంలో ఉండడం ఆనాటి విశేషం.

'వ్యాసం' అనే పదానికి 'వివరణ' అనే అర్థం ఉంది. ఒక విషయాన్ని గురించిన సమాచారం ఒక క్రమపద్ధతిలో వివరించి రాస్తే 'వ్యాసం' అవుతుంది. వ్యాసం అంటే విభాగం అని అర్థం. ఏ విషయాన్ని అయినా తీసుకొని దానిలోని అంశాలను విభజించి వివరించి చెప్పడమే వ్యాసం. దీన్నే నలుగురి ఎదుట ముఖతః చెపితే 'ఉపన్యాసం' అవుతుంది.

వ్యాసం రాయడానికి ముందు విషయం ఎన్నుకొనేటప్పుడు ఆ విషయం వర్తమానానికి సంబంధించినదై ఉండాలి. పాఠకులకు ఆసక్తి కలిగించే విషయమై ఉండాలి. జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకోవడానికి మరింత సమాచారం అందించేలా పనికివచ్చే సమాచారం ఇచ్చేదిగా ఉండాలి. వ్యాసం గురించి ఒక్క మాటలో చెప్పాలంటే ఒక ప్రత్యేక విషయం గురించి సంపూర్ణ స్వరూపాన్నిగాని, లేదా ఒక సంపూర్ణ విషయం గురించి ప్రత్యేక విశేషాన్ని తెలియజేయడం. వ్యాసం అనేది ఏ భాషలోనైనా గొప్ప ప్రయోజన కరమైన ప్రక్రియ. ఎలాంటి విషయాన్నైనా అన్ని రకాల పాఠకులకూ సులభంగా వివరించడానికి ఉపయోగపడే ఏకైక ప్రక్రియ. విషయాన్ని బట్టి వ్యాసం కూడా అనేక రకాలుగా ఉంటుంది. వ్యాసం చిన్నదైనా పెద్దదైనా, అందులో విషయం సమగ్రంగా, కూలంకషంగా ఉండక పోవచ్చు. రచయిత వ్యాస విషయం ఒకటైతే వ్యాసేతర విషయాలు తీసుకొని వ్యాసం రాయవచ్చు. వ్యాస విషయం సంపూర్ణంగా రాయడం కుదరదు. తనకు తెలిసిన విషయానికి తెలియని విషయాలను ఇతర గ్రంథాల ఆధారంగా విషయాన్ని సేకరించి వ్యాసం రాయవచ్చు. ఒక కావ్యాన్ని విశ్లేషించి రాసినది సాహిత్య వ్యాసమైతే, చరిత్రను గురించి రాస్తే చారిత్రక వ్యాసం అవుతుంది.

అదే రాజకీయాన్ని రాస్తే రాజకీయ వ్యాసం, సమాజాన్ని విడమర్చి చెపితే సామాజిక వ్యాసం అవుతుంది. అదే వ్యాసం ప్రత్యేకత. అందుకే ప్రత్యేకంగా వ్యాసాలు రాసిన వ్యాస రచయితల్ని అలా ఉంచితే, కవులూ, నాటకకర్తలూ, కథానవలా రచయితలూ కూడా చాలామంది వ్యాసాలు రాసినవారే. వ్యాస ప్రక్రియను సుసంపన్నం చేసిన వారే. విషయం ఏదైనా సంపూర్ణ వివరణ వ్యాసంలో ఉంటుంది.

పత్రికా రచనా వ్యాసంగంలో వ్యాసరచన ఒక అంతర్భాగం. ఎక్కువలో ఎక్కువగా వ్యాసాలు పత్రికలో పనిచేసే వారే కాక బయట వ్యక్తులే రాస్తుంటారు. పత్రికలో వచ్చే కొన్ని వార్తలకు గల నేపథ్యాన్ని వ్యాసాలు అందిస్తాయి. జరిగే పరిణామాన్ని గురించి అటు వార్త, ఇటు వ్యాసం కలిసి ఒక సమగ్ర సమాచారాన్ని అందిస్తాయి. దినపత్రికలో సంపాదకీయం పక్కనే దీని స్థానం. అంటే సంపాదకీయం తర్వాత అంత ప్రాధాన్యత వ్యాసానికి ఉంది.

ఏ ప్రక్రియ అయినా, ఏ రచనా ధోరణి అయినా బహిరంగంగా కనిపిస్తున్నప్పటికీ, ఆ సాహిత్యంలో అంతరంగా ప్రవహించే చైతన్యం శైలి. శైలి పైకి కనిపించదు. లోతుల్లో ఉంటుంది. వ్యాసం రచయిత వ్యక్తిత్వ ముద్రతో, భాషా ప్రయోగ నైపుణ్యంతో శోభిస్తుంది. వ్యాస శోభకు శైలి ప్రాణభూతం. ప్రతి వ్యక్తికి ప్రాణమున్నట్లే ప్రతి రచనకు శైలి ఉంటుంది. వ్యక్తిత్వం శైలికి ప్రాణమన్నమాట సత్యం. భిన్న వ్యక్తిత్వాలు శైలిని సుసంపన్నం చేస్తాయి. శైలి వ్యక్తి సొత్తుకాదు. సమష్టి శక్తి. వ్యక్తిత్వం వ్యక్తులందరికీ సంబంధించింది. ఏ వ్యాసం ఉత్తమ శైలీ సముచితమో, అది ఉత్తమం. ఆంగ్లంలో శైలి సాధారణంగా కవితా విషయికంగా, వచన విషయకంగా భిన్నరీతుల్లో ఉంటుంది. **"స్నేహ పరిచయాలతో చుట్టుముట్టేట్లుగా పాఠకుణ్ణి ఆకట్టుకొని ఆశ్లేషించి పరవశింపజేసేది వ్యాసం"** అని వర్జీనియా




ఉల్ఫ్ పేర్కొన్నారు. వ్యాసకర్త మనోధర్మం, శీలం, వ్యాసశైలిలోనూ వ్యాస విషయంలోనూ ప్రతిస్పందిస్తూ ఉంటుంది.

శైలి సంస్కృత పదం. దీనికి అర్థం నిఘంటువుల్లో లభిస్తుంది కాని, ఆలంకారికంగా లభించదు. శైలికి సాంప్రదాయిక నిర్వచనం మృగ్యం. శైలీ అంటే భావ వ్యక్తీకరణ విధానం. **"శైలి అనగా మన మనస్సున గల అభిప్రాయమే మరొకరి మనస్సున పుట్టించుటకై భావ బోధకములగు శబ్దములను వాక్యపరంపరగా కూర్చుట"** అని వావిలికొలను సుబ్బారావు 'సులభ వ్యాకరణము' పుట. 20లో పేర్కొన్నారు.

ఆధునిక దృక్పథంలో శైలి పూర్తిగా భాషా సంబంధంతో కాకుండా రచయిత వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది. వ్యాసంలో రచయిత వ్యక్తిత్వం ఉండడం ఎంత స్పష్టమో శైలిలో కూడా రచయిత వ్యక్తిత్వం ఉండడం అంతే స్పష్టం. కాబట్టి వ్యాస రచయిత పాఠకుడికి ప్రత్యక్షంగా సాక్షాత్కారమయ్యేలా వచన రచన చేయాలి. ఒక వక్తకాని, వ్యాసకర్త కాని, విషయతత్వానికి అనుకూలంగా, అలంకార సహితంగా, పరిమిత వాక్య ప్రణాళికలో ఒదిగేటట్లుగా తన భావాలు వెలువరించడం రచనా రీతిగా భావించవచ్చు. శైలి, రీతి రెండు సమానంగా భావించే విమర్శకులున్నారు. అయితే రీతి శైలిలో అంతర్భాగం మాత్రమే. శైలి పరిధి విస్తృతమైతే, రీతి స్వల్ప పరిధికి పరిమితమై శైలిలో అంతర్భవిస్తుంది. వ్యాసకర్త మాట్లాడే శైలి కాకుండా రాసే మంచి శైలిని అలవర్చుకోవాలి.

వ్యాస రచనా శిల్పాన్ని రెండు భాగాలుగా విభజించుకోవచ్చు. మొదటిది వ్యాసరచనలో విషయాన్ని వివరించే తీరు. ఇది మళ్ళీ అనేక రకాలుగా ఉంటుంది. భాష, శైలి, పదబంధాలు, జాతీయాలు, సామెతలు, ఆలంకారిక ప్రయోగం, వాక్య విన్యాసం మొదలైనవి ఈ కోవలోకి వస్తాయి. వీటిని ప్రయోగించడంలో కూడా మళ్ళీ ఎవరి పద్ధతి వారిదే. ఎవరి శక్తియుక్తులు వారివే. ఇక రెండోది మొత్తం వ్యాసానికి సంబంధించింది. వ్యాసంలోని విషయం చెప్పడానికి వ్యాసకర్త అనుసరించే వ్యూహం, ఎత్తుగడ, నిర్మాణం మొదలైనవి ఇందులో భాగాలు.

పానుగంటి లక్ష్మీ నరసింహారావు సాక్షి వ్యాసాలలో శైలీ, శిల్పం గమనించదగింది. హాస్య వ్యంగ్యాలతో బాటు, ఆవేదన, ఆవేశం ఆయన భావాలకు ఊపునిస్తాయి. వీరి వ్యాసాలు గ్రాంధికశైలిలో ఉంటాయి. కాని అవి పూర్తి గ్రాంథికం కావు. వ్యావహారానికి దగ్గరగా ఉండే గ్రాంధిక శైలి. ఇతని శైలి చాలా సులభంగాను, సరళంగాను ఉంటుంది. ఆ రోజుల్లో యువ రచయితలతోపాటు ఎంతోమంది రచయితలు ఎంతో ఆసక్తిగా సాక్షి వ్యాసాలను చదివేవారు. చాలామంది పాఠకులు గ్రంథ పరిచయం అంటే ప్రవేశిక మాత్రమే చదువుతారు. ఈ పరిచయ వ్యాసాన్ని గ్రంథ రచయిత మంచి శైలిలో రాస్తే గ్రంథంలోని మిగతా వ్యాసాలను చదివేందుకు ఆసక్తి చూపుతారు. గ్రంథ ప్రవేశిక / ఉపోద్ఘాతాన్ని స్పష్టంగా, సులభ గ్రాహ్యమైన శైలిలో తటస్థ దృక్కోణంతో రాయాలి.

శిల్పం అంటే అలంకరణమో, సౌందర్యావిష్కారమో కాదు. శిల్పం అంటే రూప నిర్మాణం. శిల్పం అనే మాటను సాధారణంగా కవితా శిల్పం, కథా శిల్పం, నవలా శిల్పం, నాటక శిల్పం అని సృజనాత్మక ప్రక్రియలకే ఉపయోగిస్తాం. 'విమర్శనా శిల్పం' అనే పేరుతో వల్లంపాటి వెంకట సుబ్బయ్య ఒక గ్రంథం రాశారు. కానీ 'వ్యాస శిల్పం' అని ఎవరూ రాసినట్టు లేదు. వ్యాసకర్త అనుసరించే వ్యూహం, ఎత్తుగడ, నిర్మాణం మొదలైన అంశాలు రచనా శిల్పాన్ని నిర్దేశిస్తాయి. వ్యాసంలోని విషయాన్ని బట్టీ, సందర్భాన్ని బట్టీ, దాని పాఠకులను బట్టీ శిల్పరీతులు మారుతూ ఉంటాయి. ఎవరి శిల్ప నైపుణ్యం వారిది. కాబట్టి శిల్పంలో ఎంత వైవిధ్యం అయినా ఉండొచ్చు. కొన్ని రచనల్లో అసలు శిల్పం ఉన్నట్లే కనిపించదు. కాని ఆ రచనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయి. అదొక రకమైన శిల్పం. అంటే శిల్పాన్ని పైకి కనిపించకుండా దాచి ఉంచడంలోనే అసలు శిల్పం ఉందని అర్థం. అంటే ఇవన్నీ ఉండీ లేనట్టుగా కనిపిస్తూ, విషయంపైకి దృష్టి మళ్ళించే పద్ధతి ఉత్తమ వ్యాస రచనా శిల్పం అవుతుంది. దీనికి కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యం మంచి ఉదాహరణ. **"ఒక రచన చదివిన తర్వాత ఎంత బాగా చెప్పాడు!"** అని అనిపిస్తే అక్కడ శిల్పం పైకి కూడా కనిపిస్తున్నట్టు లెక్క. **"ఎంత మంచి విషయం చెప్పాడు!"** అని అనిపిస్తే అక్కడ శిల్పం పైకి కనిపించకుండా దాగి ఉన్నట్టు లెక్క. తెలుగులో వ్యాసరచన బాగా అభివృద్ధి చెందుతున్న దశలో ముని మాణిక్యం నరసింహారావు **"ఇపుడు ఆంధ్రవాఙ్మయ ప్రపంచమున వ్యాస రచనా శిల్పం క్రొత్త క్రొత్త కళలతో తళుకొత్తు చున్నదనుట నిర్వివాదాంశము"** అని వ్యాసరచనా శిల్పం అనే మాటను ప్రయోగించాడు.

ఒక్కొక్క వ్యాస రచయిత కొన్ని కొన్ని లక్షణాలను తనకు నచ్చిన పద్ధతిలో అనుసరించడం వల్ల ఒక్కొక్కరి వ్యాసాలు ఒక్కో పద్ధతిలో ఆసక్తిని కలిగిస్తూ వైవిధ్యంతో కూడి ఉంటున్నాయి. ఒక్కోసారి ఈ లక్షణాలేవీ లేకపోయినా, విషయం క్లిష్టంగా ఉన్నప్పుడు, అది

అర్థమయ్యే రీతిలో సులభశైలిలో చెప్పగలిగితే అదే గొప్ప వ్యాసం అవుతుంది. విషయం అర్థం చేసుకోవడం కష్టమైనదనే ఆలోచన పాఠకులలో ఉండి, చదవగానే అర్థమయ్యేటట్టయితే, అర్థం గావడమే అక్కడ ఆసక్తి కలిగించే అంశం అవుతుంది. కష్టమైనదాన్ని సులభతరం చెయ్యగలిగిన భాషాశైలి కూడా ఆ వ్యాసంలో గొప్ప శిల్పం అవుతుంది. కాబట్టి వ్యాసరచనా శిల్పం ఇలా ఉంటుంది. ఇలా ఉండాలి అని ఖచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు. కాకపోతే ఏ వ్యాసకర్త ఏ వ్యాసంలో ఏ రకమైన శిల్పాన్ని ప్రయోగించాడో వివరించవచ్చు.

వ్యాసరచనలోని కొన్ని శిల్పరీతులను పరిశీలించినట్లయితే సాధారణంగా పునరుక్తిని దోషంగా చెబుతారు. ఒకే పదాన్ని అనేకసార్లు ప్రయోగించడం పునరుక్తి. అయితే దోషంగా భావించే ఈ పునరుక్తిని కూడా ఒక శిల్ప చాతుర్యంగా ఉపయోగించవచ్చు. **"ఉత్తమ వాక్యం ఉత్తమ శైలికి ఉత్తమ సోపానం"** అని కొలకలూరి ఇనాక్ తన 'తెలుగు వ్యాస పరిణామం' గ్రంథంలో చెప్పాడు. ఈ వాక్యంలో 'ఉత్తమ' అనే మాట మూడుసార్లు వచ్చింది. అయితే అది ఇక్కడ దోషంగా అనిపించదు.

పాఠకులను బట్టీ శిల్పరీతులు మారతాయి. సూటిగా, సులభంగా, బలంగా, ఆకర్షణీయంగా బాగా రాయడం అంతతేలికయిన పనికాదు. అంత మాత్రాన అది అసాధ్యమైనదీ కాదు. సాధనవల్ల రచనాస్థాయిని పెంచుకోవచ్చు. వ్యాస రచనా సౌధాన్ని నిర్మించడంలో శ్రమ ఉంది. అయితే ఆ శ్రమలో ఆనందం, తృప్తి ఉంటాయి. ఈ శిల్పరీతులను స్వయంగా సృష్టించుకోగలిగిన వాడు అంతకంటే గొప్ప వ్యాసకర్త అవుతాడు. ఈ విధంగా రచనా శిల్పం అనేది ఎన్ని విధాలుగానైనా ఉంటుంది. వీటన్నింటినీ ఒకే రచయిత ఒకే వ్యాసంలో ప్రయోగించ వలసిన అవసరం లేదు. వ్యాసంలోని విషయాన్నిబట్టీ, సందర్భాన్ని బట్టీ, దాని భావ ప్రకటన చెయ్యడానికి వీటిని సందర్భోచితంగా వ్యాసకర్తలు ఉపయోగించుకోవడం అవసరం.

ఈ విధంగా శైలి ద్వారా రచయిత వ్యక్తిత్వం వ్యక్తమైనట్లే రచయిత వ్యక్తిత్వం అతని సామాజిక దృక్పథం, సామాజిక ఆచరణల మీద ఆధారపడి ఉంటుంది. శైలిలో వ్యక్తికీ వ్యక్తికి తేడాలుంటాయి. వ్యాసానికి సంబంధించిన భాష సరళంగా ఉండాలి. శైలి పాఠకుడిని చదివించేదిగా ఉండాలి. శైలి అన్నది కవియొక్క తనదైన 'మార్కు' లాంటిది. ఇది వర్ణనలో కానీ, భాషలో కానీ, ఎంచుకునే వస్తువులో కానీ ఎందులోనైనా ఉండవచ్చు. ఒక వ్యాసకర్త చిన్నచిన్న వాక్యాలతో రచన చేస్తే, ఒక రచయిత ధారాపాతంగా తనదైన శైలిలో రచన చేయవచ్చు. మరొకరు వాస్తవాలని చెబితే, ఇంకొకరు ఊహా ప్రాతిపదికన రాయవచ్చు. ఒక రచయిత పక్కాగా ఉన్న భాషలోనే తన వ్యాసరచనను చేస్తే, మరొకరు తనకి నచ్చిన రెండు మూడు భాషా పదాలని తీసుకొని వాక్యనిర్మాణం చేయవచ్చు. శైలి అనేది




వైయక్తికం. ఆధునిక గ్రాంథికశైలి కంటే ముందుగానే వ్యావహారికశైలి ఆధునిక తెలుగు రచనలలో చోటు చేసుకుందన్న సత్యాన్ని మనం గుర్తించాలి.

అలాగే ఆధునిక వ్యాస రచనా శిల్పం కల్పనలోని వైచిత్రి అని అర్థం చెప్పవచ్చు. ఈ 'వైచిత్రి' చూసే కంటికి అనుభూతికి రావాలి. అప్పుడే చూడబడే వస్తువు 'రమణీయంగా' కనిపించి, హాయిని కలుగజేస్తుంది. ఉదాహరణకి, ఒక బండరాయిని చూసినపుడు చలించని మనస్సు, అదే బండరాయిని అన్ని వైపులా ఉలితో చెక్కినప్పుడు ఒక రకంగా కనపడుతుంది. ఆ బండరాయి ముందుగా చూసినప్పుడు తర్వాత మారినప్పుడూ కూడా ఆ వస్తువులోని తత్వం శిలే. కానీ చెక్కిన తర్వాత మారిన రాయిలోని ఆ ఆకారాలు, నున్నతనాలూ; ఎత్తులూ, లోతులూ చూసేవారి మనసుకి హత్తుకుంటాయి. అపుడు నిరాకారమైన ఒక ఆనందం అనుభవానికి వస్తుంది. ఈ ఆనందం జనించడానికి తోడుపడిన వస్తువులోని భౌతికమైన గుణాల యొక్క సమిష్టి రూపమే 'శిల్పం'. కాస్త లోతుగా ఆలోచించినప్పుడు ఏ మూర్తీ చెక్కబడని మామూలు రాయి కూడా శిల్పమే. ఆ మాటకి వస్తే, ప్రపంచంలోని ప్రతీ వస్తువూ ఒక శిల్పమే.



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3 34 హైదరాబాద్ జనవరి : 2023

# పూలు

1
తోటమాలి
చెమటతడి
బంతిపూల
పుప్పొడి
2
వాడి పోతానని
తెలిసి నవ్వేది
వికసించే
పువ్వొక్కటే
3
కాలమేదైన
రంగు మారని పువ్వు
స్వచ్ఛ మైన
మనసు
4
గుడి లో నైనా
గుడిసె లో నైనా
ఒకే రకం
పూల సుగంధం
5
రాలిన పువ్వుల
త్యాగ ఫలం
కాసిన కాయల
తీపిదనం
6
మూగ మనసుల
స్వాగతం
బంతిపువ్వుల
తోరణం
7
నీటిలో దాగిన
రంగుల కలలను
నిర్ధారిస్తూ
పువ్వులు







**బి. అంజనీ దేవి**
హనుమకొండ,
ఫోన్ : 990 896 2730

## శ్రీ బి.ఎన్. శాస్త్రి పురస్కార ప్రదాన చిత్రమాలిక








ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3 35 UGC Care List Approved Journal
హైదరాబాద్ జనవరి : 2023

# సమాచార నిధులు – భవిష్యత్ వారధులు

**డా. టి. సతీశ్, డా. ఎస్. చంద్రయ్య**

ఫోన్ : 939161443, 9963709032

పెరిగిన సాంకేతికత తెచ్చిన అనేక వెసులుబాట్లలో సమాచార నిధుల ఏర్పాటు ఒకటి. ప్రపంచంలో ఎవరు ఏ మూలన ఉన్నా కేవలం ఒక్క 'నొక్కు'తో ఒకే అంశానికి సంబంధించిన వైవిధ్యమైన సమాచారాన్నంతా కళ్ళముందు ఆవిష్కరించుకునే అద్భుతాన్ని సుసాధ్యం చేసుకోవడం ఈ సమాచార నిధుల అంతిమ లక్ష్యం. సమాచారాన్ని ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకొస్తే, అది జాతి సమగ్రాభివృద్ధికి దారులేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ కాలంలో ఇటువంటి ప్రయత్నాలు Open knowledge System పేరుతో ముమ్మరమవుతున్నాయి.

**సమాచార నిధి అంటే :**

సమాచారం అనేమాటకు సమానార్థకంగా ఆంగ్లంలో Data, information, content అనే మాటల్ని వాడుతున్నాం. సమస్త జ్ఞానసంచయాన్ని 'సమాచారనిధి' అంటాం. ఒక అంశానికి సంబంధించిన సమస్త సమాచారం ఒకచోట భద్రపరిచి, ఉపయోగం లోకి తీసుకురావడం దీని ప్రయోజనం. సమాచార నిధులు జాతి తరతరాలుగా పోగుచేసుకున్న జ్ఞానస్వరూపాలు.

**ఎందుకీ సమాచార నిధులు?**

ప్రపంచీకరణయుగంలో సమాచార ప్రాధాన్యత బాగా పెరిగింది. ఎవరి దగ్గర ఎక్కువ సమాచారం ఉంటే వారు ఈ ప్రపంచాన్ని శాసిస్తారనే భావన స్థిరపడింది. ఇదంతా మార్కెట్ విస్తరణకాంక్షలో భాగంగా పెరుగుతున్న ఆలోచన. ప్రపంచీకరణ చేస్తోన్న విధ్వంసాలనుంచి తమ జ్ఞానసంపదను కాపాడుకోవడం కోసం చేస్తున్న 'స్థానికతా ప్రయత్నం' కూడా. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా తమతమ భాషల్లోని జ్ఞానసంపదను ఒకే దగ్గర పోగుచేసుకోవాలనే స్పృహ పెరిగింది. తెలుగువాళ్ళు వేల సంవత్సరాలుగా సృష్టించు కుంటూ వస్తూన్న జ్ఞానాన్ని ఒక దగ్గర చేర్చుకోవలసిన అవసరాన్ని ఆధునిక అవసరాలు, పెరుగుతున్న సాంకేతికత నొక్కి చెప్తున్నాయి. మన తెలుగు పుస్తకాలు కొన్ని డిజిటల్ రూపంలో విదేశీ సంస్థల మాధ్యమాల్లో దొరుకుతుంటే ఒకవైపు ఆశ్చర్యం కల్గుతూనే, మన గ్రంథాల్ని మనమే అందుబాటులోకి తీసుకురాలేని స్థితిని చూసి బాధేస్తోంది.

ఈ రోజు సమాచార నిధులను ఏర్పాటుచేసుకోలేని జాతే పేదజాతి. ఇది ఆ జాతి గుప్తనిధి కంటే విలువైనది. సమాచారనిధి అంటే– ఏమిస్తే అది తీసుకోవడంకాదు. ఔత్సాహికులు ఏం కావాలనుకుంటున్నారో దాన్ని అందించగల్గడం అనేది గమనంలో







ఉంచుకోవాలి. ఒక్కోసారి వాళ్ళ కోరుకున్న దానికి మించిన ప్రయోజనం ఈ సమాచార నిధులు అందించవచ్చు. నేడు సమాచారం వెల 'అమూల్యం'. అంతటి ప్రాధాన్యత సమాచార నిధులకు ఏర్పడబోతున్నది.

**సమాచార నిధులు – 'జాతీయ విద్యావిధానం-2020'**

నూతన జాతీయ విద్యావిధానం 2020లో ప్రతిపాదించినట్టు సాంకేతికవిద్యని మాతృభాషలో బోధించడంవంటి ఆలోచనలు కొత్తవేంకాదు. కానీ అవి ఆలోచనల రూపంలోనే ఆగిపోయాయ్. తెలుగులో శాస్త్ర, సాంకేతిక విద్యా విషయాల్ని వ్యక్తం చేయలేమన్న స్పృహ ఎక్కువమందిలో కన్పిస్తోంది. అటువైపు జరిగిన కృషీ పరిమితమే. అందుకే తెలుగులో శాస్త్రవచనం అభివృద్ధి చెందలేదు. మాతృభాషలో విద్యాబోధన జరగడానికి అవసరమైన పాఠ్యసామగ్రి వెంటనే అందుబాటులో లేదన్నది గమనించాలి.

అయితే, తెలుగు పత్రికారంగాన్ని క్షుణ్ణంగా గమనిస్తే, శాస్త్ర సంబంధ అంశాల్ని సాధారణ పాఠకులకు దగ్గర చేయాలనే అప్పటి పత్రికల, రచయితల కృషి, వాళ్ళు వాడిన భాష, పాటించిన పద్ధతులు చిన్నవేమీ కావు. చాలా విలువైన పరిశ్రమ. జరిగినకృషి విడివిడిగా అక్కడక్కడా దొరికీదొరక్క పాత గ్రంథాలయాల్లో శిథిలావస్థకు చేరుకున్నాయ్. కొన్నైతే మచ్చుకైనా కనపడవు.

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళైనా కావాల్సినజ్ఞానం మాతృభాషల్లో అందడంలేదు. అందుక్కారణం ఇలాంటి సమాచార నిధుల ఏర్పాటు జరగకపోవడం. ఇలాంటి సందర్భంలో ఈ సమాచార నిధులకు విద్యాబోధనకు మించిన విస్తృత ప్రయోజనాలున్నాయ్.







**తొలి అడుగులు విజ్ఞాన సర్వస్వాలు...**

సమాచార నిధుల ఏర్పాటుకు సంబంధించిన పనులు గతం లోనూ జరిగాయ్. సమాచార నిధుల రూపకల్పనకోసం తెలుగు భాషాసాహిత్య పరిశోధకులు విజ్ఞానసర్వస్వాలను రూపొందించాలన్న బృహత్ ప్రయత్నాలు చేశారు. ఆ విజ్ఞాన సర్వస్వాల ప్రయత్నమే సమాచారనిధుల తొలి అడుగులు.

తెలుగులో పూదూరి సీతారామశాస్త్రి రూపొందించిన **'పెద్ద బాలశిక్ష'** బాలల విజ్ఞాన సర్వస్వంగా ప్రసిద్ధి. కొమర్రాజు లక్ష్మణరావు **ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం** పేరుతో చేసినకృషి తెలుగులో విజ్ఞాన సర్వస్వాల రూపకల్పనకు ప్రారంభదశ. తర్వాత వైయక్తిక, సంస్థాగత స్థాయిల్లోనూ ఆంధ్ర భాషా సమితి, తెలుగు విశ్వవిద్యాలయంవంటి సంస్థలూ కృషి చేశాయ్. ఈ విజ్ఞాన సర్వస్వాలు గణిత, భౌతిక, రసాయన, వైద్య, భౌగోళిక, పరిపాలన, వ్యవసాయ, పారిశ్రామిక, వ్యాపార, భాషాసాహిత్య, కళా, వాస్తు మొదలైన అనేక విషయాల సమాహారంగా కన్పిస్తాయ్. పెరిగిన ఆధునిక అవసరాలన్నీ తీర్చలేకపోయినా ఇవి మంచి ప్రయత్నాలు. ఈ కోవలో వచ్చిన విజ్ఞానసర్వస్వాలు ఈ సమాచారనిధులకు ప్రాథమిక ఆకరాలు.

కానీ, ఆ కాలంనాటి అవసరాలకు, వారి పని విధానానికి, వారు ఉపయోగించిన సాంకేతికతకూ నేటి అవసరాలకు, ఇప్పటి పని విధానానికి, పెరిగిన సాంకేతికకు చాలా తేడా ఉంది. ప్రయోజానాల లోనూ అంతే. ఇది సాంకేతిక (డిజిటల్) యుగం. సమాచార లభ్యతను సునాయాసంగా సొంతం చేసుకోవాలనే తరం ఈనాడు క్రమంగా పెరుగుతోంది. ఈ కాలంనాటి అవసరాలు కేవలం జ్ఞానసముపార్జన కోసం మాత్రమే కాదు. ఇది తెలుగుజాతి సమగ్రాభివృద్ధిని లక్షించి చేస్తున్నపని. ఇప్పుడు మనదేశంలోని ఇతర భారతీయభాషల్లోనూ ఇలాంటి ఆలోచనలు సాగుతున్నాయ్. సంస్కృతానికి పండిట్ (https://www.panditproject.org) ప్రాజెక్ట్ పేరుతో దేశ, విదేశాలనుండి వందమందికిపైగా స్వచ్ఛందంగా పనిచేస్తున్నారు. 2019లో ఒక బృందంగా ఏర్పడి, కన్నడభాషకు ఇలాంటి కృషి (https://www.bookbrahma.com) జరుగుతోంది.

వేల సంవత్సరాలుగా ఉత్పత్తి అవుతోన్న విజ్ఞానాన్ని అందించడంతోపాటూ ఆధునికంగా జరిగే కృషిని ఎప్పటికప్పుడు నవీకరించాల్సిన విలువైన కార్యక్రమం. ప్రాథమికంగా ఈ సమాచార నిధులు వేరువేరు రంగాలుగా మొదలుపెట్టి, బృహన్నిధిని ఏర్పాటు చేయాలి.

**సమాచారనిధుల ఏర్పాటు ఎలా?**

భవిష్యత్ అవసరాల్ని తీర్చాల్సిన ఇంతటి బృహత్ కార్యక్రమాన్ని దశలవారీ ప్రణాళికాబద్ధంగా కార్యరూపంలోకి తీసుకురావాలి.

**మొదటిదశ :** ఇప్పటికే జరిగిన పూర్వకృషిలో పనికొచ్చే సమాచారాన్ని విస్తృతంగా సేకరించాలి. నిర్దిష్ట రంగాల్లో అనుకున్న సమాచారాన్ని పోగుచేయాలి. అందులో జారిపోయిన అంశాల్ని ఇప్పటి అవసరాలకు తగినట్లు చేర్చుకోవాలి.

**రెండోదశ:** సేకరించిన సమాచారాన్ని సూచీలుగా రూపొందించు కోవాలి. రచనా వైవిధ్యం దృష్ట్యా ఈ సూచీలను వివిధ రకాలుగా రూపొందించుకోవాలి. ఉదాహరణకు సాహిత్యసూచీల్లో పాటించాల్సిన ప్రణాళిక ఇలా ఉండాలి. ప్రాచీన సాహిత్యం విషయంలో రచనపేరు, రచయిత పేరు, నామాంతరాలు, లింగం, ప్రక్రియ, విషయం, భాష, కాలం, ఆస్థానం, ప్రాంతం, (గ్రామం, మండలం, జిల్లా) కులం, అంకితం, లభ్య, అలభ్య ముద్రిత వివరాలూ (పునర్ముద్రణలు కూడా), ప్రచురణ స్థలం, రాతప్రతి లభ్యస్థానం (ప్రాచీనమైతే తాళపత్ర గ్రంథ సంఖ్య, స్థలం), జనన – మరణ కాలాలతో పాటూ ఇతర ప్రత్యేక అంశాలేవైనా ఉంటే విశేషం శీర్షికలో తప్పనిసరిగా చేర్చాల్సిందే.

1900వ సంవత్సరం నుండి వచ్చిన పద్య, పద్యేతర ఆధునిక ప్రక్రియలన్నిటికీ నవలాసూచి, నాటకసూచి, విమర్శగ్రంథసూచి, సాహిత్యేతర వివిధ శాస్త్ర, శాస్త్రేతర పుస్తకాలు, వ్యాసాలకు సూచులు తయారుచేసి, తెలుగు గ్రంథసూచి రూపొందించాల్సిన అవసర ముంది. శాసనాలూ రాతప్రతులూ కైఫియత్తులూ జానపదసాహిత్యమూ మర్చిపోకూడదు.

ఈ రంగంలో జరిగిన పూర్వకృషినంతా ఉపయోగించుకోవాలి.

ఆధునికకాలంలో వచ్చిన సాహిత్యం ప్రాచీన సాహిత్యంకంటే భిన్నం. ఎన్నో సామ్యాలూ వైవిధ్యాలూ వైరుధ్యాలూ ఉన్నాయ్. అనువాదాలూ (ఏ భాషనుండి) అనుసృజనలూ ప్రభావాలూ ప్రేరణలూ వంటి ఎన్నో కొత్త అంశాల్ని చేర్చాల్సి ఉంటుంది. రాజకీయం, ఆర్థికం, సామాజికం, బాలసాహిత్యం, అభ్యుదయం, హాస్యం, విషాదం, సైన్స్ ఫిక్షన్, బూతు, అపరాధపరిశోధనం... ఇలాంటి ఎన్నో వైవిధ్యమైన వర్గీకరణలతో వివరాల్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఆధునిక ప్రక్రియలన్నిటికీ సూచులు తయారుచేయాల్సిన అవసరం ఉంది. వాటికి ఆంధ్రభారతి, కథానిలయం వెబ్‌సైట్లు నమూనా (Model) గా ఉపయోగపడతాయ్. మొదటి, రెండోదశలు ఒక స్థాయి దాటాక జమిలిగా సాగుతుంటాయ్.

**మూడోదశ :** రచనల్ని ఒకచోటికి తీసుకురావడం, స్కాన్ చేసి మృదుప్రతులు (Soft copies) గా రూపొందించడం మూడోదశ. ముద్రిత తెలుగు రచనలన్నీ ఒకేచోట భద్రపరిచే లేదా సేకరించి ఒకచోటకు చేర్చే ఏర్పాట్లు ఏవీ ఇప్పటికీ లేవు.

సూచీల్లోని సమాచారాన్నిబట్టి ఒక రచన ఎక్కడుందో సేకరణదశలోనే తెలుస్తుంది. వర్తమాన రచయితల నుండి తమ రచనల మృదుప్రతుల్ని నేరుగా సేకరిస్తే, చాలా సమాచారం త్వరితగతిన పోగవుతుంది. రచయిత అందుబాటులో లేనప్పుడు వాళ్ళ కుటుంబ సభ్యులు, గ్రంథాలయాలు, ప్రచురణకర్తలు, వ్యక్తిగత గ్రంథ సంచయాల నుండి సమాచారం సేకరించాల్సి ఉంటుంది.

**నాల్గోదశ :** మృదుప్రతుల్లోని సమాచారం యూనీకోడ్ (Unicode) లోకి మార్చుకోవడం నాల్గోదశ. యూనికోడ్ రూపంలో సమాచారాన్ని నిక్షిప్తం చేయడంవల్ల ప్రయోజనాలు ఎక్కువ. ఒక నిర్దిష్ట అంశంపై ఉన్న విస్తృతమైన, విభిన్నమైన విజ్ఞానాన్ని అనేక పాఠ్యాలనుండి ఏకకాలంలో పొందే అవకాశం ఉంటుంది. విస్తృతంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ఉపకరణాలను ఈ సమాచార నిధులతో అనుసంధానించాలి. దీనిద్వారా విషయాన్ని పాఠ్యంనుండి శ్రవణం, లిప్యంతరీకరణం (Transliteration), అనువాదం ద్వారా సులభంగా మరింతమందికి అందించవచ్చు. పఠనానికంటే, శ్రవణం, దృశ్యానికి ప్రాధాన్యత పెరుగుతూవస్తోంది. పఠనం కంటే శ్రవణం, దృశ్యంలో సౌఖ్యం ఎక్కువే. శ్రవణ, దృశ్యలోపం ఉన్న వాళ్ళకేకాక, తెలుగులిపితో పరిచయం లేకపోయినా, నిరక్షరాస్యులైన తెలుగువాళ్ళకు మరింత ప్రయోజనకరం.

**ఐదోదశ :** ఇలా రూపొందిన వాటిని ఎప్పటికప్పుడు ప్రపంచానికందించే ప్రక్రియ ఆరోదశ. కొత్తగావచ్చే అదనపు సమాచారాన్ని నవీకరించుకునే వెలుసుబాటు ఇందులో ఉంటుంది. ఇది నిరంతరం కొనసాగుతూనే ఉండాలి.

ఈ దశలన్నిట్లోనూ సమాచార లభ్యత, విశ్లేషణ, వినియోగానికి అనుగుణంగా సాంకేతిక ఉపకరణాల్ని వాడుకోవాలి.

లిపిలో వ్యక్తీకరణకు సాధ్యంకాని విషయాల్ని దృశ్యరూపంలో అందించడంవల్ల మరింత స్పష్టతను తీసుకురావడానికి ఈ సమాచార నిధులు ఉపయోగిస్తాయ్.

**రచయితల భాగస్వామ్యమే కీలకం :**

ఈ 'సమాచార నిధుల' ఏర్పాటుకు అత్యంత ప్రధానమైనవారు, ఒకరకంగా మూలస్తంభాలు రచయితలే. రచయితలు తాము రాసిన అక్షరాలపై ఉన్న మమకారాన్ని వదులుకొన్నప్పుడే సమాచార నిధుల ఏర్పాటు సాధ్యం. వారి ఔదార్యమే ఈ బృహత్కార్యానికి ఆయువుపట్టు. సమాచార నిధులకు సంబంధించి ప్రభుత్వాలు వీరికి 'ప్రయోజనం' కలిగించేవిధంగా ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సి ఉంటుంది.







సమాచారనిధి ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వాలు తయారు చేయబోయే కొత్త చట్టాలను రచయితలు కూడా పెద్దమనసుతో గౌరవించాలి. దాన్ని ఒక సామాజిక బాధ్యతగా గుర్తెరగాలి. ఈ ప్రక్రియలో రచయితల కృషికి తగిన గుర్తింపును ప్రభుత్వాలు ఇవ్వాలి.

సమాచార నిధుల ఏర్పాటు విషయంలో రచయితలు, ప్రభుత్వం, ముద్రణారంగంవారు ఎంతో చిత్తశుద్ధినీ, ప్రేమనూ ప్రదర్శించగలగాలి. అనేకసార్లు చర్చోపచర్చలు జరగాలి. చరిత్రలో ఒక కొత్త ముద్రణా వ్యవస్థను పాదుకొల్పడానికి, ప్రభుత్వాలకు సహకరించాలి.

**ఔత్సాహికుల కృషి అభినందనీయం**

తెలుగులో లభ్యమవుతోన్న సమాచారాన్ని సేకరించి, స్కాన్ చేసి, వాటికి సూచీలను తయారుచేస్తున్న భాషాప్రేమికులు ఎందరో ఈ రంగాన్ని ఎటువంటి లాభాపేక్ష లేకుండా చేస్తుండటం, వాటి ఫలితాలను ప్రజలు ఇప్పటికే పొందుతుండటం గమనార్హం. కథానిలయం, ఆంధ్రభారతి, వికీపీడియా లాంటి సంస్థల కృషి అభినందనీయం.

**కథానిలయం :**

శ్రీకాకుళంలో కాళీపట్నం రామారావు స్థాపించిన కథానిలయం (http://kathanilayam.com) వెబ్‌సైటు ద్వారా ఇప్పటి వరకూ తెలుగు సాహిత్యంలో వచ్చిన కథాసాహిత్యాన్నంతటినీ అంతర్జాలంలో పెట్టాలనే బృహత్కార్యం చేపట్టి, చాలావరకూ సఫలీకృతులయ్యారు. దీని సూచీని తెలుగు రచయిత వివినమూర్తి చేస్తుండగా, కథా పుస్తకాల్ని మృదుప్రతులు (soft copy)గా చేయడం, వాటిని వివిధ రూపాల్లో అంతర్జాలంలో ఉంచడానికి మన్నం వేంకటరాయుడు నిర్వహిస్తున్న మనసు ఫౌండేషన్ అన్ని రకాలుగా సహాయం చేస్తోంది. ఔత్సాహికులైన మరికొంతమంది తెలుగువాళ్ళు సహాయకులుగా ఉన్నారు. ఈ కథలన్నిటినీ అంతర్జాలంలో ఉంచడానికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని ఆంధ్రభారతి వాడపల్లి శేషతల్పశాయి అందిస్తున్నారు. ఈ సూచీలో కథ, కథకుడు, ముద్రణ వివరాల్తోపాటూ పరిమిత పరిధిలో అయినా అక్కడే కథను చదువుకోవడానికి పి.డి.ఎఫ్. రూపంలో కథలు అందుబాటులో ఉన్నాయ్. దానిపక్కనే

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2023

## జయహో..! 2023

క్యాలెండర్ మారుతున్న వేళ
మనసు పొరల మసకను తొలగిద్దాం!
సస్నేహ సౌజన్య పోషాకుల్ని
మేను తరువులకు అతికిద్దాం!
అనుబంధపు చిగుళ్ళను
మానవ మ్రోడులకు మొలిపిద్దాం!
ఆత్మీయతా సరాగాల విపంచికకు,
తంత్రులమై విజయనాద మాలపిద్దాం!
చీలికలతో కలబడడం కన్నా,
సంఘటితమై కలసి నిలబడడం మిన్న!
అన్న భావన హృదయాలకు పులిమేద్దాం!
అవును ... ఇప్పుడు...

క్యాలెండర్ మారుతున్న వేళ...
మన ఆలోచనలను... ఆచరణను
అభివృద్ధి పథంవైపు మళ్ళిద్దాం!
కారాలు మిరియాలు నూరడం మాని,
సహకార భావనతో పయనిద్దాం!
సూర్యునిలా అందరికీ చైతన్యం పంచేద్దాం!
చంద్రునిలా చంద్రికలను వెదజల్లేద్దాం!
నదులమై మదులను ప్రక్షాళన చేద్దాం!
అన్నిటికీ మించి...
నిష్కల్మష భావనతో,
మనుషుల్ని మానవత్వంతో నిలబెడదాం!
మనసుల్ని అతికించి
సుమనస్కులుగా మలుద్దాం!

క్యాలెండర్ మారుతున్న వేళ...
మనం కార్యాచరణకు నడుం బిగిద్దాం!
ఆశావహ దృక్పథంతో అడుగేద్దాం!
నవశకానికి నాందీగీత మాలపిద్దాం!
ఆంగ్ల నూతన సంవత్సర
శుభాభినందనలతో...

**అవుసుల భానుప్రకాశ్** అవధాని,
సంగారెడ్డి, ఫోన్: 960 320 4507









శ్రవణం అనే శీర్షిక ఉంది. భవిష్యత్తులో ఆ కథల్ని శ్రవణరూపం (Audio) లో అందించాలన్న నిర్వాహకుల ఆశయం తెలుస్తోంది.

**ఆంధ్ర భారతి :**

2001, సెప్టెంబర్ 6 నుండి 'ఆంధ్రభారతి.కామ్' (https://andhrabharati.com) పాఠకులకు అందుబాటులోకి వచ్చింది. దీన్ని వాడపల్లి శేషతల్పశాయి, కాలెపు నాగభూషణరావు అనే ఇద్దరు స్నేహితులు ప్రారంభించారు. వీరిద్దరూ సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు. ఇద్దరికీ అభిమాన విషయం సాహిత్యం. అందుకే **"కంప్యూటర్ల వల్లా, ఇంటర్నెట్ సౌకర్యం వల్లా నేడు ఎవరైనా, ఎక్కడైనా, ఎప్పుడైనా విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవటానికి వీలైన పరిస్థితులు వచ్చాయి. ఈ సౌకర్యాలను వాడుకొని, తెలుగులోని ఉత్తమ సాహిత్యాన్ని సాహిత్యాభిమానులకు అందుబాటులో వుంచాలనే మహదుద్దేశంతో మా యీ ప్రయత్నానికి శ్రీకారం చుట్టాము."** అంటూ సదుద్దేశ్యంతో ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

సమాచార నిధుల ఆవశ్యకతను తెలుగు సమాజం గుర్తించి, సమాచార సౌధ నిర్మాణంలో మనస్ఫూర్తిగా భాగస్వాములై, తెలుగుజాతి భవిష్యత్తుకు వారధులుగా నిలవాలని కోరుకుంటున్నాం.

ఆంధ్ర భారతి

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3 (39) హైదరాబాద్ జనవరి : 2023

తెలంగాణ విస్మృత కవులు - 6

# బుచ్చయ్య శరణు

డా. పెబ్బేటి మల్లికార్జున్, ప్రధానాచార్యులు, పాలెం, ఫోన్: 9491881916

పరిశోధన నిమిత్తం తెలంగాణా వ్యాప్తంగా క్షేత్ర పర్యటన చేస్తున్న సందర్భంలో బుచ్చయ్య రాసిన కీర్తనలతో ఉన్న ముద్రిత జీర్ణప్రతి ఒకటి లభించింది. ఇది క్రీ.శ.1940లో ముద్రణ పొందింది. ఈ గ్రంథం ప్రారంభంలో గ్రంథకర్త గురించి 'శ్రీ నిజాము రాష్ట్రములో జేరిన మహబూబ్‌నగర్ జిల్లా తాలుకా నాగర్‌కర్నూల్ మౌజే తాడూరు గ్రామ నివాసులగు సనాతన శ్రీమాన్ వీరశైవలింగ బ్రాహ్మణులగు కొల్లూరు లింగయ్య కుమారుడగు బుచ్చయ్య శరణుగారు భజన పారాయణులకు భక్తి మార్గోపయుక్తంబు, తాడూరు శివభజనకీర్తనలు రచించినది' అని ఉంది. ముస్సప్యాట కవి లింగయ్య గారిచే పరిశోధించబడింది. దీనిని బట్టి కవికాలం 1940 కంటే ముందే అని చెప్పవచ్చు. గ్రంథంలో ముందు ఒక పుట పూర్తిగా లేకపోవడం వలన కవి ఇతర వివరాలు తెలియడం లేదు.

ఇతని తల్లిదండ్రులు లింగమాంబ కొల్లూరు లింగయ్యలు. లింగమాంబ వట్టెం యాలాల కొండయ్య గారి పుత్రిక. లింగయ్యగారి సోదరి శివమ్మ. ఆమె కుమారుడు భీమలింగయ్యకు లింగయ్య తన కుమార్తె నాగమాంబను ఇచ్చి పెళ్లి చేస్తాడు. బుచ్చయ్య శరణుకు సోదరుడు బుచ్చయ్య ఉన్నాడు. నాగమాంబ వీరి సోదరి.

ఉమ్మడి పాలమూరు ప్రాంతంలో కీర్తన సాహిత్యం చాలా ఉంది. జాతర్లు, సప్తాహాల సమయంలో, దేవాలయాల దగ్గర పాడుతుంటారు. అయితే ఈ సాహిత్యం ముద్రణ పొందేది తక్కువే. అముద్రితంగా ఉన్నది ఎక్కువ. ఈ గ్రంథంలో 185 కీర్తనలున్నాయి. ఈ కవి తాను పొందిన అనుభవాన్ని, అనుభూతిని అలవోకగా, ఆశువుగా చెప్పిన వాగ్ధారయే ఈ కీర్తనలు. ఈ కీర్తనలన్ని భక్తి మార్గంలో, వేదాంత మార్గంలో ఉన్నాయి. 'భజ్ సేవాయాం' అని భజన శబ్దం యొక్క వ్యుత్పత్తి. అంటే మన ఇంటికి వచ్చే పెద్దలకు చేసే సేవ భజన అని అర్థం. కాని ప్రస్తుతం భజన అంటే పొగడ్త అనే అర్థం స్థిరపడింది. **"భజనంటే సేవ, భగవంతుని అనంత నామాలకు రూపగుణ మహిమల్ని రాగతాళయుక్తంగా తన్మయత్వంతో సమిష్టిగా కీర్తించడం భజన అంటారని"** మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారు తెలుగు వారి జానపద కళారూపాలు అనే పుస్తకంలో పేర్కొన్నారు. భజన కీర్తనలు ఉమ్మడి పాలమూరు జిల్లాలో విరివిగా వచ్చాయి.

ఈ గ్రంథంలో 5 భాగాలున్నాయి. మొదటి భాగంలో ఉన్న 53 కీర్తనలు శివపార్వతులను స్తుతిస్తూ ఉన్నాయి. ఆటతాళంలో ఒక కీర్తన -



**'పార్వతినాయకా! పాలనజేయుమికా**
**సర్వము నీవేయికా! సరగున బ్రోవుమికా**
**నిమ్మవపాలుడవూ! నిర్మలశీలుడవూ**
**ప్రేమతో యేలుననూ! వేమరు మ్రొక్కెదనూ'** (34వ కీర్తన)

**'హారతిచ్చెదనమ్మ జగదాంబ! ముల్లోకమాత ॥హా॥**
**ధీర గుణగంభీర జగదాధార భక్త విచార సుందరి**
**మేరుగిరిరాట్ తనయ త్రిపుర సుందరీ మీకిదుగో మంగళ ॥హా॥**
(కీర్తన-53)

రెండవ భాగంలో విష్ణువు, లక్ష్మీదేవుల గురించి కీర్తనలున్నాయి. ఈ భాగాన్ని సీసపద్యంలో -

**"శ్రీలక్ష్మీ శుభలక్ష్మి శృంగార ధనలక్ష్మి**
**భూలక్ష్మి మహలక్ష్మి భోగలక్ష్మి**
**జయలక్ష్మి పక్షివాహనసతీ వరలక్ష్మి**
**దయలక్ష్మి మోక్ష ప్రధానలక్ష్మి**
.......................................
**యిష్టముగ బ్రోవు సాష్టాంగ శరణు శ్రీ ఆదిలక్ష్మి"** అని కీర్తించాడు.

ఈ కవి నిరాశతో, నిర్వేదంతో -

**ఎంతకాని వేదుకుందురా**
**వోమాయక మనుసా కంతు జనకుని చింతజేయరా ఎంతకాని**
**ఎంతకాని వేడుకుందును అంతరంగమునందు సీతా**
**కాంతునీగన నేరవైతివి పంతమా నీకింత ధీమా**
**వోపజాలవిదేమి కోపమూ** (కీర్తన - 74)

శిష్యుడిలో ఉన్న జ్ఞానాన్ని వికసింపజేయడంలో గురువు ప్రతిభ కన్పిస్తుంది. శిష్యుడు గురుముఖంగా నేర్చుకుంటే సంపూర్ణ జ్ఞానం వస్తుంది. గురువే ఆ జ్ఞానాన్నిచ్చే సమర్థుడు.

**'మనసా సద్గురు పూజ జేతమా**
**మానా మనవి వానితో దెల్పుకుందామా**
**మనసున శ్రీగురు పదములు వెరనమ్మి**
**ఘనముగ మురియుచు గన్నేరు పూలతో** (కీర్తన - 63)

మూడవభాగంలో తత్త్వ కీర్తనలున్నాయి. తత్త్వం అంటే పరమాత్మ అనీ, స్వభావం అని అర్థాలున్నాయి. బ్రహ్మంగారు రాసిన కాలజ్ఞాన గేయాలకు 'తత్త్వాలు' అని పేరు. తెలుగులో తత్త్వ కీర్తనల్లో ఇవే మొదటివి. ఇందులో తత్త్వ రూపంలో గురుశిష్య సంవాదాన్ని రాయడం విశేషం.

**శిష్యుడు :**
పదధ్యానమును జేసెదా! సద్గురురాయ పరమార్థమును దెల్పరా!
పరమార్థమును దెల్పా మరుడానుదయగుప్పా! పరులానేవేడక పంచజేరియునీదు!

**గురువు :**
తెల్పెద మది నిల్పరా! తాడూరు శ్రీ శరణుడ మది మల్పరా!
పంచభౌతికమాయ దేహమున్ సరిపించి! మించుదానిని జూడు వంచానలేకాను

**శిష్యుడు :**
అజ్ఞానమును మాన్పరా! సద్గురురాయ సుజ్ఞానమును దెల్పరా!
అజ్ఞానమున ఆటపాటల లోపలయెన్నో ప్రజ్ఞచే పరసతుల సంజ్ఞనజేసితి తండ్రి

**గురువు :**
సుజ్ఞానమును దెల్పెదా! శరణుడనీవు! నిపుణత్వముననుండరా
ప్రజ్ఞా విడియు జఠరాగ్ని పూరించియూ! భగ్నాముగాకుండ మగ్నూడవైయుండు

ఇట్లా గురు శిష్యుల మధ్య కీర్తన రూపంలో ఆత్మజ్ఞానం గురించిన చర్చ నడుస్తుంది. నాల్గవ భాగంలో మళ్లీ శివ పార్వతుల గురించి కీర్తనలున్నాయి. 118 నుండి 167 వరకు ఈ భాగం ఉంది. ఈ భాగంలో శబ్దాలంకారాలతో ఒక ధారగా లయ నడుస్తుంది.

**ఫాలలోన పాపహరణా**
**నీలగళ గంగాధరా**
**నీలగళధరా శూల ధర గంగాధరా**
**దుష్టజన సంహార అష్టమూర్తి శుభగంగాధరా**
**కష్టపెట్టక మమ్ముబ్రోవర** (కీర్తన -135)

5వ భాగంలో వినాయకుడి గురించిన కీర్తనలున్నాయి

**'రార పార్వతి పుత్రా**
**సురపూజిత నిర్మల గాత్ర**
**రార రార మీ చరణము నా మది**
**మరువక హృదయము లోపల దలచితి** (కీర్తన-167)

వైవిధ్య భరితంగా కీర్తనలు రచించిన ఈ కవి యొక్క ఇతర రచనలు తెలియదు. ఏ సాహిత్య చరిత్రలలో కూడా ఈ కవికి స్థానం దక్కలేదు. అతి కష్టం మీద ఈ జీర్ణప్రతి లభించడం వలన ఈ కవి గురించి రాయగలిగాను.

---

**"ఉద్ధరేదాత్మనాఽఽత్మానం నాత్మానమవసాధయేత్ ।**
**ఆత్మైవహ్యాత్మనోబంధు: ఆత్మైవ రిపురాత్మన: ।।" (భగవద్గీత 6-4)**

అందరూ తమను తామే ఉద్ధరించుకోవాలి. వారిని వారు అధోగతిని పొందించుకోకూడదు. ఇంద్రియాలను జయించుకునే ప్రయత్నం చేస్తే తనకు తానే బంధువు అవుతాడు. అదేవిధంగా జయించక పోతే తనకు తానే శత్రువు అవుతాడు.

ఈ లోకంలో పుట్టిన అందరూ ఏవో కర్మల కొరకు మాత్రమే పుడుతుంటారు. పుట్టిన ప్రతివారు తప్పనిసరిగా తాము‌న్న స్థితి నుండి ఉన్నతస్థితివైపు ఎదగడానికి మాత్రమే ప్రయత్నించాలి. ఎవరో వచ్చి తమను ఉద్ధరించే అవకాశం లేదు. తమ కర్మల ప్రకారమే ఎవరైనా తమ చుట్టూ చేరుతారు. అయినా తమకున్న పుణ్యం వల్లనే వారు తమకు ఉపయోగపడతారు. అందువల్ల అనవసరమైన విషయాలపై మనసు కేంద్రీకరించకుండా, ఉన్నతశక్తిపై దృష్టి సారించినప్పుడు మాత్రమే తమను తాము ఉద్ధరించుకునే అవకాశం కలుగుతుంది.

మన చుట్టూ ఎప్పుడూ ఏవో సమస్యలు ఉంటూనే ఉంటాయి. సమస్యలను చూస్తూ, ఇంద్రియాలకు లోలత్వము పొందుతూ స్వల్ప సంతోషాలకు పొంగిపోవడం, చిన్న బాధలకే కుంగిపోవడం వల్ల ఎదగడం కష్టం. అసలు సమస్యలు ఎందుకు వస్తుంటాయి? తమకే అనేక రూపాల్లో కష్టాలు వస్తుంటాయని ఎందుకు మనం భావిస్తున్నాం? ఇవి మనని వేధిస్తున్న ప్రశ్నలు. తట్టుకునే శక్తి ఉన్నంతవరకు ఏదీ సమస్య కాదు. తట్టుకునే శక్తి లేనప్పుడు మాత్రమే ఏ విషయమైన సమస్యగా భావించడం జరుగుతుంది. ఒక చిన్నపిల్లవాడికి ముల్లు గుచ్చుకుంటే బాగా ఏడుస్తాడు. అదే కొంత పెద్దవానికి గుచ్చుకుంటే అంత ఎక్కువగా బాధపడడు. ఇద్దరికీ జరిగిన నొప్పి ఒక్కటే అయినా చిన్నపిల్లవానికి తట్టుకునే శక్తి ఉండకపోవడం వల్ల ఏడవడం జరుగుతుంది. అందుకే మన ప్రయత్నం ద్వారా మనం అన్ని సమస్యలను తట్టుకునే శక్తిని పెంచుకోవాలి.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3 41 హైదరాబాద్ జనవరి : 2023

# కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం – 29

# ఆపద్బాంధవుడు

టి. లక్ష్మీనారాయణ, తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254



"కె.విశ్వనాథ్ చలన చిత్రాలు– సామాజిక అవలోకనం" నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం "ఆపద్బాంధవుడు". సుప్రీం హీరో నుండి మెగాస్టార్ గా ప్రఖ్యాతి గాంచిన 'చిరంజీవి' ఈ చిత్రంలో కథానాయకుడు. శుభలేఖ, స్వయంకృషి లాంటి చిత్రాల్లో కె.విశ్వనాథ్ దర్శకత్వంలో నటించిన చిరంజీవి ఈ చిత్రంతో మూడవసారి నటించారు. మాస్, వ్యాపారాత్మక చిత్రాల్లో తెలుగు ప్రేక్షకలోకాన్ని ఉర్రూతలూగిస్తూనే కె.బాలచందర్ 'రుద్రవీణ', కె.విశ్వనాథ్ లాంటి దిగ్గజ దర్శకుల చిత్రాల్లో సగటు మనిషిని గుర్తుకు తెచ్చే పాత్రల్లో నటించి అవార్డుల పంట పండించారు మెగాస్టార్. 1992 నాటి ఈ చిత్రంలో చిరంజీవి తన నటనాభినయంతో ప్రేక్షకలోకాన్ని విస్మయ పరచడంతో పాటు సినీ పండితుల, సినీ విమర్శకుల ప్రశంసలు చూరగొన్నాడు.

**చిత్ర కథ :**

పరంధామరాజు(రాజు గారు)(జంధ్యాల) విశ్రాంత ఉపాధ్యాయుడు. అంతేకాక రచయితగా తన కాలాన్ని కలంతో కాగితాలను నింపడంలో నిమగ్నమైన వ్యక్తి. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. మొదటి కూతురు లలిత (గీత), రెండవ కూతురు హేమ (మీనాక్షి శేషాద్రి). పెళ్ళీడు కొచ్చిన అమ్మాయిలు నడయాడుతున్న ఆ ఇల్లు దీపకాంతుల ప్రకాశంతో వెలుగులీనుతూ వుంటుంది. రాజు గారికి ఆయన కూతుళ్ళకు అన్ని విషయాల్లో అండగా వుంటూ చలాకీతనంతో అందరి మనసులను గెలిచే వ్యక్తిత్వం కలవాడు మాధవ (చిరంజీవి). అతడిది పాల వ్యాపారం. అనాథ అయిన మాధవను రాజు గారు చిన్ననాటి నుంచి చేరదీసి పెంచి పెద్ద చేస్తాడు. మాధవకు నాటకాలంటే ప్రాణం. అందులోనూ పరమశివుడి వేషం ధరించడమంటే మహా ప్రీతి. అంతేకాక మాధవను ఎవరైనా పొగిడితే చాలు ఆ సందర్భంలో ఎలాంటి మాటైనా ఇస్తాడు, ఎంతటి కష్టమైన పనైనా చేస్తాడు. చుట్టుపక్కల ఊళ్ళలో ఎక్కడ నాటకాలు జరిగినా ఆ నాటకాల్లో శివుడి పాత్ర మాధవదే. రాజు గారి బావమరిది సీతాపతి (అల్లు రామలింగయ్య). సీతాపతి కుమారుడు శ్రీపతి(శరత్ బాబు). శ్రీపతికి హేమ అంటే ప్రేమ. హేమకు శ్రీపతితో వివాహం చెయ్యాలన్నది బావాబావమరదుల అభిప్రాయం. కాని దానికిముందు హేమ అక్క లలిత వివాహం చెయ్యాల్సిన పరిస్థితి, అందుచేత లలితకు వివాహ సంబంధాలు చూస్తుంటారు.

ఒకరోజు గ్రామ పెద్దలంతా కూడి మన ఎమ్మెల్యే మన ప్రజలతో ఓట్లు వేయించుకుని తానిచ్చిన వాగ్దానాలు మాత్రం పూర్తిచెయ్యట్లే దంటూ మాధవ దగ్గర చెప్తారు. అతడికి బుద్ధి చెప్పాలంటూ ప్రాధేయ పడతారు. దానికి గాను మాధవ ఎమ్మెల్యేకు దేహశుద్ధి చేస్తాడు. దాంతో మాధవపై కక్ష్య పెంచుకున్న ఎమ్మెల్యే మాధవను చంపడానికి పథకం వేస్తాడు. నాటకంలో శివుడి వేషంలో వున్నప్పుడు రాక్షసులు దాడి చేసే సందర్భాన్ని వారి పథకాన్ని అమలుపర్చేందుకు సమయంగా నిర్ణయిస్తాడు. నాటకం జరుగుతున్న సమయంలో ప్రేక్షకురాలిగా వచ్చిన హేమ మాధవ పై జరగబోయే దాడిని గ్రహిస్తుంది. ఆమె వెంటనే స్పందించి మాధవను రక్షిస్తుంది. అదే సమయంలో ఆమెకు మాధవ పై వున్న అభిమానం ప్రేమ అని గ్రహిస్తుంది. మరోవైపు హేమ అక్క లలితకు సంబంధం నిర్ణయమవుతుంది. కాని ఆమె వివాహం చెయ్యడానికి కావాల్సిన డబ్బు కోసం ఇల్లును అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది తండ్రి పరంధామ రాజుకు. అంతేకాక ఆయనకు తన దుర్భర ఆర్థికస్థితి వల్ల తన రచనలను పబ్లిష్ చెయ్యలేక పోతున్నాననే అసంతృప్తి వెంటాడుతూ వుంటుంది. ఈ విషయం అర్థం చేసుకున్న మాధవ తన వద్ద వున్న పశువులను అమ్మి సహాయంగా నిలబడాలనుకుంటాడు. దీనికోసమై తన స్నేహితుడి (బ్రహ్మానందం) బామ్మను (నిర్మలమ్మ) సంప్రదించి ఆమె సహాయం చేస్తున్నట్లుగా అబద్ధం చెప్పించి ఆమెచేత డబ్బు రాజుగారికి అందేలా చేస్తాడు.

రాజు గారు తన పెద్ద కూతురు లలితకు వివాహం జరపడమే కాక తన పుస్తకాల ప్రచురణకు ముహూర్తం ఖరారు చేస్తాడు. అదే సమయంలో బామ్మ రాజు గారితో డబ్బు సమకూర్చింది తాను కాదు మాధవ అనే నిజం చెప్తుంది. ఆ విషయం తెలిసి రాజు గారు తన రచనా ప్రతులను మాధవకు సమర్పిస్తూ సంతృప్తిగా మాధవ చేతుల్లో పరమపదిస్తాడు. రాజుగారి రచనల ముద్రణ కోసం మాధవ నగరానికి వెళ్ళి తిరిగి వచ్చేసరికి పరంధామరాజు చిన్నకుమార్తె అయిన హేమను

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3 (42) హైదరాబాద్ జనవరి : 2023




పిచ్చాసుపత్రికి తరలిస్తుంటారు. అది చూసి మాధవ ఏం జరుగుతుందో అర్థం కాని స్థితిలో వుండగా, ఆమె బావ గారు హేమను అనుభవించాలనే మృగ కాంక్షతో ఆమెపై అత్యాచారం చేయబోయాడు అనే విషయం తెలుస్తుంది. అంతేకాక ఆ చర్యను నిలువరించే క్రమంలో భర్త చేతిలో హేమ అక్క లలిత మరణించిందనే విషయం మాధవ చెవిన పడ్తుంది. హేమ దయనీయ పరిస్థితిని మాధవను కలిచి వేస్తుంది.

మాధవ హేమను మునుపటి స్థితికి తీసుకురావాలనే ఆలోచనతో ఆమె బావపై దాడి చేసి అందరి ముందు పిచ్చివాడిలా నటించి పిచ్చాసుపత్రిలో చేరతాడు. అక్కడ మాధవ హేమను కలిసినప్పుడు ఆమె వింత ప్రవర్తనను చూసి మాధవ నిశ్చేష్టుడవుతాడు. ఆమెకు మునుపటి జ్ఞాపకాలను గుర్తు చేసే ప్రయత్నంలో అక్కడి వైద్యులచేత కఠినమైన చికిత్సలను ఎదుర్కొంటాడు. ఈ క్రమంలో హేమలో నెమ్మదిగా మానసిక పరివర్తన మొదలవుతుంది. ఈ విషయం తెలిసి ఆమె మామ సీతాపతి, బావ శ్రీపతి లు సంతోషిస్తారు. పూర్తిగా కోలుకున్న హేమకు బావ శ్రీపతితో వివాహ ముహూర్తం ఖరారు చేస్తాడు అతడి తండ్రి సీతాపతి. కాని హేమకు మాత్రం మాధవ అంటే ప్రాణం. సీతాపతి కుల, ధన జాడ్యం తెలిసిన మాధవ ఆమెకు శ్రీపతితో వివాహం జరుగుతుంది అనే విషయం తెలిసి తన మనసులో దాగి వున్న ప్రేమను తొలగించుకునే ప్రయత్నం చేస్తాడు. ముందు నుండీ మాధవ – హేమల మధ్య అనుబంధం గమనిస్తూ వస్తున్న శ్రీపతి వారి ప్రేమను అర్థం చేసుకుని, హేమను మునుపటి స్థితికి తీసుకురావడానికి మాధవ పడ్డ కష్టాలను చూసి ఆమె మాధవకు చెందడమే సబబని నిర్ణయించుకుంటాడు. ముహూర్తం సమయాన శ్రీపతి తన తండ్రిని ఎదిరించి హేమ- మాధవలను ఒక్కటి చేయడంతో కథ సుఖాంతం అవుతుంది.

**చిత్ర విశేషాలు :**

“ఆపద్బాంధవుడు” చిత్రంలో చిరంజీవి పాత్ర పూర్తిగా కె.విశ్వనాథ్ చిత్ర కథల్లోని పాత్రగా వుంటుంది తప్పితే ఏ మాత్రం చిరంజీవి మార్కు హీరోను వ్యక్తపరిచేలా వుండదు. ‘శుభలేఖ’ చిత్రంలో హోటల్ సర్వర్‌గా, ‘స్వయంకృషి’ చిత్రంలో చెప్పులు కుట్టుకుని జీవించే వ్యక్తిగా, ఇక ‘ఆపద్బాంధవుడు’ చిత్రంలో పశువుల పెంపకం చేస్తూ పాల వ్యాపారంతో జీవనాన్ని సాగించే సాధారణ మనిషిగా నటించడం అనేది ఆయనలోని నటనా తృష్ణను వ్యక్తం చేస్తుంది. చిరంజీవి నటన గూర్చి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు కానీ పిచ్చివాడిగా నటించడం చిత్రంలో ప్రధాన విశేషం. చిత్రం ద్వితీయార్థంలోని కొన్ని సన్నివేశాల్లో ఆయన అభినయం హృదయాలను తడిచేసేలా వుంటుంది. చిత్రంలో కథానాయికగా చేసిన మీనాక్షి శేషాద్రి హేమ పాత్రలో పెళ్ళీడుకొచ్చిన యువతి పాత్రలో నటించింది. హేమ పాత్ర మాధవను లోలోపల ప్రేమిస్తూనే తన ప్రేమను వ్యక్తం చేయకుండా గుమ్మనంగా వుండే స్వభావాన్ని కలిగి వుంటుంది. ఇక మరో కోణంలో చూసినప్పుడు తన జీవితంలో ఎదుర్కొన్న ఒక సంఘటన వల్ల మతిస్థిమితం కోల్పోయిన పిచ్చమ్మాయి పాత్రలో ప్రేక్షకుల హృదయాలను కదిలించేలా నటించింది. ‘శారద’, ‘జీవన జ్యోతి’ లాంటి చిత్రాల్లో కూడా కథానాయిక పాత్రలు మతిస్థిమితం కోల్పోయిన పాత్రలుగా వుంటాయి. కె.విశ్వనాథ్ చిత్రాల్లో ప్రధాన పాత్రల్లో నటించే వారికి ప్రధానమైన సవాలు మరియు లాభం ఏమిటంటే? ఒకే చిత్రంలో రెండు, మూడు కోణాల్లో పాత్రాభినయం చేసే అవకాశం రావడం. కథానుగుణంగా పాత్ర తీరులో పూర్తి మార్పుతో నటించడం అనేది నటులకు పరీక్ష, దాంతోపాటు అలాంటి పాత్రల్లో నటించడం నటులకు సంతృప్తిని కూడా ఇస్తుంది.

నాటక, కథా, సంభాషణా రచయితగా, దర్శకుడిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో చెరిగిపోని స్థానాన్ని సంపాదించిన “జంధ్యాల” ఈ చిత్రంలో పరంధామరాజు పాత్రలో నటించారు. ఆయన నటించిన ఏకైక చిత్రం ఇది. ఈ పాత్రలో విశ్రాంత ఉపాధ్యాయుడి మనస్థితిని, దానితో పాటు పెళ్ళీడు కొచ్చిన కూతుళ్ళ వివాహ బాధ్యతను ఎలా పూర్తి చేయాలి? అని మధనం చెందే ఒక దిగువ, మధ్యతరగతి తండ్రిని గుర్తు చేసే పాత్రలో నటించారు. మనకుండే అభిరుచుల మేరకు సహజంగా ప్రతి మనిషిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ వుంటుంది. ఆర్థిక, సామాజిక పరిస్థితులు మనలోని ఆ ప్రతిభను బహిష్కృతం చెయ్యలేని పరిస్థితిని కల్పిస్తాయి. పరిస్థితులకు తలొగ్గి ప్రతిభను చంపుకోలేని వ్యక్తులు అనుభవించే సంఘర్షణ మాటల్లో వర్ణించలేనిది. ఇలాంటి సంఘర్షణను అనుభవించే మనస్థితి పరంధామ రాజు పాత్రలో కన్పిస్తుంది. కారణం రచయితగా తాను చేసిన రచనలను పబ్లిష్ చేసే ఆర్థిక వెసులుబాటు లేక తన రచనలు ఎక్కడ సమాజానికి తెలియకుండా పోతాయో అనే బాధ.

సీతాపతి పాత్ర(అల్లు రామలింగయ్య) సామాజిక అసమానతలను సాంప్రదాయిక వారసత్వంగా భావించి కొనసాగించే ఛాందస స్వభావాన్ని ప్రదర్శిస్తుంది. మాధవ పాత్రపై చిన్ననాడు సీతాపతి పాత్ర వ్యక్తం చేసిన అహంకార పూరితమైన విద్వేషం మాధవ పాత్రను ఎంతలా వెంటాడుతుందనే విషయానికి నిదర్శనంగా- చిత్రం పతాక

సన్నివేశంలో శ్రీపతి హేమను వివాహం చేసుకొమ్మంటూ చేసే ప్రతిపాదనను మాధవ తిరస్కరించడంలో కన్పిస్తుంది. ఎమ్మెల్యే పాత్రలో ఇటీవలే కీర్తిశేషులైన కైకాల సత్యనారాయణ నటించారు. ఈ పాత్ర ప్రజలకు ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి తీరా గెలిచాక చేతులెత్తేసే నాటి, నేటి రాజకీయాలను గుర్తు చేస్తుంది. శ్రీపతి పాత్రలో హేమకు బావగా శరత్ బాబు నటించారు. శ్రీపతి పాత్రను తీర్చిదిద్దిన తీరు పరిపూర్ణమైన వ్యక్తిత్వం కల్గిన యువకుడికి చిహ్నంగా వుంటుంది. స్వంత అక్క అయిన లలిత భర్త హేమపై జరిపిన దుశ్చర్య హేమ జీవితాన్ని తలక్రిందులు చేస్తుంది. ఈ ఘటన కొన్ని సంఘటనలు జీవితాల్ని ఎంతలా ప్రభావితం చేస్తాయి అనడానికి నిదర్శనంగా నిలుస్తుంది (ముఖ్యంగా స్త్రీల జీవితాలను). తండ్రిని కోల్పోయి, అక్కకు వివాహం జరిగాక ఒంటరైన హేమ, అక్క భర్త వల్ల మతిస్థిమితం కోల్పోయి దయనీయ కాలాన్ని వెళ్ళదీస్తున్నప్పుడు మాధవ ఆపద్బాంధవుడుగా నిలవడం చిత్ర నామధేయానికి సార్థకతను చేకూర్చింది.

కె.విశ్వనాథ్ చిత్రాలకు ప్రధాన బలం సంగీతం, సాహిత్యం, నృత్యం అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సిరివెన్నెల శివుడి పై రాసిన 'అతల వితల పాతాల' అంటూ సాగే పాటలో చిరంజీవి పరమ శివుడి వేషంలో కన్పిస్తారు. చిత్రంలో మాధవ పాత్ర నాటకాల్లో శివుడి వేషానికి తనతో ఎవరూ సరిజోడి కారని గర్వపడుతూ వుంటుంది. అంతేకాక మాధవ పాత్ర చిత్రం మొత్తం కూడా శివుడి ప్రధాన లక్షణాల్లో ఒకటైన బోళాతనాన్ని ప్రదర్శిస్తూ వుంటుంది. దీనిలో విశేష విషయమేమిటంటే దర్శకుడు మాధవ పాత్రకు శివుడి వ్యక్తిత్వంలోని ప్రధాన లక్షణాన్ని ఆపాదించడం ద్వారా తిక్కన హరిహరనాథతత్వాన్ని పరోక్షంగా ప్రస్తావించారనిపిస్తుంది. సిరివెన్నెల కలం నుండి జాలువారిన మరో రెండు పాటలు **'చుక్కల్లారా చూపుల్లారా ఎక్కడమ్మా జాబిలి', 'ఔరా అమ్మకుచెల్ల- ఆలకించి నమ్మడమెల్ల'** లాంటి పాటలు నాడు, నేడు కలకాలం మనల్ని వీడిపోని సుమధుర సుస్వర రాగకేళీలు అనడంలో సందేహం లేదు. ఈ చిత్రానికి సంగీతం ఎం.ఎం.కీరవాణి అందించారు.

శుభలేఖ చిత్రంలో వరకట్నం, స్వయంకృషి చిత్రంలో మూలాలను మరవని జీవన విధానాన్ని గురించి సూటిగా ప్రేక్షకుడికి చేరవేశారు దర్శకుడు. కాని ఈ చిత్రంలో మాధవ పాత్ర హేమకు బాసటగా నిలవడంలో ప్రేమ, మానవత్వం, కృతజ్ఞతా భావం లాంటి అంశాల్లో ఏ అనుబంధంతో సహాయం చేస్తున్నాడు అనే విషయంలో చిత్రం చూసే ప్రేక్షకుడికి కొంత గందరగోళం ఏర్పడ్తుంది. ఏదేమైనా రాజభక్తి, కృతజ్ఞతా భావం, ఏ రక్తసంబంధం లేకపోయినా దానికి మించిన అనుబంధాలు, ఆప్యాయతలు మనుషుల మధ్య కొలువుతీరగలవన్న కోణాన్ని "ఆపద్బాంధవుడు" చిత్ర కథ ద్వారా బలంగా నొక్కి చెప్పారు కె.విశ్వనాథ్.




**చలన చిత్రం** : **ఆపద్బాంధవుడు**

**తారాగణం** : **చిరంజీవి, మీనాక్షి శేషాద్రి, జంధ్యాల, శరత్ బాబు, అల్లు రామలింగయ్య, గీత, కైకాల సత్యనారాయణ, బ్రహ్మానందం, నిర్మల తదితరులు**

**నిర్మాణ సంస్థ** : **పూర్ణోదయా మూవీ క్రియేషన్స్**

**సంగీతం** : **ఎం.ఎం.కీరవాణి**

**సాహిత్యం** : **సిరివెన్నెల, సినారె, భువన చంద్ర**

**నిర్మాత** : **ఏడిద నాగేశ్వరరావు**

**కథ,దర్శకత్వం** : **కె.విశ్వనాథ్**



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2023

# ప్రకృతి వికాస సంకేతమే 'పద్మం'



**"పద్మ ప్రియే పద్మిని పద్మ హస్తే పద్మాలయే పద్మ దళాయతాక్షి**
**విష్ణు ప్రియే విష్ణు మనోనుకూలే త్వత్పాద పద్మం మయి సన్నిధత్స్వ"**

అమ్మవారి స్వరూపాలను పద్మంపై కూర్చున్నట్లుగా, పద్మం చేతిలో ధరించినట్లుగా చూపించే సంస్కృతి భారతీయం. ఈ పద్మం ఏమిటి? ఎందుకు దానిని చూపించాల్సిన అవసరం ఉంటుంది? భారతీయ మైన ఈ దైవ ప్రతీకలు మనకు ఏం సందేశాన్ని ఇస్తున్నాయో మనం గమనించాల్సి ఉంటుంది.

పద్మం, కమలం, తామర అని పేరు కలిగిన ఈ పుష్పం జలంలో ముఖ్యంగా బురద నీటిలో ఉంటుంది. జలజము, పంకజము వంటి ఎన్నో పేర్లు ఈ పుష్పానికి ఉన్నాయి. ఈ పద్మం సూర్యుని వెలుతురు పడగానే వికసించి, సూర్యుడు వెళ్ళగానే ముడుచుకుని పోతుంది. మళ్ళీ సూర్యోదయం కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. ఈ సృష్టిలో కూడా అనంతమైన శక్తి ఉంది. ఈ శక్తిని కేంద్రీకరించబడిన చోట ప్రకృతి వికసిస్తుంది. ఈ వికాసానికి సంకేతంగానే విష్ణువు యొక్క నాభి కమలంలో బ్రహ్మ పుట్టినట్లుగా సూచన చేసే సంప్రదాయం భారతీయం. బ్రహ్మ అంటే కాలం, బ్రహ్మ అంటే ప్రకృతి. బ్రహ్మం అనగా విస్తరించినది, వ్యాపించినది అని అర్థం. వికసించినదే వ్యాపించగలుగుతుంది. వికసించిన చోటే జీవావిర్భావం ఉంటుంది. సృష్టి ఏర్పడుతుంది. వికసించని చోట శక్తి అంతా బీజభూతమై ఉంటుంది. అందుకే సృష్టి వికాసానికి సంకేతంగా మనవాళ్ళు పద్మాన్ని సూచించారు. వెలుగుకు, జ్ఞానానికి సంకేతమైన సరస్వతీదేవి; ఐశ్వర్యాలు, సంపదలు, ప్రకృతికి నెలవైన లక్ష్మీదేవి; సృష్టికి కారకమైన బ్రహ్మాది దేవతలంతా పద్మంలో కూర్చున్న సంకేతాలు ఉన్నాయంటే ఈ దైవాలన్నీ మనకు వికాసాన్ని నేర్పిస్తున్నాయనే అర్థం. అందుకే పద్మం వికాసానికి సంకేతం అవుతుంది. పద్మం ముడుచుకున్నప్పుడు చుట్టూ ఏ బురద మరకలు అంటినా, వికసిస్తున్నప్పుడు తనను తాను శుద్ధి చేసుకుంటుంది. పవిత్రంగా కనిపిస్తుంది. స్వచ్ఛతకు ప్రతీక అవుతుంది.

సరస్వతీ దేవిని కూడా "నిత్యం పద్మాలయాం దేవీం ... సామాం పాతు సరస్వతీ" అని ప్రార్థిస్తాం. సూర్యుని వెలుగులకు, వెలుగు ద్వారా వచ్చే శక్తికి, దాని ద్వారా కలిగే జ్ఞానానికి, జ్ఞానం ద్వారా కలిగే మానసిక భౌతిక వికాసానికి సంకేతం సరస్వతీ దేవి. అందుకే ఆమెకు శ్వేత వస్త్ర ధారణ చేసి సంతోషిస్తాం. అదేవిధంగా సూర్య కిరణాల వల్ల కలిగే ప్రకృతి మార్పులు, ఐశ్వర్యాలకు సంకేతం లక్ష్మీదేవి. ఆరోగ్యం, సంతోషం, సంతృప్తి, సహజంగా భూమిలో లభించే అనేక రకాల ఐశ్వరాలు, సంపదలు అన్నింటికీ లక్ష్మీదేవి సంకేతం. ఇవన్నీ ప్రకృతి వికసిస్తేనే సాధ్యం. అందుకే లక్ష్మీదేవిని కూడా పద్మాసనగా చూపించడం, పద్మాలను చేతిలో ధరించినట్లుగా చూపించడం ఉంటుంది. బ్రహ్మ కూడా సృష్టికి సంకేతం కదా! ప్రకృతికి, కాలానికి సంకేతమైన బ్రహ్మ అసలు విస్తరణకు, వికాసానికి మూల స్వరూపమే కదా!

అందుకే శక్తి, జ్ఞాన వికాసాన్ని సూచించే కుండలినీ శక్తి వికాస క్రమంలోనూ వేరు వేరు చక్రాలలో వేరు వేరు పద్మాలు, కొన్ని దళాలతో కూడి ఉన్నా, సహస్రార చక్రంలో మాత్రం పూర్ణమైన సహస్రదళ పద్మం వికసించినట్లుగా సూచించడం భారతీయ సంప్రదాయం. ఇదంతా భావనా మాత్రమే కదా! మనకు ప్రకృతిలో కనిపించే ఒక పద్మం, సూర్యుడు రాగానే వికసించే లక్షణం ఉన్న ఒక పుష్పం ఎన్ని నిగూఢార్థాలను తెలుపుతుందో కదా! భారతీయమైన అధ్యయనం ఇది. అన్నీ సంకేతాలు, ప్రతీకలే. మూలార్థం వేరు, వాచ్యార్థం వేరు. అందుకే భారతీయ సాహిత్యాన్ని అధ్యయనం చేసే విధానమే మార్చాలి.

బురదలో ఉంటూ మురికిని అంటించుకోని పద్మం, లోకంలో ఉంటూ ప్రాపంచిక అంశాలకు దూరంగా ఉండడానికి ప్రతీక అవుతుంది. నీటిలో ఉంటూనే నీటి చుక్క తన మీద పడినా, దానిని అంటించుకోని పద్మపత్రం మన జీవనవిధానం ఎలా ఉండాలో సూచిస్తున్నది. (పద్మపత్ర మివాంభసా) ఈ విధంగా పద్మం వికసించిన ప్రకృతికి, జ్ఞానానికి, శక్తికి, ఐశ్వర్యానికి, జీవన విధానానికి, ఆదర్శాలకు సంకేతంగా కనిపిస్తుంది. ఈ లక్షణాలన్నీ మనకు అలవడాలంటే ఆ పద్మాసన, పద్మహస్త, పద్మప్రియ, పద్మాలయ, పద్మినుల పాదపద్మాలను ఆశ్రయించక తప్పదు.



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3 45 UGC Care List Approved Journal
హైదరాబాద్ జనవరి : 2023

# జానపద కళావాద్యాలలో డప్పు ప్రాచీనత – ప్రయోజనాలు

**సునీత నీటూరి,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఫోన్ : 770 280 2023

భారతదేశంలో జానపద వాద్యాలు అనగానే ముఖ్యంగా గుర్తుకు వచ్చేవి గ్రామీణులు తమ తమ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలలో భాగంగా పుట్టుక దగ్గరి నుంచి చనిపోయేవరకు పండగలు, పబ్బాలు, సాంస్కృతిక కార్యక్రమాలలో వాడే విభిన్నమైన పరికరాలు గుర్తుకువస్తాయి. వీటిని ముఖ్యంగా 4 రకాలుగా వర్గీకరించవచ్చు.

**1. తంత్రీ వాద్యాలు :** తంత్రులు లేదా తీగ (String) లతో వాయించేవి (ఉదా: వీణ, తంబూరా, సంతూర్, వయోలీన్, సరోద్, సితార, సారంగి, కడ్డీ వాయిద్యం మొదలైనవి)

**2. సుషిర వాద్యాలు :** గాలితో (Wind) పనిచేసే వాద్యాలు లేదా గాలిని ఊది వాయించేవి (ఉదా: వేణువు, సన్నాయి, కొమ్ము, నాదస్వరం, షహనాయ్, శంఖువు, నరశింగ్ మొదలైనవి)

**3. అవనద్ధ వాద్యాలు :** చర్మాన్ని ఉపయోగించి వాటిని కొట్టి వాయించేవి (ఉదా: మృదంగం, డోలు, డమరుకం, మద్దెల, తబలా, తప్పెట, దుందుభి, నగారా, డోలక్, పంచముఖ వాద్యం మొదలైనవి)

**4. ఘన వాద్యాలు :** ఘనం అనగా గట్టిగా ఉండేవి. ఇవి తాళాన్ని అనుసరించు వాద్యాలు (ఉదా: తాళాలు, గంటలు, గజ్జెలు, ఘటం, చురుతలు, మోర్సింగ్, మంజిర మొదలైనవి).

డప్పు అనవద్ధ వాద్య విభాగంలో చేరుతుంది.

**చర్మ వాద్య పరికరాలు**

చర్మ వాద్య పరికరం అనగానే అందరికీ గుర్తుకు వచ్చే పరికరం డోలు, మృదంగం, మద్దెల, తబలా. అయితే వీటితోపాటు డమరుకం, తప్పెట, దుందుభి, నగారా, డోలక్, పంచముఖ మొదలైనవి కూడా చర్మంతో తయారయ్యే ఇతర వాద్య పరికరాలు. వీటిని భారతదేశంలో అన్ని ప్రాంతాలవారు, అన్ని వర్గాలవారు, అన్ని కులాల వారు వివిధ సందర్భాలలో వాడతారు. ఈ పరికరాలు ఏవిధంగా తయారు చేస్తారో ఈ వ్యాసంలో పేర్కొంటున్నాను.

**డప్పు ప్రాచీనత**

ప్రాచీన మానవుడు సృష్టిలోని కొన్ని అమూల్యమైన పదార్థాల్ని కుళ్ళిపోకుండా, కనుమరుగు కాకుండా వాటికొక రూపమెచ్చి ప్రతి సృష్టి చేశాడు. తన మేధస్సుకి పదును పెట్టాడు. దాని రూపమే డప్పు. ఇది మనిషి తొలిసారిగా తయారుచేసిన తోలు వాద్యం. అందుకనే నేటికీ అది మొట్టమొదటి వాద్య వస్తువుగా పరిగణించ బడుతోంది. అందుకే మానులు తలపెట్టే ప్రతి పనిలోనూ డప్పు ముందుంటుంది. ఆదివాసుల వారసులమని చెప్పుకొనే నేటి



మానవజాతికి ఈ డప్పు వారసత్వ సంపద. పుట్టుక, చావు, పండుగ, జాతర, చాటింపు మొదలైన ఏ కార్యక్రమం జరగాలన్నా డప్పు వాయిస్తేనే ఆ కార్యం విజయవంతం అవుతుంది. అదే ఈ డప్పుకున్న ప్రత్యేకత.

ఈనాటి సమకాలీన సమాజంలో ఎవరైతే డప్పుకి సంబంధించిన పనులు చేస్తున్నారో వారే (మాదిగలు) అసలైన ఆదిమమానవుని వారసులు అని అనుకుంటున్నారు. అది వాస్తవం కూడ. కాని, డప్పు తయారుచేసిన నాటికీ ప్రస్తుతం ఉన్న కులాలు అప్పటికింకా రూపొందలేదు. డప్పుని కనుక్కోవటం దానికి సంబంధించిన వివిధ కుటుంబాలు ఏర్పడటం అన్నది తరువాత జరిగిన పరిణామం. గోజాతి అందరికీ కావాల్సిన జంతువు. అలాగే అది మరణించాక కూడ దాని తోలుతో చేయబడిన వస్తువులు సమాజాభివృద్ధిలో ప్రధాన భూమికను పోషిస్తున్నాయి. గోవు చనిపోయినా, బ్రతికున్నా సమాజంలో అది ఒకటే విలువను కలిగి ఉంది. అంటే సమాజం దాన్ని మలచుకునే విధానాన్ని బట్టి ఉపయోగ పడుతూ వచ్చింది.

మాదిగవారు పశువుల రకాలనుబట్టి, వాటి తోలు, నాణ్యత, గట్టిదనం, మెతక విధానాన్ని బట్టి వివిధరకాల తోలు పనిముట్లు తయారు చేస్తారు. సమాజంలోని అన్ని కులాల, కులవృత్తుల, రైతుల అవసరాన్ని తీర్చుకోవటానికి, సాంస్కృతిక వికాసానికి మొక్కవోని దీక్ష, దక్షతలతో చర్మ వస్తువుల్ని కనిపెట్టిన మాదిగ ప్రాచీన భారతీయ శాస్త్రజ్ఞుడిగా చరిత్ర పుటల్లో నిలిచాడు.



**డప్పు తయారి :**

ఆదిమానవుడి చేత మొట్టమొదట వ్యూహాత్మకంగా కనుగొనబడింది డప్పు. డప్పు తయారీలో కనబరిచే మెలకువలు అసాధ్యమైనవి. వర్ణనకి అందనటువంటివి. డప్పు తయారుచేయాలనే ఆలోచన ఒక్కరోజులో వచ్చింది కాదు. అసలు డప్పుని తయారు చేయాలనే ఆలోచన ఆదిమానవుడి మదిలో ఎందుకు వచ్చింది? అందుకోసం అతడు తీసుకున్న వస్తు సహాయం ఏమిటి? డప్పుకుండే ధ్వని తీవ్రత ఆనాడే ప్రాచీన మానవుడు గ్రహించాడా? ఏ సంకేతం కోసం డప్పు కనుక్కొనబడింది? ఆ సంకేతం విజయవంతమైందా? అనేవి మన ముందున్న ప్రశ్నలు, డప్పు పరిచయంతో మానవాళికి ఎంతో లాభం చేకూరింది. దానికి విలువ కట్టలేం. డప్పు శబ్దం మనుషులకి మానసికానందాన్ని కల్గిస్తుంది. అలాగే జంతువులకి భయాన్ని కల్గిస్తుంది. మనస్సులో ఉత్సాహాన్ని ప్రేరేపిస్తుంది. ప్రాచీన మాదిగ చేత డప్పు కనిపెట్టడం భారతదేశ చరిత్రలోనే గొప్ప విప్లవాత్మక మార్పు. పశువుల చర్మాన్ని నక్కలు, ఇతర క్రూరమృగాలు, కుక్కలు తినటానికి ప్రయత్నించి, అటుఇటు గుంజుకుంటూ తీసుకువెళ్ళి బూడిదమయమైన చర్మాన్ని అవి వదిలేసి ఉంటాయి. గాలి, ఎండ చేత అది ఆరిపోయి, ఎండి గట్టిపడి వుంటుంది. ప్రాచీన మానవుని కంటపడిన ఈ తోలుని పట్టుకుని మడతలు సరిచేస్తుండగా టపటపమని శబ్దం వచ్చి వుంటుంది. ఆ తరువాత తోలుని పరిచి దానిని కొట్టగా కణకణమని శబ్దం వచ్చి వుంటుంది. తరువాతి కాలంలో లేగదూడలు మరణించినపుడు వాటి తోలుని డప్పుగా చేశాడు. దాని నుండి వచ్చే ధ్వని చాలా తీవ్రతని కల్గి వుంటుంది. ఆనాటినుండి చనిపోయిన దూడల తోలుతో డప్పు తయారు చేయబడుతూ వస్తోందని మనం తెలుసుకోవచ్చు.

ప్రాచీన మానవుడు సంచార జీవితాన్ని వదిలి గృహజీవితం అలవాటుచేసుకున్నాడు. కాలక్రమంలో వారి సంతానం స్వతంత్ర కుటుంబాలుగా ఏర్పడటం, ఒక్కొక్క పనిలో ఒక్కొక్కరు నిమగ్నమైనట్లు తెలుస్తుంది. అది పని సౌలభ్యత కోసమే కానీ మరొక దానికోసం కాదు. ఆహార సంపాదన కోసం ఉమ్మడిగా పనిచేశారు. వ్యవసాయాన్ని, దాని విస్తరణ కోసం పరస్పర సహకారంతో కృషిచేశారు. ఉదాహరణకి: పశువులకి గుంజపలుపులు, మెడపలువులు, కాడి పలుపులు, ఏటతాళ్ళు, కొమ్ములపగ్గాలు, పీరతాళ్ళు అలాగే నాగలి, కాడి, యేడికర్ర, మేడి, మేడికర్ర మొదలగునవి.

ఇక్కడ రెండు పనులు ప్రధానంగా మనకి కనిపిస్తున్నాయి. అవి చనిపోయిన పశువు తోలుని ఎండిన తోలుగా ఒకరు మార్చగా, పచ్చి కట్టెని ఎండినాక కుదురుగా మలచారు. కుదురుకి మరొకరు తోలుని అమర్చారు. వారి వారసులుగా మాదిగ, మాస్టిని లేదా వడ్రంగి వారి వారసులుగా నేడు మనం గుర్తించగలం. వీరందరి కృషి ఫలితంగా రూపొందినదే డప్పు.

పశువులు రెండురకాలు ఒకటి ఆవు (గోవు) జాతి, రెండు గేదె జాతి (ఎనుము/బర్రె). ఈ జాతి పశువులు ప్రకృతి ప్రసాదం వల్ల వాటి చర్మ ధారుధ్యంలో భిన్నతని కలిగి ఉన్నాయి.

1980కి ముందురోజుల్లో పశువైద్యసౌకర్యం లేకపోవటంతో పశువులు, వాటి దూడలు రోగాల చేత మరణించేవి. దూడలు చిన్నతనంలో మరణించినప్పుడు, మాదిగలు మాత్రమే వాటిని గ్రామం బయటకి మోసుకొచ్చేవారు. వాటి శరీరంనుండి తోలుని వలిచేవారు. వీటి తోళ్లని ఎక్కువగా చర్మ వాద్యాలుగా తయారుచేసేవారు. వీటితో పాటు మేక, గొర్రె జాతుల పచ్చితోళ్లను కూడా చెట్ల రసాయనాలు కలిపి పూసి, ఎండబెట్టి చర్మవాద్యాలు తయారుచేశారు.

భారతీయ సమాజంలో ప్రతి ఒక్కరికీ వారికి సంబంధించిన వివిధ కార్యక్రమాల్ని జరుపుకోటానికి ముందుగా వారికి డప్పులు అవసరమవుతూ వచ్చాయి. నేడు సమాజంలో కనిపిస్తున్న వివిధ రకాల నూతన చర్మ సంబంధ వాద్యాలకి తొలిరూపం ఈ డప్పు. ఒక్కమాటలో చెప్పాలంటే డప్పు విస్తృతిని, దాని దరువులకి కొలమానం చేయటం కష్టం. డప్పు తయారీలో వున్న శాస్త్రీయ పరిజ్ఞానం ఎంతో ప్రాచీనమైంది. ఆధునిక శాస్త్రీయ విజ్ఞానానికి ఇది ఆధారభూతమైంది. దాని తయారీదారులు (చర్మకారుల) లోతైన ఆలోచనా పరిజ్ఞానం అంచనా వేయలేం. డప్పుకున్న గట్టితనం, శబ్దమాధుర్యం, ధ్వని తీవ్రత ప్రజల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. అందుకే డప్పు నాటికీ ఏనాటికైనా ప్రాధాన్యతని కలిగి అన్నింటా ముందే ఉంటుంది.

భారతదేశ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాచీన కాలం నుంచి ఉపయోగిస్తున్న తోలు వాద్యం డప్పు, డప్పుని ఎక్కువగా ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకి చేరవేయటానికి, జాతరలకి, పండుగలకి, పెళ్ళిళ్ళకి, చావులకి ఉపయోగిస్తున్నారు. అందువల్లనే ఇది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ గ్రామీణప్రాంతాల్లోని ముఖ్యమైన వాద్యం. ఈ డప్పుని ముఖ్యంగా మాదిగ (చర్మకారుడు) వారు గోజాతి దూడలతోలు (చర్మం)తో తయారుచేసి, తిరిగి వారే వాయించటం

జరుగుతుంది. మాష్టినీ (మాదిగ మీద ఆధారపడిన ఆశ్రిత జాతి) లేదా వడ్రంగి (ఒక శూద్రకులం), మాదిగలు కలిస్తేనే ఈ డప్పుని తయారుచేయగలరు. వడ్రంగి లేదా మాష్టినీ వారు డప్పుకి గుండ్రటి రింగు (చెక్క కుదురు), డప్పు చిర్ర, చిటికెన పుల్లని తయారుచేస్తారు. మాదిగ ఆ గుండ్రటి చెప్పుకుదురుకి తోలుని చుట్టి కుడతాడు. డప్పులో అదే కీలకమైన పని.

**డప్పు ప్రయోజనం**

ప్రాచీన మానవుడు మొట్టమొదట డప్పుని ఎందుకు తయారు చేసుకున్నాడు అనే ప్రశ్నకి తనను తాను ఇతర జంతువుల నుండి రక్షించుకోవటానికని అర్థమవుతుంది. ఉదా. దాహం వేసినపుడు ఏటి వద్దకు వెళ్ళేవాడు. అప్పుడు డప్పుతో శబ్దం చేసేవాడు. అడవిలో ఆహార సంపాదన కోసం వెళ్ళినప్పుడు వారందరూ ఒక దగ్గరగా చేరుకోటానికి డప్పు వాడేవారు. ఆ తర్వాత జంతువుల్ని, పక్షుల్ని తరమటానికి, జంతువుల్ని వేటాడటానికి, ప్రకృతి చేస్తున్న శబ్దాల్ని డప్పు ఆధారంగా అనుకరణ చేశాడు. తరువాతి కాలంలో భయం చాటున మతం మనిషిచేత రూపొందించబడింది. కంటికి కనిపించని దుష్టశక్తుల్ని పారద్రోలటానికి ఈ డప్పు శబ్దాన్ని చేసేవారు. వారికి సంతోషం కలిగినపుడు డప్పు శబ్దంతో చిందులేస్తూ ఉండేవారు.

రాయి తోడ్పాటుతో తోలు ఒక రూపాన్ని పొందింది. అదేవిధంగా కట్టె తోడ్పాటుతో రూపొందిందే కుదురు తర్వాత డప్పు రూపాన్ని సంతరించుకుంది. డప్పు తయారీలో ప్రధాన భూమికని కల్గిన రాయిని, అదే డప్పుతో పూజించటం మొదలుపెట్టారు.

**క్రూరమృగాల నుండి కాపాడిన డప్పు :** మొదట భౌతిక అవసరాల దృష్ట్యా క్రూరమృగాల నుండి కాపాడుకోవటానికే రూపొందిన డప్పు మనిషి మానసిక, అధ్యాత్మిక అవసరాలను తీర్చుకోవటానికి దోహదకారిగా తయారయింది. అంతేకాకుండా వారి సంతోషాన్ని వ్యక్తపర్చుకోవటానికి ఒక వేదిక అవసరమైంది. అదే జాతర, తిరునాళ్ళు, ఉత్సవం, పండుగల దగ్గరకి ప్రజల్ని రప్పించటానికి డప్పు బహుముఖంగా ఉపయోగపడింది.

**డప్పు – దరువులు**

డప్పుపై దరువు వేస్తుంటే చిన్న పిల్లాడి నుండి పండుముదుసలి వరకు దరువుకి తగ్గట్టుగా శరీరాన్ని కదిలిస్తారు. దీనినే చిందు వేయటం అంటారు. పండుగలకి మరియు పెళ్ళిళ్ళకి మోగే దరువులు విని ఇంట్లో వున్న ప్రతి ఒక్కరు బయటకు వచ్చి ఆ దరువుల్ని చూచి తీరుతారు. అవి : జాతర దరువు, గ్రామ చాటింపు దరువు, పూనకం దరువు, పెళ్ళిదరువు, పీర్ల దరువు, వీరుల దరువు, చావు దరువు వంటి సుమారు 20 రకాల దరువులు వేస్తారు. డప్పు ఈనాటి అనేక రకాల వాద్యానికి మూలం.

డప్పు దరువుకి పరిమితులు లేవు. దరువు ఉత్సాహాన్నిస్తుంది. ఆ ఉత్సాహంతో కొందరు దరువుని అనుకరిస్తూ చిందులేస్తారు.



ఇదంతా అక్కడ ఆ సమయంలో జరిగే తతంగం. దీనికంతటికి కారణం దరువులో నుండి బయటకి వినిపిస్తున్న మధురమైన శబ్దాలు. డప్పు శబ్దం సుమారు పది కిలోమీటర్ల దూరాన్నున్న ప్రజలకి కూడా వినిపిస్తుంది. ముఖ్యంగా ఉదయం, రాత్రిపూట దరువు శబ్దం ఎక్కువ దూరం వినిపిస్తుంది. దరువుకి గల మరో లక్షణమేమంటే మనిషి నరాల్లో ఉత్తేజాన్ని నింపుతుంది. మనస్సుల్ని పులకరింపజేస్తుంది. దరువులు వింటున్న వారికి తెలియకుండానే వారి మనస్సు దరువుని అనుకరిస్తూ చిందులు వేయిస్తుంది. డప్పు దరువులు ఆయా సందర్భాన్నిబట్టి వాయిస్తూవుంటారు. అవి... జాతర దరువు. ఊరేగింపు దరువు, పెళ్లి దరువు, చిందు దరువు, ఉసిగొల్పే దరువు, పూనకం దరువు, సంతోషపు దరువు, పీర్ల దరువు, సినిమాప్రచారం దరువు, కులం దరువులు, ఉగ్రం దరువు, జంతు నడకల దరువు, గజ్జల దరువు, చావు దరువు మొదలైనవి.

**ఊరు డప్పు :** ప్రాచీన కాలం నుండి ఆయాగ్రామాల్లో, పట్టణాల్లో జరిగే వివిధ శుభ, అశుభకార్యాలకి డప్పుని వాడుతూ వున్నారు.

ఉదా : ఇల్లిల్లు తిరిగే డప్పు, భారతీయ సంస్కృతి, సంప్రదాయం ప్రకారం, ప్రతి కులానికి 'దేవర' వుంటుంది. ఆ దేవర మొక్కుని తీర్చుకునే కుటుంబాలు డప్పులు లేకుండా జాతర చేయరు. అందుకనే డప్పుని మనం ఇల్లిల్లు తిరిగే డప్పుగా పిలుచుకుంటున్నాం. ఈ జాతరలో జంతుబలికి దున్నపోతు, మేకపోతు, పొట్టేళ్లని బలిచ్చేటప్పుడు ఊరేగింపు డప్పు దరువులతో జరుగుతుంది.

**గ్రామచావడి డప్పు :** గ్రామాల్లో దేవర జాతరలు, వనభోజనాలు, గ్రామసభలు జరపటానికి డప్పుతో చాటింపు వేయిస్తారు. అప్పుడు గ్రామాల్లోని ప్రజలు రావడి వద్ద చేరి తర్వాత జరగాల్సిన కార్యక్రమాల్ని నిర్వహిస్తారు.

**తోరణపాకు డప్పు :** పెళ్లికి ముందు ఉదయం పూట ఇంటికి మామిడాకులతో తోరణం కడతారు. ఈ సందర్భంగా ఒక పక్క డప్పులు వాయిస్తుంటే ఆ సందడిని అనుసరించి కులపెద్దలు మామిడాకులతో తోరణం కట్టి ఇంటిని అలంకరిస్తారు. శుభకార్యాల



సందర్భంలో డప్పు వాద్యాలు వాడకం ప్రాచీనకాలం నుండి నేటికీ కొనసాగుతూనే ఉంది.

**నలుగు డప్పు :** పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెల్ని పెళ్లికి వారం ముందు నుండి తల్లిదండ్రులు నలుగు పెడతారు. తర్వాత వారి వారి రక్తసంబంధీకులు కూడా వారికి నలుగులు పెడుతుంటారు. ఇలా నలుగులు పెట్టిన ప్రతిసారి డప్పు వాయిద్యాల సందడిలో నలుగు కార్యక్రమం జరుగుతుంది.

**పెళ్లి ఊరేగింపు డప్పు :** పెళ్ళయిన తర్వాత పెళ్ళికూతురు అత్తగారి ఇంటికి వస్తుంది. ఆ తర్వాత పెళ్ళి కుమారుడు, పెళ్ళికుమార్తె డప్పు వాయిద్యాలతో ఎడ్లబండిపై ఆ ఊరంతా ఊరేగిస్తారు. గ్రామకూడలి లో పెళ్ళిబండిని నిలిపి అనేక రకాల దరువులతో డప్పులు కొడుతూ ఉంటే పెళ్ళి బంధువులు చిందులు, డాన్సులు వేస్తారు. ఈ ఊరేగింపు ద్వారా పెళ్ళికూతురు ఫలానా వ్యక్తి భార్యగా ఊరందరికి తెలుస్తుంది.

**సాగనంపు డప్పు :** పెళ్ళయిన వధూవరులిద్దరిని తల్లిగారి ఇంటి నుంచి అత్తగారి ఇంటికి పంపేటప్పుడు డప్పు వాద్యాలతో ఊరు పొలిమేర వరకు తీసుకెళ్ళి సాగనంపుతారు.

**వస్తు అమ్మకానికి డప్పు :** వ్యాపారస్తులు వస్తువులు అమ్మటానికి ఆయా గ్రామాధికారి అనుమతితో ఆ గ్రామ పెద్దమాదిగని పిలిచి డప్పుకొట్టమంటారు. ఉదాహరణకి :కుండలమ్మేవారు, బట్టలమ్మేవారు, దుంపలు, కూరగాయలమ్మేవారు, దుప్పట్లు అమ్మేవారు ఇలా వస్తువులమ్మేవారి కోసం డప్పులతో చాటింపు వేస్తారు. గ్రామ ప్రజలు బండి దగ్గరికి వెళ్ళి వారికి కావలసినవి వారు కొనుకొచ్చుకుంటారు.

**చావు డప్పు :** మనిషి పుట్టటం చనిపోవటం అనేది ప్రకృతిధర్మం. శవాన్ని స్మశానానికి (బొందలగడ్డ) డప్పుల మోతతో మోసుకెళ్తారు. ఆ సందర్భంలో ఆ బాధని తెలియజేస్తూ డప్పు వాయిస్తారు. ఈ సందర్భంలో కుటుంబసభ్యులు బాధలో ఉన్నట్లుగా తెలుస్తుంది. దూరానున్న బంధువులకి చావుకబురు తెలియజేస్తారు. ఆ గ్రామం లోని బంధువులకి, తమకి తెలిసినవారికి చెప్పుకునే సందర్భకార్యం కాదు కాబట్టి, ఈ చావు డప్పు శబ్దం ద్వారా తెలియనివారికి కూడా అది అశుభకార్యమని తెలియజేస్తారు. దరువు, శబ్దం గాలిలో కలిసిపోయిన అంటే చనిపోయిన ప్రాణాన్ని కలుస్తుంది. తద్వారా అతని ఆత్మ శాంతిస్తుందనేది చావు డప్పు దరువు ఉద్దేశం. చనిపోయిన వారి కోసం కూడా తన డప్పు దరువుతో ఒక మరణవార్తని సమాజానికేగాక, ప్రకృతిశక్తికి కూడా దరువు ద్వారా మాదిగ చాటింపు వేయటం విశేషం.

**ఇస్లాం పండుగలు-డప్పు :** భారతదేశానికి వచ్చిన మహమ్మదీయులు ఇక్కడ స్థిరపడి, ఖురాన్ సూత్రాలకి విరుద్ధంగా కొద్దిమంది సాంఘిక దురాచారమైన అంటరానితనాన్ని అనుసరిస్తున్నారు. కానీ అదేమీ పట్టించుకోని మాదిగవారు ముస్లీంల పీర్ల (మోహరం) పండగకి తమ డప్పులదరువుతో, కణకణమండే అగ్నిగుండం చుట్టూ చిందులు తొక్కుతుంటారు. పండుగ వారిది కాబట్టి అల్లాదీవెనలు ముస్లింలకు కావాలని, వారు మోక్షం పొందాలని, మాదిగవారు వారి పండుగకి శరీరం చెమటలు కక్కేలా, చేతివేళ్ల రక్తాలు కారుతున్నప్పటికీ డప్పులు కొడతారు. వీరితో ఇతర శూద్రకులాలవారు 'అసోయ్ దిగోయ్' అంటూ నిప్పులు గుండం చుట్టూ తొక్కుతూ విజయవంతం చేస్తారు. ఇంత చేసినా కొందరు ముస్లింలు పండుగకి వండిన ఆహార పదార్థాల్ని మాదిగలకి దూరంగా నిల్చోబెట్టి, నేల మీద పరచిన కండువాపై వేస్తారు. ఏ కుట్ర కుతంత్రం లేని మాదిగలు తమ మతంకాని ఇస్లాంమత ఆచారాల్ని తమ డప్పు సంస్కృతి ద్వారా కాపాడుతూ వస్తున్నారు. డప్పు శబ్దం ఎటువంటి భేదాలు లేకుండా అందరినీ ఆనందపరుస్తుందో అలాగే దాని తయారీదారుడైన మాదిగ కూడా తనని ఛీకొట్టిన వారిని కూడా తన డప్పు దరువుతో సంతోషపరుస్తాడు.

గ్రామ పొలిమేరదాటిన డప్పు మానవవిజ్ఞానం పరిధవిల్లి (వికసించి)న తరువాత ప్రవృత్తిరీత్యా అనేకమంది కళాకారులు డప్పుపట్టడం మనకు తెలిసిందే. రోజురోజుకీ అన్ని రంగాలలో అభివృద్ధి జరుగుతుంది. మనుషులు తమ రోజువారీ జీవితంలో వారివారి పనులచేత అలసిపోయి, అలసట తీర్చుకోటం కోసం సినిమాకి వెళ్తారు. పాటలకి సరిపోయే విధంగా డప్పు దరువు వస్తుంటే ప్రేక్షకులు మానసికానందాన్ని పొందుతూ శారీరక కష్టాన్ని మరిచి పోతారు. ప్రత్యేక సందర్భంలో కథానాయకుడు. (హీరో) డప్పుదరువు వేస్తుంటాడు. స్వతహాగా ఇది అతని వృత్తి కాకపోయినప్పటికీ, ప్రవృత్తిరీత్యా అలాచేస్తాడు.

ఈనాడు సమాజాన్ని చైతన్యవంతం చేయటానికి వస్తున్న గేయసాహిత్యంలో డప్పుపాత్ర పెనవేసుకుపోయింది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధి వల్ల రెడీమేడ్ డప్పులు (కంజర) మార్కెట్టులోకి వస్తున్నాయి. డప్పుని కనుగొన్నవారి వారసులకి అందవలసిన ఆర్థిక సౌలభ్యం ప్రవృత్తి కళాకారులు గద్దల్లా తన్నుకుపోతున్నారు. శాస్త్ర విజ్ఞానాభివృద్ధి జరగని రోజుల్లో ఆ వృత్తి వారికి అదే వృత్తిని అంటగట్టి

వారి ఆర్థిక, సామాజిక, విజ్ఞానాభివృద్ధికి అడ్డుకట్ట వేసింది నాటి సమాజం.

**సినిమా చాటింపు-దరువు :** నేటి సమాజంలో శాస్త్రసాంకేతికత అభివృద్ధి చెందుతున్న దశలోకూడా డప్పు సినీరంగంలో ప్రధాన భూమికని కలిగివుంది. నేడు డప్పు స్థానంలో మార్కెట్లోకి వచ్చిన 'కంజర/ప్లాస్టిక్ డప్పు' సినిపరిశ్రమలో వ్యాపార వస్తువుగా రూపుదిద్దుకొంది. అలాంటి సినిమాని చూడటానికి, ప్రజల్ని ఆకర్షింపజేయటానికి సినిమా పోస్టర్ని ఆటోరిక్షాపై పెట్టి డప్పులతో ఊరేగిస్తారు. ఈ సందర్భంలోని 'డప్పుదరువు' ప్రతేక ఆకర్షణ ఈ డప్పుల దరువు సుమారు పదికిలోమీటర్లు దూరానున్న గ్రామాలవారికి కూడా విషయాన్ని తెలియజేస్తుంది.

**మార్కెట్లో - డప్పు :** ఈ ఆధునిక సమాజంలో డప్పు స్థానాన్నే మార్కెట్లోకి వచ్చిన 'కంజర, ప్లాస్టిక్ డప్పు' ప్రజలందరినీ ఎంతగానో ఆకర్షిస్తోంది. ఈనాడు ప్రతి ఒక్కరు కుల, మత భేదం లేకుండా రాజకీయ నాయకులు తమ స్వార్థానికి ఎన్నికల్లో గెలిచేందుకు మాదిగల్ని, సాంస్కృతిక కళాకారుల్ని పిలిచి ఉచితంగా కంజరులు అందిస్తున్నారు. నేడు డప్పు శబ్దాన్ని ప్రతి ఒక్కరూ తమ విజయానికి చిహ్నంగా భావిస్తున్నారు.

**డప్పు కాపటం :** డప్పుని వాయిస్తున్నప్పుడు ఒక గంట తర్వాత కప్పులోని శబ్ద తీవ్రత తగ్గి 'కణ్ కణ్' మనే డప్పు శబ్దం రాదు. తనుక దప్పుల్ని కొద్దిసేపు వరిగడ్డి మంట వేసి వేడిచేస్తారు. దానితో తిరిగి డప్పు పూర్వపు శబ్దం స్వభావాన్ని పొందుతుంది. దీనినే 'డప్పు కాపటం' అంటారు.[4]

**తోలుడప్పు తయారుచేయటం :** ఇంటి చూరు కప్పులో వేలాడుతున్న, ఎండిన దూడతోలుని చర్మకారుడు తీసి, దానిపైన నీళ్లు పలుచగా చల్లుతాడు. అప్పుడు దానికి మెత్తదనం వస్తుంది. మార్టిని లేదా వడ్రంగి ద్వారా చేయబడిన గుండ్రటి చెక్కుదురుని శుభ్రంగా తుడిచి పెట్టుకుంటాడు. దీనికంటే ఒకరోజు ముందుగా ఒక మానికెడు అంటే సుమారుగా నాలుగుకిలోలు ఎండిన చింతగింజలు తీసుకొచ్చి ఒక కుండ (పాత్ర)లో పోసి, అందులో నీళ్ళుపోసి నానబెడతాడు. మాదిగ స్త్రీ మరుసటిరోజు పొయ్యిమీద ఉడికించి వాటిని రోటిలో వేసి భార్యభర్తలు ఇద్దరు కలిసి రోకలితో మెత్తగా దంచుతారు. అప్పుడు చింతగింజల గుజ్జు తయారవుతుంది. ఇందులో నల్లతుమ్మ బంకని వేసి మళ్లీ ఒకసారి దంచగా మెత్తని గుజ్జు తయారవుతుంది. దీనిని చేతిలో ఆ గుండ్రని చెక్క కుదురు చుట్టూ మందంగా పూస్తారు. నలుగురు మాదిగ పురుషులు కూర్చొని, చదునైన నేలపైన గోనె సంచిని పరుస్తారు. దానిపై తోలుని పరిచి, దానిపై కుదుకుని పెడతారు. కుదురు బయటవున్న తోలుని పైకి లేపి కుదురు పైభాగం నుండి కుదురులోని మధ్యభాగంలోనికి వచ్చేటట్లుగా గట్టిగా లాగుతారు. ముడతలు పడకుండా జాగ్రత్తలు



తీసుకుంటారు. డప్పులోపలిభాగం చేరినతోలు అంచులకి చిన్న కత్తితో రంధ్రాలు. పెట్టి, వాటిలో గుండా గోగునార తాడుని తీసి, లోపలున్న గుండ్రటి ఇనుప కడ్డికి ఆధారంగా చేసి కుడి పక్క నుండి మొదలు పెట్టి ఎడమపక్కగా వెళ్ళి, మొదలు పెట్టిన స్థానం దగ్గరికి వచ్చేవరకు పొరపోకుండా తోలుని గట్టిగా లాగి చివరలో గుండ్రటి ఇనుప కడ్డీకి ముడిని గట్టిగా కట్టివేస్తారు. దానితో ఆ తోలుకి డప్పు రూపం వస్తుంది. తిరిగి ఇలా కట్టిన డప్పుని ఎండకి 4 లేదా 5 రోజులు ఎండ పెడతారు. తిరిగి మధ్యమధ్యలో మాదిగ ఆ డప్పుని ఎండిదా? లేదా? ఎండటానికి ఇంకా ఎన్ని రోజులు పడుతుందో అని చేతితో నిమిరి కర్రతో కొట్టి పరీక్షిస్తుంటాడు. బహుశా ఐదవ నాడు డప్పుని కొట్టి చూడగా 'కణ్ కణ్' మని శబ్దం వినబడగానే, డప్పు తయారైందని గుర్తించి అప్పుడు డప్పులోపల వేసిన తాడుకుట్లని తీయటానికి కత్తిని బాగా సానబడతాడు. లోపలున్న కుదురుని ఆధారంగా చేసుకొని దాని లోపల అంచుని నెమ్మదిగా కత్తితో కోసుకుంటూ వెళ్లాడు. ఏ మాత్రం కత్తి జారి డప్పు పొరకి తగిలినా ఇన్ని రోజులు చేసిన శ్రమంతా వృధా అయిపోతుంది. అందుకని ఆ పని మీద ఎంతో శ్రద్ధ వహించి పనిని పూర్తిచేస్తాడు. ఈ పని చేసేటప్పుడు ఎవరితో మాట్లాడడు. ఆ పని పూర్తి చేయటానికి దాదాపు ఒక రోజు పడుతుంది.

**పొట్టకిచ్చురు డప్పు :** మాదిగవారు డప్పులు కొడుతుంటే వారి పిల్లలు తమ తండ్రుల మాదిరిగా డప్పుకొడతాం అని ఏడుస్తుంటారు. వారి పిల్లలకి తగ్గట్టుగా పశువు కడుపులోని ఇచ్చురు (మృదువైన తోలు)తో, పగిలిన మట్టికుండల మూతికి ఈ ఇచ్చుడుతోలుని పచ్చిగా ఉన్నప్పుడే తీసి అతికిస్తారు. అది ఒక రెండు రోజుల్లో ఎండుతుంది. దానిని పిల్లలు తమ గూడెం మధ్యలో కొట్టుకుంటూ ఆటలు ఆడతారు. చిన్న పిల్లల సరదాకోసం తయారుచేసిన డప్పు కాబట్టి దానిని చిన్నపిల్లల డప్పు అని అంటారు. ఈ డప్పుపై దరువు వేయటం నేర్చుకున్న మాదిగ పిల్లలే రాబోయే తరానికి వారసులు.

**శాస్త్ర సాంకేతిక ప్రభావం - డప్పు మనుగడ**

ఒకప్పుడు ప్రతిగ్రామంలో మాదిగవారి ఇళ్లల్లో కుటుంబానికి ఒక డప్పు కచ్చితంగా ఉండేది. అలా ప్రతి గ్రామంలో పదినుండి



ఇరవై దాకా డప్పులు కనిపించేవి. గ్రామంలో ఏదైనా ఒక జాతర, పండుగ, పెండ్లి, చావు, కందూరు (మొక్కు చెల్లించటం), మొక్కుబడులు మొదలైన కార్యక్రమాలు జరుగుతున్నపుడు డప్పుల మోతతో ఊరంతా దద్దరిల్లేది. చంటిపిల్లాడి నుండి మూలనున్న ముసలమ్మ వరకు ఏ ఇంట్లో కార్యం జరిగినా డప్పు చాటింపు ద్వారా సులభంగా తెలిసిపోయేది. ఈనాడు డప్పు అంటే తెలియని నవతరం గ్రామాల్లో కోకొల్లలు ఉన్నారంటే ఆశ్చర్యపోనవసరంలేదు. గ్రామంలో దరువు వేసేవారు కొరవడిపోయారు. ఒక గ్రామంలో డప్పులు లేక ప్రక్క గ్రామాలనుండి డప్పులు తీసుకొచ్చి ఇక్కడి కార్యక్రమాలు జరుపుతున్నారు.

భారతదేశ సమాజాభివృద్ధికి చర్మకారుడు/మాదిగ చేసిన అనేక నూతన అన్వేషణల్లో ఒక గొప్ప అన్వేషణ ఫలితంగా రూపొందిందే డప్పు. ఈ డప్పుని 'మాదిగ' భారతజాతికి అంకితం చేశాడు. ఈ డప్పుని ఆధారంగా తరువాతి కాలంలో ఆయా సందర్భాల్లో పనులను బట్టి మరికొన్ని చర్మకార వాయిద్యాలు మాదిగచేత రూపొందించ బడ్డాయి.

అసలు విషయానికొస్తే డప్పు తయారీ లేగ దూడల తోలుతో మాత్రమే తయారుచేయ బడుతుంది. ఆ రోజుల్లో పశువుల దూడలు రోగాలబారినపడి మరణించేవి. అలా మరణించటం అటు తల్లికి, ఇటు ఆసామి (ఓనర్)కి చాలా బాధకరమైన విషయం. చర్మకారుడు దూడల శరీరంపై పరిశోధన చేసి, అలాంటి చర్మాన్ని "డప్పు" అనే చర్మ వాద్య వస్తువుగా రూపొందించాడు.[6] మాదిగవారు, ప్రజలు శ్రుతి కలుపుతూ చిందులేస్తారు. ఇది డప్పు దరువు యొక్క మహత్తు. శుభకార్యాలైన వాటికి తగ్గట్టుగా సానుభూతిని తెలిపే దరువులు వేస్తాడు. ఈ విధంగా సమయం సందర్భాన్ని బట్టి మాదిగవారు దరువుల్ని కనిపెట్టి సమాజంలోకి తీసుకువచ్చారు. డప్పు వాద్యాలు లేకుండా ఎటువంటి పండుగలు, జాతరలు, ఉత్సవాలు జరగవు. డప్పు కొట్టేవారు ముందుండి పైన చెప్పిన అన్ని కార్యాలను చక్కగా నడిపిస్తున్నారు. దీనినిబట్టి వారు ముందున్న గొప్పజాతిగా గుర్తించాల్సిన అవసరం నేటి సమాజంపై కచ్చితంగా ఉంది.

**ఆధారాలు :**


1. తెలుగులో కుల పురాణాలు - ఆశ్రిత వ్యవస్థ, పులికొండ సుబ్బాచారి.
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆర్.వి.ఎస్.సుందరం.
3. సమాజశాస్త్రం-పరిచయం, కడియాల జగన్నాథశర్మ & ఆర్.విజయకృష్ణం నాయుడు.
7. Hisotry of Caste in India.
8. కుల నిర్మూలన-డా॥ బి.ఆర్.అంబేద్కర్, తెలుగు అనువాదం - బోయి భీమన్న.
9. జి.ఎస్.ఘుర్యే - 1969.
10. Scott & John - Caste.
11. The People of the India, Herbert Risley.
12. జానపద విజ్ఞానంలో ఆశ్రిత సాహిత్యం, డా॥పులికొండ సుబ్బాచారి.
13. మన చరిత్ర, ఏటుకూరి బలరామమూర్తి.




**బురదలోన ఉంటున్నా తరగదు పద్మం విలువ**
**తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ**
**అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు-**
**అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ**
**మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ.**

**(ప్రపంచ పదులు**
**- డా. సి. నారాయణ రెడ్డి)**

# గొర్రెలింకా పుర్రెలూపుతూనే ఉన్నాయ్...!

**డా. మహమ్మద్ హసన్**, సాహిత్య విమర్శకులు, ఫోన్ : 9990 805 9234

తెల్లారింది లెగండోయ్ కొక్కరొకో ... అంటాడు ఓ కవి, నిద్రమత్తులో జోగుతున్న సమాజాన్ని మేల్కొల్పడానికి దండోరా చేతపట్టుకొని లేదా దమరుకం చేతపట్టుకొని గొంతుచించుకొని లేలేత ప్రభాత కిరాణాలు మీ కోసం వేచి చూస్తున్నాయి లేవండి ఆస్వాదించండి... మీ మీ కర్తవ్య నిర్వహణలో నిమగ్నం కండి అంటూ సమాజాన్ని తట్టిలేపే ప్రయత్నం చేస్తుంటారు కొందరు. అలాంటి వారిలో ముందు వరసలో ఉంటారు కవులు. అలాంటి కోవకు చెందిన వారిలో అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం ముందు వరుసలో ఉంటుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. బ్రతికింది కొద్ది కాలమే అయినా సమాజం అనే విశాలమైన **"కాన్వాస్"** పై బలమైన సాహిత్య ముద్రను వేసి **"తాను మరణించి జనులకి కవితనందించి"** అన్నట్లుగా జీవిత కాలంలో తను చూసిన పరిస్థితులను అనుభవించిన పేదరికాన్ని సమాజంలోని వైరుధ్యాలను, అవినీతి అక్రమాలు, ఓ వైపు వ్యాధి (క్షయ) ముదిరి చావుకి దగ్గరౌతున్నా అదరక చెదరక బెదరక కలాన్ని ముందుకు నడిపి కవితా సేద్యం చేసిన కవికర్షకుడు అలిశెట్టి ప్రభాకర్.

**పడుకుని ఉన్నా**
**గుండె**
**గడియారమౌతుంది**
**ఒక్కొక్కప్పుడది**
**నిద్రపట్టనివ్వని**
**అలారమౌతుంది.**

**"గుండె"** శీర్షికతో వున్న మినీ కవితలోని నాలుగు వాక్యాలు అవి. గుండెను గడియారాన్ని పోల్చుతు వ్రాసిన వాస్తవికమైన వాక్యాలు మనకు ఇందులో దర్శనమిస్తాయి. మనిషి అనేక రకాల భావోద్వేగాల సమాహారం, కోపం, అసూయ, భయం, ఆనందం, ద్వేషం మొదలైనవి అందులో కొన్ని. మనిషి సంఘజీవి మరియు సంఘర్షణ జీవి నిత్యం ఎన్నో రకాల సంఘర్షణలకు గురౌతు దినాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. అందులో భాగంగానే అనేక రకాల భావోద్వేగాలను సమ్మిళితం చేసుకుంటూ జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాడు. బాధో, భయమో కల్గినప్పుడు మనిషి గుండె కూడా గడియారం లాగ అప్రమత్తమై నిద్ర పట్టనివ్వకుండా అలారం (సైరన్) లాగా మేల్కొలుపుతుంది అంటాడు. ఇది ఎంతో అనుభవ ముంటేనే తప్ప వ్రాయలేని వాక్యాలు. అనుభవం ఉన్నా వ్రాయగలిగే నేర్పరితనం, పదాల కూర్పు ఉండాలి. అందుకే నాలుగు వాక్యాల్లోనే వాస్తవికమైన సత్యాన్ని కళ్ల ముందుంచాడు పై కవితలో.




**చీకట్లో జడుసుకుంటే**
**ఒక చెట్టే నీ చుట్టూరా**
**అరణ్యమై భయపెడుతుంది**
**గుండెంటూ కలిగుంటే**
**నీ వెంట అదే**
**పెద్ద సైన్యమై నిలుస్తుంది.**

**"గుండెసైన్యం"** శీర్షికతో వున్న ఈ కవితను చదవగానే నాకు ఓ కవి చెప్పినట్లుగా **"కుంభవర్షం కురిసినా బోర్లించిన కుండలో నీరు నిలువనట్లే, ఆత్మవిశ్వాసం లేనివాడు విశ్వమంతా తిరిగినా వీసమెత్తు సాధించలేడు"** అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. "భయం" అనేది మనిషికి అతిభయంకరమైన మానసికపరమైన ఉద్వేగపరమైన అంశం. ఒకసారి మనిషి మెదడులోకి అది (భయం) ప్రవేశిస్తే ఎంతటి బలశాలినైనా రోగగ్రస్తుడిని చేస్తుంది. చీకటి అనేది భౌగోళికంగా జరిగే సహజమైన ప్రక్రియ. చీకటికి భయపడే వ్యక్తులకు (నిక్టోఫోబియా) ఆత్మవిశ్వాసం కల్గించి గుండె ధైర్యాన్ని ఆత్మబలాన్ని ఇచ్చేదిగా వ్రాశాడు ఈ కవితను.

**ఒక నక్క**
**ప్రమాణస్వీకారం చేసిందట**
**ఇంకెవర్నీ మోసగించనని**
**ఒక పులి**
**పశ్చాత్తాపం ప్రకటించిందట**
**తోటి జంతువుల్ని సంహరించినందుకు**
**ఈ కట్టుకథ విని**
**గొర్రెలింకా**
**పుర్రెలూపుతూనే ఉన్నాయ్**

**"రాజకీయం"** శీర్షికతో వున్న కవితలోని వాక్యాలు. నేటి రాజకీయ నాయకులకు వర్తించే అక్షర సత్యాలు అవి. వినేవాడు వుంటే భారతం ఆరు నెలలు చెప్పొచ్చన్నట్లు అమాయకత్వం, అజ్ఞానం వున్నచోట తెలివి కలవాడే అజమాయిషీ చేస్తాడు అనేదానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రముఖ రాజనీతి తత్త్వవేత్త హెర్బర్ట్ స్పెన్సర్ **"బలవంతుడిదే రాజ్యం"** అన్నట్లుగా బలహీనుడు ఎప్పుడు బలవంతుడి చెప్పు చేతల్లోనే అనిగిమనిగి ఉండడం, అధికారం మరియు అంగబలం ధనవంతులకే అనుకూలంగా ఉండటం వాస్తవమే కదా! ఎన్నికల తంతు వస్తే చాలు లేనిపోని హామీలు వాగ్దానాలు గుమ్మరించి ప్రజల్ని గొర్రెల్ని చేసి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు తుంగలో తొక్కటం అమాయకులైన ప్రజలు ఇంకా పాలకులపై ఆశలు పెట్టుకోవడం వారి అవివేకానికి నిదర్శనం. ఈ కవితలోని వాక్యాలు నేటి రాజకీయ నాయకులకు, దేశంలోని ప్రస్తుత పరిస్థితులకు ప్రతిబింబాలు.

**బలవంతంగా**
**విద్యార్థుల్ని**
**పుస్తకాలకి**
**శిలువేసి**
**సంవత్సరాల**
**మేకులు**
**దిగేసి**
**వొదిలేస్తే**
**ఈ విద్యా వ్యాపార వ్యవస్థలో**
**నెత్తురోడుతూ**
**యింకెందరు నిరుద్యోగ క్రీస్తులో**

**"ఈ తరం క్రీస్తు"** శీర్షికతో వున్న కవితలోనివి పై వాక్యాలు. నేటి నిరుద్యోగ వ్యవస్థకు సజీవ సాక్ష్యాలు. విద్యా వ్యవస్థ వ్యాపారమైన తర్వాత విద్యా విలువలు పూర్తిగా నశింపబడ్డాయి అనడానికి ఈ వాక్యాలను కోట్ చేయవచ్చు ఎవరైనా. ఈ కాలం పిల్లలు పుస్తక జ్ఞానం తప్ప, లోక జ్ఞానం మరియు ప్రాపంచిక విషయాలపట్ల అవగాహన అంతంత మాత్రమే కలిగి ఉంటున్నారనేది నా అభిప్రాయం. అందుకే కేవలం పుస్తక జ్ఞానం మాత్రమే ఉపాధి కల్పించలేదు. ఇతర పరిజ్ఞానం కూడా అవసరానికి పనికి వస్తుందనేది ఇక్కడ ప్రస్తావించాల్సిన విషయం. పిల్లల్ని కేవలం పుస్తకాల పురుగులుగా తయారుచేసి సమాజానికి పనికిరాని వస్తువులుగా మిగల్చడం అనేది బాధాకల్గించే విషయమే. ఈ కాలపు చదువులు దేనికి ఉపయోగపడుతున్నాయనేది అసలైన ప్రశ్న. చదువుతున్న విద్యార్థి నిరంతర ప్రవాహంవలె చైతన్యశీలిగా ఉండాలి అలానే గోడకు కొట్టిన మేకులా కాకుండా సామాజిక స్పృహ, సామాజిక స్పందన కూడా కల్గి ఉండాలనేది నా అభిప్రాయం.

**ఓ ఆడదాని కళ్ళు తవ్వేశా**
**కన్నీటి శిథిలాలు బయల్పడ్డాయి**
**ఓ దౌర్భాగ్యుడి పొట్టలో ప్రవేశించా**
**పేగులు నాగుబాముల్లా బుసలు కొట్టాయి.**
**ఓ చిన్నారి హృదయాన్ని స్పృశించా**
**వాని తల్లి శిలావిగ్రహమే బ్రద్దలైంది**

పై వాక్యాలు **"దేశాన్ని తవ్వుతుంటే"** శీర్షికతో వున్న కవితలోని వాక్యాలు. ప్రస్తుత వర్తమాన సమాజానికి దర్పణం ఈ వాక్యాలు. ప్రస్తుతం దేశంలో నలుదిక్కులా మహిళలపై జరుగుతున్న లైంగికపరమైన హింస రోజురోజుకి మితిమీరిపోతుంది. స్త్రీని దేవతగా పూజించిన సంస్కృతి మనది అలాంటి ఆచార సంప్రదాయాలు పాటించే మన సంస్కృతిలో స్త్రీని వేధించటం నిత్యం మనం చూస్తున్న తంతే. ఇక ప్రస్తుతం మనం డెబ్బై ఐదు సంవత్సరాల **"ఆజాదీకా అమృత్ మహోత్సవ్"** ఉత్సవాలు జరుపుకుంటున్నమ్. ఈ డెబ్బై ఐదు సంవత్సరాలలో నిర్మూలించిన పేదరికపు శాతం ఎంత? ఇంకా మిగిలిన పేదవారి శాతం ఎంత అనేది నేటికీ ప్రామాణికమైన ఆధారాలు లేవు. అన్నపూర్ణగా పిలువబడుతున్న దేశంలో నేటికీ మూడు పూటలా తిండి దొరకని వారి శాతం సుమారు 12% మంది అని ఆర్థిక గణాంకాలు చెపుతున్నాయ్. వీరు ఎప్పుడు పేదరికపు జాబితా నుండి విముక్తిపొంది ఆర్థిక స్వాతంత్ర్యం పొందుతారనేది ప్రశ్న!.

ఇంకా నేటికీ కొనసాగుతున్న శిశు మరణాలు, గర్భస్థ మరణాలు పేదవారికి వైద్యం అందుబాటులోకి రాకపోవటం బాధకల్గించే విషయమే. ఇక్కడ సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు సమాజంపై సంధించిన పాటను ప్రస్తావించాల్సిన అవసరం వుందనేది నా అభిప్రాయం. **"సురాజ్యమవలేని స్వరాజ్యమెందుకని? సుఖాన మనలేని వికాసమెందుకని? నిజాన్ని బలికోరే సమాజమెందుకని? అడుగుతోంది అదిగో ఎగిరే భరత పతాకం"** అని ఎప్పుడో ఎనబైలలో వ్రాసిన ఆ పాట నేడు దేశంలో జరుగుతున్న అశాంతి, అలజడులకు, మత ఘర్షణలకు అన్వయించుకోవచ్చును. అలిశెట్టి ప్రభాకర్ గారు కూడా ఎనబైలలోనే కవిత్వం వ్రాసినప్పటికి, అప్పటికి ఇప్పటికీ పరిస్థితులలో పెద్దగా మార్పులేనట్లుగానే భావించాలి. పాలకులు మారుతున్నా పరిస్థితులలో మార్పు పెద్దగా లేదనేది కాదనలేని వాస్తవం.

తాను అనుభవించిన పేదరికం, తనను వేధిస్తున్న క్షయ వ్యాధి శరీరాన్ని అగ్నిలా దహించి వేస్తున్నా తను వేశ్య గూర్చి వ్రాసిన మాటల్లో **"తను పుండై మరొకరికి పండై"** అన్నట్లుగా రోజురోజుకి వ్యాపిస్తున్న క్షయ వ్యాధి వల్ల ఆరోగ్యం క్షీణిస్తున్నా కవిత్వానికి పెద్దపీట వేసి **"ఖడ్గం"** లాంటి పదునైన ప్రశ్నలు పాలకులపై సమాజంపై వేసి తాను మరణించి జనులకు కవిత్వమందించి చిరంజీవిగా అందరి మనసులల్లో సుస్థిర స్థానం సంపాదించుకొన్నాడు. జాషువా గారు **"సుకవి జీవించు ప్రజల నాలుకల యందు"** అన్నట్లుగా నేటికీ కవిత్వ రూపంలో జీవించే ఉన్నాడు అలిశెట్టి ప్రభాకర్.

**(జనవరి 12 అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి సందర్భంగా)**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3  UGC Care List Approved Journal
హైదరాబాద్ జనవరి : 2023

నివాళి

## సంస్కృత మహాకవి, గీర్వాణ వాచస్పతి, మహామహోపాధ్యాయ, పద్మశ్రీ

# శ్రీభాష్యం విజయసారథి

డా. గంద్ర లక్ష్మణ రావు, ఫోన్ : 9849328036



**యుగకర్తా యుగోద్ధర్తా । చక్రవర్తీ యుగస్యచ**
**సరస్వతీసుతోత్తంసః । జీయాత్ విజయ సారథిః ॥**

యావద్భారత దేశంలో గల పండితులలో ప్రశస్తిగాంచినవారు శ్రీభాష్యం విజయ సారథి గారు. 1936 లో కరీంనగర్ జిల్లా చేగుర్తి గ్రామంలో గోపమాంబా నరసింహాచార్యులకు జన్మించిన వీరు చిన్న తనంలో ఉర్దూ మీడియం బడికి వెళ్ళడానికి మనస్కరించక సంస్కృతం పై అభిమానం పెంచుకున్నారు. ఎనిమిదేళ్ళకే కవిత్వం రాయడం ప్రారంభించారు. 11 వ ఏట బాసర సరస్వతీ దేవిని చేరుకొని ప్రార్థించి 'శారదాపదకింకిణీ' అనే కావ్యాన్ని రచించారు. జనగాం దగ్గర పాలకుర్తిలోని సంస్కృత పాఠశాలలో విద్యనభ్యసించారు. యువకులుగా ఉన్నప్పుడే సంస్కృతంలో శబరీ పరిదేవనమ్ కావ్యం రచించారు. శబరీ పరిదేవనమ్ లోని కథ రామాయణం లోని శబరి కాదు. ఆధునిక కాలంలో ఒక గిరిజన స్త్రీ జీవితాన్ని విషాదంగా చిత్రిస్తూ అది పార్వతీ దేవిపై ఆరోపించి అభ్యుదయ భావాలను ప్రకటించారు. అమర భాషలో ఆధునికతను అభ్యుదయ దృక్పథాన్ని ప్రవేశ పెట్టిన ఘనత నవ్యత శ్రీభాష్యం విజయసారథి గారిది.

ఆ వయస్సులో 'కామాయనమ్' పేరుతో ఒక లఘుకావ్యం సంస్కృతంలో రాశారు. అయితే ఇది కూడా కేవలం లౌకిక కామభావన కాక తాత్విక చింతన కలిగించేదిగా ఉండడం విశేషం.

విద్యార్థిగా ఉన్నప్పుడు సంస్కృతంలో నవల రాయాలని రాశారు. నవలాసాహిత్యం తెలుగులో అప్పుడప్పుడే వ్యాప్తికి వస్తున్న రోజులు.మనోరమ అనే పేరుతో రాసిన నవలను కళాశాలను పరిశీలించిన బ్రహ్మశ్రీ మల్లావఝుల సుబ్బరామశాస్త్రి గారు స్తంభం చాటున ఉండి విని చక్కని సంస్కృత రచన అని ప్రశంసించారు.

వ్యాకరణ, జ్యోతిష, సాంఖ్య, తర్క, మీమాంసాది శాస్త్రాలలో ప్రావీణ్యత గడించారు. వాటిని నేర్చుకోవడం వరకే కాక నిజజీవితంలో సమాజంలో వాటిని సద్వినియోగం చేసి చూపించారు. ఎందరో వారి విద్వత్తుకు ఆశ్చర్యపడటమే కాక ఆచరించి ప్రయోజనాలు పొందారు. శాస్త్రాలను సామాజికంగా ఆచరించి చూపిన ఆదర్శపాండిత్యం వారిది.

సంస్కృత భాషలో గేయ ఛ్చందస్సును సృష్టించి మందాకినీ కావ్యం రచించి స్వయంగా ఉత్తరభారతదేశంలో జరిగిన కవిసమ్మేళనంలో గానం చేయగా తర్కవాగీశ భట్టాచార్యులు, యుగకర్తా యుగోద్ధర్తా, సరస్వతీ సుతోత్తంసా' అని ప్రశంసించారు.

దేశాభిమానం చాటుతూ 'భారత భారతి' , సమసమాజాన్ని ఆశిస్తూ క్రాంతిగీతమ్‌రాశారు. " జనని జాగృహి భారతావని జనని జయజయ పూత చరితే/ సకలజనతానందవాహిని నిఖిల మానవ శాంతి సారిణి" అని లయాత్మకంగా సాగే దేశభక్తి ప్రబోధగీతాలు గేయ సంప్రదాయాన్ని కూడా చాటాయి. క్రాంతిగీతమ్ లో దేశంలోని కులమత వైషమ్యాలు, వరశుల్కం వంటిదురాచారాలు, అన్యాయాలు అధర్మాలు నిరసిస్తూ యువతను ప్రబోధిస్తూ రాసిన ఉత్తేజపూరితమైన గేయాలున్నాయి. భాషలో ఈ గేయ సంప్రదాయాన్ని సృష్టించి ఆకర్షింపజేసిన మార్గదర్శకులు వీరు. భక్తి భావసౌందర్యాన్ని ప్రతిబింబింపజేసే రాసలీల, ఆవాహనమ్, వంటి కావ్యాలెన్నో రచించారు. ఆధునిక కాలంలో రూపాయి ఆధిక్యతను అధిక్షేపిస్తూ రూపసూక్తమ్, కపట భక్తులకు హితవుగా 'కౌలేయ సూక్తమ్' వంటి నవీన సూక్తులను రచించారు.

తెలంగాణ గురించి " తెలంగాణ కౌశలం సకల సత్కలా లాలితం/ తెలంగాణపౌరుషం సమరవీర సంభాషితమ్ / తెలంగాణ వైభవం బహు సమృద్ధి సంభావితం / తెలంగాణ గౌరవం జయతు" అని శ్లాఘించారు.

తమ పుట్టిన ఊరిలోని చేగుర్తి వేంకటేశ్వరస్వామికి, ప్రసిద్ధ క్షేత్రం చిలుకూరి బాలాజీకి ఇల్లందకుంట శ్రీరామచంద్రునికి , ఇంకా ఎన్నో సుప్రభాతాలు రచించారు.శివకేశవ భేదం లేకుండా అనేక ప్రసిద్ధ దేవాలయాలకు సుప్రభాతాలు, స్తోత్రాలు రాశారు. పద్మాక్షీ పదచారణమ్ పేరుతో హనుమకొండ పద్మాక్షీ దేవాలయం పై కావ్యం రచించారు.

సాంఖ్యదర్శనం గురించి తెలుగులో విపులంగా విశ్వదర్శనం కావ్యాన్ని వైజ్ఞానిక శాస్త్రానుసారంగా నిరూపించి రచించారు. సంస్కృత



భాషలోని చమత్కారాలను ప్రహేళికలు పేరుతో సేకరించారు. సంస్కృత నాటకాలలో నాందీ ప్రస్తావనలగురించి పుస్తకం రచించారు.

ఉదాహరణ ప్రక్రియలో అనేక ఉదాహరణలు, కరీణ్ణగర ప్రశస్తి, కామాయనమ్, మొదలైన ఆధునిక అభ్యుదయ భావాలతో కూడిన కావ్యాలెన్నో సంస్కృతంలో రచించారు.

సంస్కృత భాషలో కొత్త ఛందస్సులను, సూక్తాలను, దేశీయ స్థితిని చూసి విషాదలహరి పేరుతో దేశంలోని కులమతాల వైరుధ్యాలను, అనైక్యతను చూపుతూ కావ్యాలు రచించారు.

వరంగల్ విశ్వేశ్వర సంస్కృతాంధ్రకళాశాలలో ఉపన్యాసకులుగా ఎందరో విద్యార్థులను విద్వాంసులుగా తీర్చిదిద్దారు. అధ్యాపకులుగా ప్రాచార్యులుగా నిష్ఠతో విద్యాప్రదానం చేసిన గురువులు. సంస్కృత భాషను నేటి విద్యార్థులకు నేటి సామాజిక దృక్పథాలకు ఉపయోగ కరమని, ప్రాచీనమైనదిగా సుప్తావస్థగా పరిగణింపరాదని వారి పాఠాలలో , రచనలలో ఆచరణలో చూపించి అమర భాషకు కొత్త ఉద్దీపన కలిగించిన ఆచార్యులు.

సమసమాజం, సంస్కారవంతమైన సమాజం, సమజీవన విధానం రావాలని, యజ్ఞం కాని, దైవ పూజకాని మానవులను సంస్కరించేవిగానే ఉండాలి కాని స్వార్థాన్ని పెంచేవిగా, స్వంతకామనలకోసం చేసేవిగా ఉండరాదనినే అభ్యుదయ వాది .

పదవీ విరమణానంతరం సర్వవైదిక సంస్థానం నెలకొల్పి వేదజ్ఞానమే ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. శైవ, వైష్ణవ, శాక్తేయాది భేదాలు లేక కేవల జ్ఞానమే ప్రధానమని వేదధర్మమే ప్రధానమనే భావనతో గత మూడు దశాబ్దాలుగా కృషిచేస్తున్నారు. సర్వవైదిక సంస్థానంచే నిర్వహింపబడే వ్రతాలలో పూజలలో అన్ని కులాలవారిని ఆహ్వానించి స్త్రీలందరినీ కలిపి పాల్గొనేటట్లు చేసిన ఆచరణశీలి విజయసారథిగారు.

1958 లో అయ్యదేవర కాళేశ్వర రావు గారు ఒక పెద్ద సభలో 'మహాకవి' అని బిరుద ప్రదానం చేశారు, బిర్లాఫౌండేషన్ వారు వాచస్పతి పురస్కారాన్ని, ఆంధ్రప్రదేశ్ పూర్వ సాహిత్య అకాడమీ ప్రత్యేక పురస్కారాన్ని ప్రదానం చేశాయి.జైపూర్ లో 'వశ్యవాక్' బిరుదాన్ని , రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం తిరుపతి వారు మహామహోపాధ్యాయ బిరుదంతో సత్కరించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినతరువాత గౌరవ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావుగారు గోలకొండ ఖిలాపై జరిగిన స్వాతంత్ర్యోత్సవ వేడుకల్లో శ్రీ విజయసారథిగారిని విశిష్టంగా సన్మానించారు.

షిమ్లా పూర్వ ఉపకులపతి అభిరాజ రాజేంద్ర మిశ్రాగారు వీరి కవిత్వాన్ని చదివి **"యద్భారతదేశే అస్మిన్ స్వయమేవా అసౌ ఏకతః కవిసార్వభౌమః"** అని అభివర్ణించారు.

తెలుగులో సృష్టిదర్శనం పేరుతో వేదాలలో పేర్కొన్న శాస్త్రాంశాలను,ఆధునిక విజ్ఞాన శాస్త్రంలో పేర్కొన్న అంశాలతో సమన్వయం చేసి ఒక పుస్తకం సామాన్యులకు అర్థం అయేవిధంగా రచించారు. సాంఖ్యయోగం, న్యాయ వైశేషికాలను గురించి తెలుగులో సరళశైలిలో రాశారు. నాటకాలలో నాందీ ప్రస్తావనలనుగురించి పుస్తకంరాశారు.

కావ్యరచనలే కాక, శాస్త్ర రచనలు, భక్తి రచనలు అభ్యుదయ భావపూరితమైన, రచనలు దేశభక్తి ప్రధానమైన రచనలు భాలభట సంఘం (స్కౌట్స్) గురించి, ఇటీవల మనం ఎదుర్కొన్న కోవిద్ గురించి మూలతో జహి సమూలంగా తొలగించాలనే అర్థంలో ఒక లఘుకావ్యం రాశారు. సూక్తాలు, లేఖలు, ఉదాహరణలు, ఇట్లా అనేక ప్రక్రియలలో రచనలు చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి.

ఆధ్యాత్మికత అభ్యుదయం వైరుధ్యాలు కావని రెండూ సమాజ హితానికి తోడ్పడతాయని శతాధిక రచనల ద్వారా నిరూపించిన మహాపండితకవి శ్రీభాష్యం వారు.

ఇటీవల భారతప్రభుత్వం వారిని 'పద్మశ్రీ' బిరుదుతో సత్కరించింది. ఎన్నో పురస్కారాలు పొందినా వారి ప్రధాన లక్ష్యం ఉత్తమ సమాజ స్థాపన మాత్రమే . నిర్విరామంగా రచనలు చేస్తూనే ఉన్నారు. ఆశువుగా కూడా సంస్కృతంలో శ్లోకాలు, కవిత్వం చెప్పగలరు. జ్యోతిషవాస్తు శాస్త్రాలలో దేవాలయాల స్థాపనాదులు కూడా చేయించారు. బహుముఖ పాండిత్యం, ప్రజ్ఞ, కవితాశక్తి, ఉపాసనాబలం కల మహాకవి, మహాజ్ఞాని శ్రీ భాష్యం విజయసారథిగారు. చివరి వరకు కూడా ఎవ్వరైనా ఎదురుగా రాయగలవారుంటే శ్లోకాలు అలవోకగా చెప్పగల కవితావాహిని ఆయన.

నిత్య భావుకుడు, నిరంతర సమాజహితైషి, ఆశుధారా కవితావ్రతుడు, అందరిపట్ల అత్యంత వాత్సల్యం ప్రకటించగల ఉత్తమ ఉదాత్త వ్యక్తిత్వం గల ఆచార్యులు, గురువు అయిన పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథిగారు పరమపదమును చేరడం సాహితీలోకానికి విషాదకర దుర్దినం.

అమర భాషను ఆదునిక కాలానికి అభ్యుదయానికి అనువర్తింపజేసిన నవీన కవిచక్రవర్తి, తెలంగాణ గర్వించదగిన ఒక మహాకవికి శ్రద్ధాంజలులు.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3 55 హైదరాబాద్ జనవరి : 2023

# డా. దేవేంద్ర 'అడుగులు' కథలు – విశ్లేషణ

**డా. గిన్నారపు ఆదినారాయణ,** ఫోన్ : 994 953 2456

తెలుగు కథా సాహిత్యంలో **'అడుగులు'** పేరుతో తొలి అడుగులు వేసిన కవయిత్రి, కథా రచయిత్రి, ఉత్తమ పరిశోధకురాలు డా. ఎం.దేవేంద్ర. సాహిత్యం మీద మక్కువ, చదువంటే ప్రాణంగా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ కాలానికి ఎదురీది నిలబడ్డ వర్తమాన కథారచయిత్రి. తన అనుభవంలోంచి రాసిన కథల సంపుటి ***అడుగులు***. అందుకే పెద్దింటి అశోక్ కుమార్ ఒకమాట అంటారు వాస్తవ దృష్టితో రాసే రచయిత ఎప్పుడు కథా వస్తువులను తన అనుభవంలోంచి, చూసిన జీవితంలోంచి స్వీకరిస్తారు. దేవేంద్ర అదే పని చేసింది అంటాడు ఈ రచన ముందుమాటలో డా.ఎం.దేవేంద్ర తన అనుభవాలను అక్షరీకరించి, కథలుగా మలిచిన తీరు చాలా గొప్పగా ఉంది. మొదటి ప్రయత్నంలో ఈ కథాసంపుటిని రాసినప్పటికి తన అనుభవాలు మన స్వీయ అనుభవాలకు దగ్గర కన్పిస్తాయి.

అడుగులు (కథల సంపుటి)
డా. ఎం. దేవేంద్ర
వెల రూ. 120.
ప్రతులకు : రచయిత్రి
12-5-35/ఎ/9, 4ఎఫ్6
బల్లాడ్ ఎస్టేట్, తార్నాక,
సికింద్రాబాద్ - 500 017.
ఫోన్ : 9490 682 757




డా.ఎం.దేవేంద్ర **'అడుగులు'** పేరుతో 11 కథలతో మనముందుకు తీసుకువచ్చి కథా సాహిత్యంలో చోటు సంపాదించుకుంది. రచయిత్రి ప్రధానంగా స్త్రీల సమస్యలు, ఆ సమస్యలకు పరిష్కార మార్గాలు, బహుజనులు ఎదుర్కొంటున్న పరిస్థితులు వాటికి పరిష్కార మార్గాలు చూపుతూ చాలా అద్భుతంగా కథలను కొనసాగించింది. అలా ఇతర బహుజన కులాలకు సంబంధించిన కులవృత్తులు తెలుపుతూ తాతల తరాల నుండి కులవృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తే, ప్రపంచీకరణ నేపథ్యంలో కాల పరిస్థితులు మారుతూ కులవృత్తులను ఎలా దెబ్బ తీస్తున్నాయో తెల్పింది. కులవృత్తులను నమ్ముకున్న నేటి యువతరం ఎలా ఆలోచిస్తున్నారో కూడా స్పష్టంగా తెలియజేసింది. అలాగే కులవృత్తులతో విసిగిపోయి జీవనోపాధి కరువై కుటుంబం ఆర్థిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతుంటే కులవృత్తుల వస్తువులు అమ్ముకొని బ్రతకడం అంటే తాతల తరాలనుండి వస్తున్న కులవృత్తిని అమ్ముకున్నంత బాధగా కథావస్తువును తెలుపుతూ బహుజనుల జీవనవైచిత్రిని తెలియజేసింది రచయిత్రి.

ఈ దేశంలో ముఖ్యంగా రైతులు సమస్యలు ప్రధానంగా కన్పిస్తున్నాయి. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో రైతు జీవనం కొనసాగిస్తున్నారు. వ్యవసాయం పట్ల ఇప్పుడున్న యువత అంతగా ముందుకు రావడం లేదు. ఉన్నత చదువులు చదివి విదేశాలకు వెళ్ళి ఉద్యోగాలు చేయడం అనేది మనం గమనిస్తూనే ఉన్నాం. యువకులు వ్యవసాయానికి సంబంధించిన విద్యనభ్యసిస్తున్నా వ్యవసాయం వైపుగా పెద్దగా వెళ్ళినట్లు ఎక్కడా కనిపించడం లేదు. అగ్రికల్చర్ బి.టెక్. లాంటి సాంకేతికవిద్య వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడాలి అనే మార్పును రచయిత్రి తన కథల ద్వారా కాంక్షించింది. అందుకే **'నారుమడి'** కథ ద్వారా వ్యవసాయ స్థితిగతులను తెలుపుతూ వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ విద్యను చదివి వ్యవసాయం చేసి నూతన సేంద్రియ వ్యవసాయ పద్ధతితో మెరుగు పడవచ్చు అని తిరుపతి పాత్ర ద్వారా చక్కగా తెలుపుతూ కథా వస్తువు నిర్మాణ పరంగా చాలా జాగ్రత్తలు పాటిస్తూ 'నారుమడి' కథను ముందుకు నడిపింది. ఆ కథలన్నీ కూడా వివిధ దిన, వార, మాస పత్రికల్లో అచ్చైనవి.

***'అడుగులు'*** అనే కథలో తన జీవిత అనుభవాలను ఒక్కొక్క అడుగుగా ముందుకు వేస్తున్న విధానాన్ని చక్కగా చిత్రించింది. ఈ కథ ఒకరకంగా రచయిత్రి ఆత్మకథాత్మక కథగా భావించవచ్చు. రచయిత్రి జీవితాన్ని గురించి నేను కొంత తెలుసుకున్నాక ఈ కథను పూర్తిగా చదివిన తర్వాత ఈ కథలో మాలతి పాత్ర రచయిత్రి జీవితంగా భావించాను. తన చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి, తల్లి చాటు పిల్లగా పెరిగి చదువు తప్ప మరోలోకం తెలియని అమ్మాయిగా పెరుగుతుంది. కాని కుటుంబ సమస్యల కారణంగా ఆడపిల్లకు వివాహం చేస్తే కుటుంబ బాధ్యత తగ్గుతుందని భావించి తాను చిన్నవయస్సులోనే వివాహం చేసుకుంటుంది. ఆ తర్వాత ఇంటర్మీడియట్‌లో పురిటి నొప్పులతో ఫైనల్ పరీక్ష రాసి బాబుకు జన్మనిస్తుంది. బాబుకు జన్మనిచ్చాక ఒక రోజు గడుస్తుంది అయినా తను పరీక్ష గురించే ఆలోచిస్తుంది. హాస్పిటల్ డాక్టర్‌తో నాకు చదువంటే ప్రాణం, నేను వెళ్ళి మిగిలిన పరీక్షలు రాయవచ్చా అని అడుగుతుంది. తన ప్రశ్నకు డాక్టర్లు ఆశ్చర్యపోతారు. మాలతి ఆసక్తిని గమనించి నీ ఓపిక అమ్మా అని చెప్పడం జరుగుతుంది. అంటే ఇక్కడ మాలతికి చదువంటే ఎంత ప్రాణమో మనకు అర్థం అవుతుంది. ఆ తర్వాత డిగ్రీలో పాపకు జన్మనిచ్చి కుటుంబ బాధ్యతలు మీదేసుకొని చదువును ఎక్కడ కూడా నిర్లక్ష్యం చేయక ప్రభుత్వ అధ్యాపక పోటీ పరీక్షల్లో కొద్దిలో ఉద్యోగం మిస్ అవుతుంది. అయినా కృంగిపోకుండా ఈ రోజు నేను విఫలం కావచ్చు రేపు నేను అనుకున్న

లక్ష్యాన్ని సాధిస్తాను అనే ఆశా భావాన్ని వ్యక్తం చేస్తుంది మాలతి. ఈ స్ఫూర్తి నేటి యువతరానికి ఎంతో అవసరం. జీవితంలో సమస్యలు ప్రతివ్యక్తికి ఉంటాయి వాటిని ఛేదిస్తూ ముందుకు నడవడమే గొప్ప అనే అంశాన్ని ఈ కథ ద్వారా రచయిత్రి తెలియజేసింది. దాదాపు ఈ కథ తన స్వీయ అనుభవాలను, తాను అనుభవించిన యదార్థ సంఘటనలను రచయిత్రి కథగా మలిచిన తీరు అద్భుతంగా చెప్పవచ్చు.

అలాగే ముఖ్యంగా రచయిత్రి తన ఉన్నత చదువు కొనసాగిస్తున్న సందర్భంలో మలిదశ తెలంగాణ ఉద్యమం జరుగుతున్న తరుణం. తెలంగాణ రాష్ట్ర ఆశయంకై చేసే అంశాలను కథా వస్తువుగా ఎంచుకొని చారిత్రక, సామాజిక, సాంస్కృతిక అంశాలను తెలియ జేసింది. ప్రధానంగా తెలంగాణ ఉద్యమ సమయంలో తెలుగువిభాగం పరిశోధక విద్యార్థులు పిడమర్తి రవి, నలికంటి శరత్ లాంటి విద్యార్థి ఉద్యమ నాయకులు చేసే పోరాట పటిమను తెలుపుతూ, విద్యార్థి ఉద్యమానికి తోడుగా నిల్చిన చుక్కా రామయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి వారి మద్దతూ, అలాగే అటెండర్ రాములు ద్వారా తొలిదశ తెలంగాణ ఉద్యమంలో కొల్లూరి చిరంజీవి, కాళోజీ నారాయణరావు, ప్రొ. జయశంకర్ లాంటి గొప్ప చారిత్రక వ్యక్తుల చరిత్రను ఈ కథలో రికార్డు చేసింది. ఉద్యమ నిర్మాణాన్ని, ఉద్యమంలో ఎదురయ్యే సమస్యలను, స్వరాష్ట్ర ఉద్యమ ప్రయోజనాలను, విద్య వ్యవస్థలాంటి అనేక అంశాలను విపులంగా తెలియజేయడం, ఆంధ్ర మహిళ సభ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ మద్దతుదారుల విధివిధానాలను అన్నింటిని కూడా **'గురితప్పొద్దు'** కథ ద్వారా తన అనుభవాలను పంచుకున్న విధానం ఈ కథలో చక్కగా తెలిపింది రచయిత్రి.

***'కాన్గిరిబడి'*** పేరుతో రాసిన కథ ప్రతి ఒక్కరి పాఠశాల స్థాయి బాల్య గుర్తులను స్మరించుకునే విధంగా ఉన్న కథ. పూర్వకాలంలో గురువులంటే గౌరవం, భక్తి. నరసింహాచారికి బాల్యగురువు భట్టు రామరాజు పంతులు. తన బాల్యగుర్తులు గురువుకు, విద్యార్థికి ఉండే అనుబంధాన్ని చక్కగా తెలిపింది. పాఠశాలస్థాయి విద్యార్థులకు ఎలాంటి విద్య నేర్పించాలో తెలిసిన వ్యక్తి. విద్యార్థుల నాడి ఎరిగిన వ్యక్తి. తెలంగాణ ప్రాంతంలో విద్యార్థులకు గురువు విద్య నేర్పే విధానం ఆనాటి స్థితిగతులను క్లుప్తంగా చెప్పడం జరిగింది. దాంతో పాటు కరోనా సమయంలో వివిధ రంగాలలో స్థిరపడిన విద్యార్థులు ఉపాధ్యాయుడి స్థితిని గమనించి విద్యార్థులు గురువుకు సహాయం చేయడం వారి బాధ్యతగా భావించి వారి బాల్య జ్ఞాపకాలను నెమరువేసుకునే సందర్భాన్ని ఈ కథ ద్వారా తెలియజేసింది రచయిత్రి.

**'రంగయ్య'** కథ కూడా ఇలాంటి సామాజిక బాధ్యతను గుర్తుచేసే కథ. కాలం ఒక్కసారిగా అల్లకల్లోలం అవుతూ సామాన్య కూలిప్రజలు ఎదుర్కొంటున్న స్థితిగతులు అందుకు అనుగుణంగా ప్రజలు ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు, సామాన్య ప్రజలకు ప్రభుత్వ హాస్పటల్ వైద్యవిధానం అందించిన సేవలు, ఆ సందర్భంలో ప్రజల అంతర్గత మనస్తత్వాలను చక్కగా తెలిపిన కథ.

ముఖ్యంగా ఈ కథాసంపుటిలో దళిత, బహుజనులు కులవృత్తిని నమ్ముకొని ఆ వృత్తి తరతరాల ఆస్తిగా భావిస్తూ వృత్తి పరంగా ఎదుగుదల లేకపోయినా దాంట్లోనే ఉంటూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రపంచీకరణ నేపథ్యంగా వివిధ రకాల పెద్ద పెద్ద కంపెనీలు కులవృత్తులను నాశనం చేస్తుంటే చూసి తట్టుకోలేక కులవృత్తిని వదిలేసి విదేశాలకు వెళ్ళి డబ్బును సంపాదించుకొని వచ్చి ఆ డబ్బుతో వృత్తిని మార్కెట్ మయం చేసి అభివృద్ధి చెందాలనే కోరికను తెలియజేసిన కథ ***'వెండిగిన్నె'.*** అలాగే కులవృత్తిని తరతరాల నుండి కొనసాగిస్తూ, మధ్య తరగతి జీవనం ద్వారా ఒక తండ్రి తన పిల్లలను పోషించి వారికి వివాహం చేసి మరో ఇంటికి పంపిస్తే రకరకాల కారణాలతో తన పిల్లలతో పాటు అల్లుడు చనిపోవడం వారికి పుట్టిన పిల్లలను ఆ తండ్రే పోషించడం అనే బాధతో కూడిన కష్టాలు అతన్ని వెంటాడుతాయి. మరోవైపు కుటుంబ పోషణ వృత్తిలో గిట్టుబాటు లేకపోవడం వాటికి ప్రభుత్వాలు అనుమతి ఇవ్వక పోవడం అనే అంశాలు ***"సుదర్శన చక్రం"*** అనే కథను రచయిత్రి కథను నడిపించిన విధానం బాగుంది.

అలాగే కులవృత్తిని నమ్ముకొని గుండెపోటుతో చనిపోయిన విశ్వనాథం కుటుంబాన్ని రోడ్డుపాలు చేసి ఒక బహుజన కుటుంబాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు. బాల్య దశలోనే తండ్రిని కోల్పోయి, చదువంటే అమితమైన ప్రేమను ఏర్పాటు చేసుకొని ఉన్నత విద్యాసంస్థలో సీటు సంపాదిస్తే ఫీజు కట్టలేని స్థితిలో నవీన్ ఉంటాడు. నవీన్ విశ్వనాథం కొడుకు. కష్టపడి యం.సి.ఏ. పూర్తి చేసుకొని ఉద్యోగం సంపాదిస్తాడు. సంతోష పడాల్సిన సమయంలో తన చెల్లెలు ఆరోగ్యం బాగాలేక చనిపోయే స్థితిలో ఉంటే ఎలాగైనా కాపాడు కోవాలనే తపనతో ఎంతో కష్టపడతాడు. మధ్యతరగతి వ్యక్తులకే ఇలాంటి పరిస్థితులు వస్తాయని కష్టాన్ని దిగమింగుకుని తాను ఏటికి ఎదురీదుతాడు. ఇలా కులవృత్తులను నమ్ముకొని జీవనం సాగించిన కుటుంబాలు పైకి ఎదగాలంటే చదువొక్కటే ఏకైక మార్గం పేదరికం చదువుకు అడ్డుకాదు. చదువు ద్వారా కుటుంబాన్ని, సమాజాన్ని ముందుకు నడిపించవచ్చు అని ***"కొత్తపల్లి"*** కథ ద్వారా తెల్పడం జరిగింది.

**ముగింపు**

తెలుగు సమాజంలో స్త్రీల పరిస్థితులు ఎలా ఉన్నాయో మనం అనేక సంఘటనల ద్వారా చూస్తూనే ఉన్నాం. ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గాలు వివిధ అంశాలను బట్టి చూస్తున్నాం. అలా స్త్రీల సమస్యలను, స్త్రీలకు ప్రభుత్వ మహిళా పోలీసులు ఇచ్చే మనోధైర్యం వంటి ఎన్నో అంశాలను వివిధ కథల ద్వారా విలువైన అంశాలను తెలియజేసింది రచయిత్రి. ఇలా దళిత, బహుజనుల జీవితాలను కష్టనష్టాలను తడారని గొంతుతో పెకిలించి మనముందు కథలుగా పెట్టింది. ఇలా కథా సాహిత్యంలో సముచితమైన స్థానం సంపాదించి కథా సాహిత్యానికి ఔన్నత్యాన్ని కలిగించింది రచయిత్రి డా.ఎం. దేవేంద్ర.

# శ్రీరంగాచార్యుల స్వీయ చరిత్ర "జీవన పర్వం"

శివప్రియ, ఫోన్ : 996 408 2076

**"నేను ఏ రంగం లోను ప్రసిద్ధుణ్ణి కాను. నా గూర్చి వ్రాసుకోవలసిన విశేష విషయాలు లేవు అయితే మా చిన్నప్పటి పల్లెలు- పంటలు, ప్రజల జీవన వైవిధ్యం, విద్య, ఉద్యోగ విషయాలు, ఆచార వ్యవహారాలు, బంధుత్వాలు ఏ విధమైన రాజకీయ గంధం లేని స్నేహానుబంధం మొదలైన వాటిని తెలుసుకోవలె ననే అభిలాష గల వారి కీగ్రంథం పాథేయంగా నిలుస్తుందని భావిస్తున్నాను."** (జీవన పర్వం-ప్రస్తావన. పేజి:V) నిజమే మరి. ప్రకాండ పండితులైన డా. శ్రీ రంగాచార్య తమ స్వీయచరిత్ర 'జీవనపర్వం'లో ప్రస్తావించిన తొలి మాటలివి. సామాన్యమైన కుటుంబంలో పుట్టి, కష్టాల కడలిలో ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని, మెల్లమెల్లగా అడుగులేస్తూ, అంచెలంచెలుగా ఎదుగుతూ, అధ్యాపన క్షేత్రంలో దేశికోత్తములుగా పేరు మోసిన శ్రీ పెరుంబూదూరు శ్రీ రంగాచార్యుల జీవితం ఏకాంత యోగి ఆశ్రమంలో సాగింది కాదు. ఆబాలగోపాలం మధ్య అలరారిందే. శ్రీ రంగాచార్యుల వారి స్వీయచరిత్ర 'జీవనపర్వం' ఆయన వైయక్తిక సాధన- సిద్ధుల కైఫియత్తు కాదు. వేర్వేరు కులాల, వృత్తుల, మతాల, అభి మతాల అపూర్వ సంగమం. ఆయన నిష్ఠాగరిష్ఠ శ్రీ వైష్ణవ ఆచార్యుల కుటుంబంలో పుట్టి, పెరిగినా, ఆ సంప్రదాయబద్ధ జీవితాన్నే గడుపుతున్నా, పదిమందితో-పెద్దలతోనూ పిన్నలతోనూ-కలిసి మెలిసి వ్యవహరించిన పురుషోత్తములే. శ్రీరంగాచార్యుల సాంస్కృతిక, ధార్మిక కార్యకలాపాల సేవల వృత్తాంతాల్ని గమనిస్తే, కథాశిల్పి మధురాంతకం రాజారాంగారి 'గ్రూప్ ఫోటో' కథ నా స్మృతిపథంలో మెదుల్తుంది. వారి స్వీయచరిత్రే అయినా 'జీవనపర్వం'. శ్రీరంగాచార్యుల పండిత పామరుల సామూహిక జీవితాల కథనమూ, గ్రథనమూనూ. ఆచార్యుల వారి జీవితాన్ని పరిశీలిస్తే, అది **'స్వాంత స్సుఖాయ, సర్వజనస్సుఖాయ'**గా పరిఢవిల్లిందని తెలుస్తుంది.

శ్రీరంగాచార్యులు తమ తాతముత్తాతల కాలం నాటి కథలు తవ్వి తీస్తూ, అలనాటి ప్రాభవాన్ని తలపోశారు. తండ్రి శ్రీమాన్ రాఘవాచార్యుల కాలానికి పూర్వీకుల ఇనాం భూముల వ్యయం బర్రెతోక అయితే, ఆయం గొర్రెతోకగా మారి, భూములు అయిన కాడికి అమ్ముకో వలసిన దుస్థితి దాపురించింది.

రచయిత 'జీవనపర్వం' లో నెమరు వేసుకున్న చిన్ననాటి జ్ఞాపకాల తరితీపులు అపూర్వం. పితృ పితామహ ప్రపితామహులు నడయాడిన గ్రామాలైన మారేపల్లి, బండ్లపాలెం, చందుపట్లల్లో జరిగే ఉత్సవాల వైభవాన్ని అతిమధురంగా వర్ణించారు గ్రంథకర్త. బండపాలెం స్వయంభువు శ్రీరామచంద్రస్వామి ఉత్సవాల్ని తలుచుకున్న శ్రీరంగాచార్యుల చిన్ననాటి ముచ్చట్లను తిలకించండి-




(జీవనపర్వం. స్వీయచరిత్ర, రచయిత డా. శ్రీరంగాచార్య, పేజీలు: 250, వెల రూ300. ప్రతులకు : డా. శ్రీరంగాచార్య. 1-14-25. హరిపురి కాలనీ. హైదరాబాద్-500102. ఫోన్: 9299451266. ఇంకా నగరంలో అన్ని పుస్తకాల దుకాణాల్లోనూ.)

**"ఉత్సవం చివర్లో మాతాతగారు, నాయనగారు- ముంతల్లో నింపి వుంచిన రూపాయిల బిళ్లలను, చిల్లరలను లెక్కించిన తర్వాత చిన్నపిల్లలమైన మాకు ఒక కుచ్చం (4పైసలు) పెద్దవాళ్లకు 6 పైసలు ఇస్తే, ఎంతో సంతోషంతో దూకాణాల్లోని బెండ్లు బత్తీసాలు, కీసుపిట్టలు (విజిళ్లు) మొదలైనవి కొని ఎంత ఆనందించే వాళ్లమో? దుకాణం వారు కూడా 'మన అయ్యగారి పిల్లలు' అని ఎంతో భక్తి ప్రేమలే గాక, ఔదార్యంతో వస్తువులు ఇచ్చేవారు. నా వరకు ఇప్పటికీ అనాటి కజ్జం మిఠాయి, బొంగు ముద్దుల రుచి జిహ్వాతర్పణంగా మిగిలినాయి. (దొడ్డుగా కారంపూస చేసి, దాన్ని బెల్లంపాకంలో వేసి, ఆరబెట్టిందే కజ్జం మిఠాయి, బొంగులను బెల్లం పాకంలో వేసి గుండ్రంగా ముద్దులు చేసేది- బొంగు ముద్దులు) ఇవి ఒక చిల్లి**

పైసకు ఒకటి చొప్పున జాతరలోనే కాదు, నిరంతరం మావూరి దూకాణాల్లో లభించేవి వీటికి బ్రహ్మదేవర పుల్లయ్య దుకాణం ప్రసిద్ధి (ఈయన ఇప్పటి బ్రహ్మదేవర భద్రయ్య తాత) చైత్ర శుద్ధ పంచమి నుండి చతుర్దశి దాకా జరిగే బ్రహ్మోత్సవాల వైభవం అద్భుతం. దేవాలయంలో సేవల రాత్రిపూట జరిగేవి. కల్యాణ రథోత్సవం, ధ్వజారోహణం నాడు 'గరుడ ముద్ద' (పొంగలి) నిమిత్తం సంతాన కాంక్ష గల మహిళలు స్నానం చేసి తడిబట్టలతో ధ్వజ స్తంభం దగ్గరకు వచ్చి, దండ సమర్పణ చేసి ప్రసాదం తీసుకునేవారు. ఇట్లా ఆ ప్రాంతంలో ఎందరో రామయ్యలు, జానకమ్మలు, లక్ష్మయ్యలు వచ్చినారు." (పేజి: 10)

శ్రీరంగాచార్యులు బాల్య జీవితంలోని మధురిమల్ని మరీమరీ తల్చుకొని ఆనందించారు. ఆనాటి గ్రామ జీవనంలోని పరస్పర మైత్రి, కలిసి కట్టుగా సుఖదుఃఖాల్ని పంచుకునే సామరస్యాన్ని ఇలా వర్ణించారు– "ఉత్సవాలు, శివాలయ పర్వదినాలు, నరసింహస్వామి పూజా విశేషాలు, ఇవే కాక– ఊర బోనాలు (బండ్లు కట్టడం) వన భోజనాల ఊరికి దక్షిణాన వున్న వాగు ఒడ్డు ఇసుకలో ఇటు చందుపట్ల అటు మద్రూరు వారు చేరి బతుకమ్మ కోలాటాలు పాటలతో, గొప్పగా ఆడేవారు.

బతుకమ్మలను వాగునీళ్లలో వదిలేటప్పుడు పొరపాటున స్తాంబాళం నీటిలో పడితే యువకులు దుమికి వాటిని తెచ్చియిచ్చే వారు. పెండ్లి కాని ఆడపిల్లలు లంగా, ఓణీలతోను, ఇతరులు చీరలతో, బాలికలు గౌనులతో వచ్చి, ఆ ఇసుకలో దుముకులాడడం మరుపురాని సన్నివేశం. ఇంకా రామాలయం నుండి గరుడ, హనుమ, అశ్వవాహన సేవలు ఆయా పర్వదినాల్లో బయలుదేరితే గ్రామజనం భక్తి ప్రపత్తులతో భజనలు– పూజలు చేస్తూ స్వామి సేవను అనుసరించే వారు. బతుకమ్మ సంక్రాంతి, దీపావళి, దసరా– వినాయక చవితి, కోర్లపున్నమి, పీర్ల పండుగ, గ్యార్మీ మొదలగు వాటిని అందరూ కలిసి జరుపు కొనేవారు. దేవతోత్సవాల్లో– డప్పు, అరంబాజా, కొమ్ము అనేవి హరిజనుల వాద్యాలు. తరువాత సన్నాయి, దీని తర్వాత భజన బృందం, ఇట్లా దేవతోత్సవాలు, ఊరేగింపులు ఉండేవి. పీర్లపండుగ నిప్పుగుండాలు తొక్కడం, దట్టీలు సమర్పించటంలోను– హిందువులే ముందుండే వారు. ప్రజలు ఏకులం వారైనా పరస్పరం అన్న, అక్క, బావ, మామ, తాత మొదలైన వరుసలు పెట్టి పిల్చుకున్నారు. గ్రామంలో ఎవరింట వివాహమైనా, అందరూ పనులు చేస్తూ అది తమ గృహకార్యంగా భావించి– అక్కడే భోజనాదులు చేసి సంతృప్తి చెందినారుః– ఎవరైనా మరణిస్తే దహనం చేయవలసిన వారైతే చెరువు కట్టకో, గైరాన్ భూములకో వెళ్లి, తమ్ముచెట్లు కొట్టి, బండ్లపైన స్మశాన స్థలికి చేర్చి, అంత్యక్రియలను పూర్తి చేసేవారు. దీనికి అవసరమైన ఇతర వృత్తుల వారు వచ్చి పనులను చేయటం ఆనాడు మామూలుగా వుండేది." (పేజి:40)

గ్రంథకర్త తాను చిన్నప్పుడు చూసిన నాటి గ్రామ సౌందర్యాన్ని వర్ణించిన వైఖరి చూడండి "ఊరి చుట్టూ వ్యవసాయ భూములు– మోట కొట్టే బావులు, పాతబావి బొందులుండేవి. చేదబావులు వీటిపైన బెస్తవారు వలలు వేసి లోపల వున్న పిచ్చుకలు లేచి వలకు చిక్కితే వాటిని పట్టుకొని, కాల్చి అమ్ముకునేవారు. పెరిగిన చెట్లకొమ్మల చివర్లో పిచ్చుకలు గూళ్లు అల్లుకొని గుడ్లు పెట్టి పిల్లలు చేస్తుండేవి. ఉదయాస్తమానాల్లో వాటి కిలకిలారావాలు ఎంతో ఆహ్లాదంగా వుండేవి. గ్రామంలోని చెట్లపైన రకరకాల పక్షులు– ఇండ్లకు చేరే కోళ్ల వీటి ధ్వనులతో అల్లకల్లోలంగా వుండే నీళ్లగుంటలు, కాల్వల్లో వుండే రకరకాల కప్పల బెకబెకలు – ఇట్లా ఉదయాస్తమాన వేళలు గల పల్లెలు, పొలాల్లో ఎండ్రకాయలు, నీరు కట్టెపాములు, జలగలుండేవి. కొండ క్రింద గూడెంలో వడ్ల లచ్చయ్య వుండేవాడు. ఈయన సంచిలో గులేరువాళ్లు వుండేవి. చెట్లపైన వుండే పక్షిని సూటిపెట్టి కొడితే అది కుప్పకూలేది. ఈయన గొప్ప ఖేచర మారణ ధురీణుడు. మా నాయన గారి ఆయుర్వేద మందుల కవసరమైన వివిధ పక్షుల చేదులను త్వరగా తెచ్చియిచ్చే భక్తుడు.

వీటితో పాటు చెట్లపైన కొంగలు, కాకులు, ఇతర పక్షులుండేవి. భూమిపైన రకరకాల తేళ్లు, పాములు, ఉడతలు, ఉడుములు సంచరించేవి. తేలుకాటు, పాము కాటులకు పసర్లు, మంత్రాలే శరణ్యం. మా గుర్తులో ఎన్నో పక్షులను, విష సర్పాలను, జంతువులను, రకరకాల వృక్షాలను చూచినాం. నేడు కాకులు, గద్దలు, బోదలు, గరుడ పక్షులు, చివరకు గ్రామాల్లో పెంచుకునే కోళ్లు, వాటి గుడ్లు, పాడిబర్రెలు – ఆవులు కూడా మాయమైనాయి. అంతా ఒక మాయామేయ జగంలో వుంటున్నాం." (పేజి: 42-43) శ్రీరంగాచార్యుల వారికి ఆకాలం ప్రకృతి సొగసులు– సొబగులు, సుఖ శాంతులు ఈనాడు దుర్లభాలనిపించాయి. నిజమేమరి. "కదిసి కోరినను గతకాలంబు వచ్చునే?" అన్న తాళ్ళపాక అన్నమాచార్యుల వారి సుభాషితం జ్ఞప్తికి తెచ్చుకుని వూరట చెందాల్సిందే కదా!

అప్పట్లో చదువు సంధ్యలు పల్లెల్లో ఎట్లుండేవో తెలుసుకుంటే ఇప్పటి పిల్లలు ఉలిక్కిపడతారు, భయపడతారు, ఇంకా నవ్వుతారేమో? "కూర్చోటానికి ఒక బస్తానో, చిన్నచాపనో పట్టుకొని వెళ్లటం మామూలు. పంతుళ్లపేరెత్తి తేనే భయం. ఇంకా వారు కనపడితే చెప్పతరం కాని భయంతో ఏడుస్తూ పరుగెత్తటం అలవాటు. గ్రామం లోని బడిలో తక్కువ విద్యార్థులున్నా ప్రారంభంలో వీరికి అక్షరాభ్యాసం చేసి చదువు రీతిని తెల్పింది 'జాన్‌ఖాన్' అనే మౌల్వీసాబ్, ఈయన మంచి తెలుగు పండితుడు. వైద్యం తెల్సు. తెలుగు పద్యాలే గాక ఉర్దూ గజళ్లు, పాటలు పాడేవాడు. వీరి పాఠశాల బెస్తబజార్ లోని పెద్ద చింతచెట్టు క్రింద, మంచిగా శతకాలు, పెద్దబాల శిక్ష, బొట్టొరుసలు, గుణింతాలు నేర్పేవాడు. మహాకోపిష్టి. చింతచెట్టు కున్న బరిగె కొమ్మలు ఈయన బెత్తాలైన – మర్దన సాధనాలు.

**మేము చదువుకు వచ్చే వరకు ఈయన కమ్యూనిస్టుల చేతిలో హతమైనాడు. ఐనా మా అన్నయ్యలు, ఊర్లోని ఎందరెందరో 'జాన్ ఖాన్' సార్ ను ఇప్పటికీ తల్చుకుంటారు."** (పేజీ: 47)

శ్రీ రంగాచార్యులు తమ వంశచరిత్ర గురించి **'మా పరంపర'** అనే అధ్యాయంలో వివరంగా చెప్పారు. వీరి తల్లిదండ్రులకు ఐదు మంది కొడుకులు, ఆరు మంది కూతుళ్లు: శ్రీమాన్ రాఘవాచార్యుల వారు గంపెడంత కుటుంబానికి చదువు సంస్కారాలు నేర్పించి, వాళ్లందరినీ ఉత్తమ మనుష్యులుగా తీర్చిదిద్దిన పుణ్యశ్లోకులు.

**'బాల్యం గుర్తులు'** అధ్యాయంలో గ్రంథకర్త చిన్నప్పటి చిలిపి చేష్టలు, తండ్రిగారి ఎదుట చూపే భయభక్తులు ఇంటిపనులు, పొలం పనులు వగైరాకుతుహల కరంగా వ్యక్తమయ్యాయి. తాతగారు గుర్రం మీద స్వారి చేస్తూ శ్లోకాలు, పాశురాలుచెప్తుంటే బాల శ్రీరంగాచార్యులు **"ఏవో బొంకులుబొంకి వాటిని చదువకఎగ్గొటే నేర్పు"** (పేజీ: 80) అలవర్చుకున్నారట. కాని పితృపాదుల ముందర ఈయన ఆటలు నడిచేవి కావుబీ గుగ్గిళ్ల ఉడికేవి కావు. శ్రీరంగాచార్యులుగారు ఆ స్మృతుల్ని ఇలా జ్ఞాపకం చేసుకుంటారు– **"ఇక మా నాయనగారితో వెళితే– నడక కాబట్టి అమరకోశం, అశీర్వచన పనసలు, చిన్న చిన్న జ్యోతిష శ్లోకాలను చెపుతుంటే చదువక తప్పేది కాదు. వారంటే మాకుండే భయం, వారి పరిశీలన చాలా గొప్పగా వుండేది. ఇంతే గాక మా గమ్యమైన గ్రామం చేరిం తర్వాత కూడా వారికి తీరిక కల్గగానే ఏవో శ్లోకాలు మొదలైనవి చెబుతూ మాసంచార బాల్య చేష్టలను నిరోధించేవారు. (ఈవిధమైన విలువగల విద్యను తృణీకరించడం నేటికీ అనుభవిస్తున్న విద్యాబోధలో ఒకటి.)** కేవలం **యింట్లోనే వున్నప్పుడు – మా నాయనగారు శ్లోకాలు, వేద మంత్రాలే గాక– వారికి కంఠపాఠంగా వున్న అనేకానేక పద్యాలను చెప్పుతూ– దోషోచ్ఛారణ రాకుండా జాగ్రత్త పరిస్తేవారి భయం వల్ల చదివిన విషయాలు ఇప్పుడు స్మృతిపథానికి వస్తాయి."** (పేజీ: 80-81) ఆనాటి శిక్షణ ఎంత విలువైనదో! ఆనాటి గురువులు ఎంతటి మహిమాత్ములో కదా!!

బాల శ్రీరంగాచార్యులు హైద్రాబాద్ నగరంలోని సీతారాంబాగ్ వేద సంస్కృత పాఠశాలలో అంతేవాసిగా చేరడం ఆయన విద్యాయాత్ర లోని ఓ గొప్ప మజిలీ. అది కాలక్రమంలో వేదాంత సంస్కృతవర్ధినీ కళాశాలగా పరివర్తన కావడం ఓ చారిత్రాత్మక ఘటన. గ్రంథకర్త మాటల్లో చెప్తే **"అక్కడి అధ్యాపక వర్గమంతా శిష్యహృత్తాపహారులైన సంస్కృత పండితులే. అట్లే హైదరాబాదు నల్లకుంటలో ఖండవల్లి వారు స్థాపించిన ఆంధ్ర ప్రాచ్య కళాశాల లేకుంటే తెలుగు పండితులే లేరని ఘంటాపథంగా చెప్పవచ్చు. వీరుభయులూ (శ్రీమాన్ కోయిల్ కందాడై అప్పన్ శఠకోప రామానుజాచార్యులు, ఖండవల్లి లక్ష్మీరంజనం గారులు) దైవాంశతో భూలోకానికి వచ్చిన బృహస్పతులు. అయితే నా వంటి దౌర్భాగ్యుడు వీరి సంస్కృత బోధన అంతేవాసిత్వానికి నోచుకోలేక పోవటం ఒక లోటు."** (పేజీ: 104)

సీతారాం బాగ్ లోని వేదాంత సంస్కృత కళాశాల పిల్లి తన పిల్లల్ని ఏడిళ్లు తిప్పినట్లుగా, సంచార కళాశాలగా పేరు మోయడం వల్ల అక్కడి విద్యార్థులకు తీపిచేదు అనుభవాలు కలిగాయి. ఆచార్యుల వారు వీటిని రసవత్తరంగా వినిపించారు. ఖండవల్లి లక్ష్మీరంజనం గారు నల్లకుంటలో స్థాపించిన ఆంధ్ర ప్రాచ్య కళాశాలలో డిప్లొమా కోర్సులో చేరడం ఆయన జీవితంలో మహత్తరమైన ఘట్టం. లక్ష్మీరంజనం, చెలమచర్ల రంగాచార్యులు, ఈయుణ్ణి వీర వేంకట రాఘవాచార్యులు, నిడుదవోలు వేంకటరావు, డా. నేలటూరి వేంకట రమణయ్య, ఆదిరాజు వీరభద్రరావు గార్ల లాంటి మహాపండితుల పాఠ ప్రవచనాలు, అతిథి ఉపన్యాసాలు విని డి.ఓ.ఎల్. బి.ఓ.ఎల్. తరగతులు ముగించారు. ఇంకా తెలకపల్లి విశ్వనాథశర్మ, కేశవపంతుల నరసింహశాస్త్రి, రాఘవేంద్రరావు, అనంతాచార్య దేవల్ ప్రభృతుల పాఠాలు ఆచార్యుల వారిలో జ్ఞానతృష్ణను పెంచి, పోషించాయి.

**"ఇట్లా ఎందరో మహానుభావులు– వీరి సన్నిధానంలో నేను చదివింది స్వల్పమే! ఆనాడు వీరి మా గురువులు అని చెప్పుకోవడం మాత్రం ఈ నాటికీ నా కొక గుర్తింపు."** (పేజీ:131) అంటూ రెండు చేతులు జోడిస్తారు వినయమోహనులైన శ్రీరంగాచార్యులు. వీరి గురువులందరూ ఘటానుఘటికులే. కాని ఆచార్య లక్ష్మీరంజనం గారంటే వీరికి కొండంత భక్తి.

**"వారు బెట్టిన తెలుగు సాహిత్య భిక్ష నా జీవన వికాసానికి ఒక వెలుగైంది."** (పేజీ: 132) అంటూ శ్రీరంగాచార్యుల వారు గురుదేవుల్ని స్మరిస్తారు. ఆచార్య లక్ష్మీరంజనం గారి ఆధ్వర్యంలో పండితాగ్రణుల సహకారంతో వెలువడ్డ ఆంధ్ర మహాభారత పరిష్కృత ప్రతి, సంగ్రహాంధ్ర విజ్ఞానకోశము, కాసె సర్వప్పగారి సిద్ధేశ్వర చరిత్రము పరిష్కృత ప్రతి ప్రచురణలో పాలుపంచుకున్న శ్రీరంగాచార్యుల వారికా అనుభవం భవిష్యత్తులో ప్రాచీన కావ్య పరిష్కరణ భవన నిర్మాణానికి పునాది రాయి అయ్యింది. **"ఒక్కొక్క యడుగే వొగి ముందర బెట్టితే యెక్కువై కొండైనా నెక్కు గొనకు"** అని తాళ్ళపాక వారన్నట్లు నిరంతర అధ్యయనం, అనుశీలనాల వల్ల శ్రీరంగాచార్యులు కాలక్రమంలో ప్రాచీన కావ్య పాఠపరిష్కరణా క్షేత్రంలో గణుతికెక్కారు.

వీరికి కళాశాలకు ముందు ప్రసిద్ధ శాసన శాస్త్ర వేత్తలు, పరిశోధన ప్రముఖులైన బి. ఎన్. శాస్త్రిగారి సాహచర్యం శ్రీరంగాచార్యుల వారిలో చరిత్ర పట్ల ఆసక్తిని ఆమ్రేడితం చేసింది. నల్లగొండ, అదిలాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల సర్వస్వాల విషయ సేకరణలో, రచనలో వీరు శాస్త్రిగారికి సైదోడుగా సహకరించారు. వీరికి బి.ఎన్.శాస్త్రి గారి పరిశోధన, పాండిత్యం, ప్రచురణా సామర్థ్యం పట్ల ఎనలేని గౌరవం. వీరికి కళాశాల విద్యాభ్యాసం రోజుల్లో వే. నరసింహారెడ్డి,

వరవరరావు, బద్ధం భాస్కర రెడ్డి (చెరబండ రాజు), జ్వాలాముఖి లాంటి వికాసోన్ముఖుల పరిచయం కలిగింది. విభిన్న సాహిత్య ధోరణుల, మనస్తత్వాల వాళ్లతో కలిసి తామరాకు మీది హిమబిందువులా కొంత కాలమైనా గడపగలిగే విలక్షణ సంస్కారం వీరికి అలవడటం మెచ్చదగ్గ విషయం. రావి నారాయణరెడ్డి, కాళోజి, తెన్నేటి విశ్వనాథం, తరిమెళ్ళ నాగిరెడ్డి మొదలైన రాజకీయ నాయకుల అల్ప పరిచయం ఆచార్యుల దృష్టిని విశాలతరం చేసిందే కాని సంకుచితం చేయలేదు.

శ్రీరంగాచార్యులు 1966 ఆగష్టు 3వ తేదీన పాలెంలోని ప్రాచ్య కళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా చేరారు. పాలెం ఆయన కర్మభూమి అయింది. ముప్పై ఆరు సంవత్సరాల పాటు (1966-2002) పాలెం ప్రాచ్య కళాశాల ఆయన్ను పెంచి పోషించింది. కళాశాల సంస్థాపకులైన పాలెం సుబ్బయ్య ఆశీర్వాదం, కపిలవాయి లింగమూర్తి లాంటి సహోద్యోగుల సహకారాల వల్ల పాలెం ప్రాచ్య కళాశాల సర్వతోముఖాభివృద్ధికి యథాశక్తిగా తోడ్పడ్డారు శ్రీరంగాచార్యుల వారు. వీరికి దైవానుగ్రహం వల్ల విశిష్ట **'సాహిత్య విద్యాగురు పరంపర'** (పేజి: 136) సిద్ధించింది. అట్లే వీరికి కసిరెడ్డి వెంకటరెడ్డి, యాదగిరి, రుక్నుద్దీన్, గిరిజా మనోహర్ బాబు, వెలుదండ నిత్యానందరావు లాంటి ప్రబుద్ధ శిష్యులు తామరతంపరగా లభించారు. కాని ఇప్పటి ఆచార్యవర్యులకు ఉభయతారకమైన ఆ అదృష్టలబ్ధి సిద్ధిస్తుందంటారా?

డా. శ్రీరంగాచార్యులు సాహిత్య క్షేత్రంలో పండించిన పంటలు విలువైనవే. పోతే, ప్రాచీనాంధ్ర కావ్యాల పరిష్కరణ వీరి ప్రధాన కార్యక్షేత్రం కావడం వల్ల పాఠకలోకమూ పరిమితిమై పోయింది. పైగా విమర్శకుల ఆలోచన ప్రభ కూడా మందగించింది. అయితే ఆచార్యుల వారు వివిధ గ్రంథాలకు రాసిన పీఠికలు, వాటిపై చేసిన సమీక్షలు వారిని తెలుగు సాహిత్య ప్రపంచంలో మహా విద్వాంసులు గానూ, గుణ గ్రహణ పారీణులు గానూ సుభద్రంగా ప్రతిష్ఠింప చేశాయి.

డా. శ్రీరంగాచార్యుల 'జీవనపర్వం' చివర్లో వీరి పుస్తకాల, ప్రత్యేక సంచికల సంపాదకత్వాల, పీఠికల, గ్రంథ సమీక్షల, వ్యాసాల సుదీర్ఘమైన పట్టికలు పండిత ప్రకాండుల్ని కూడా ఆశ్చర్యపరుస్తాయి.

డా. శ్రీరంగాచార్యుల వారి స్వీయచరిత్ర 'జీవనపర్వం' ఆయన జీవితంలోని మిట్టపల్లాల్ని దర్శింప చేస్తుంది. వంశ పారంపర్య ఘనతను ఉగ్గడిస్తుంది. తెలంగాణ పల్లె ప్రజల జీవనోత్సాహాన్నీ, గుండె దిటవునూ చాటుతుంది. రజాకార్ల దుండగాల్నీ, కమ్యూనిస్టుల ఆగడాల్నీ, సామాన్య ప్రజల అసహాయ ఆక్రందనల్నీ నమోదు చేస్తుంది. అంతేకాక ఒక సామాన్య వ్యక్తి జిజీవిష, జిగీషల్ని అక్షరబద్ధం చేస్తుంది.

విశుద్ధ జీవనులు, విశిష్ట విద్వాంసులైన డా. శ్రీపెరంబుదూరు రంగాచార్యులుగారిని తాళ్ళపాక అన్నమాచార్యుల వారి ఈ మంగళా శాసనంతో మనసారా అభినందిస్తున్నాను **"త్రికరణశుద్ధిగా జేసిన పనులకు దేవుడు మెచ్చును లోకము మెచ్చును."**





# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**




**సంప్రదించండి.**

**మూసీ మాసపత్రిక**

**ఫోన్ : 934 7971177**







**తర్కం (కవిత్వం)**
సోని కట్కూరి
వెల : 150 /-
**ప్రతులకు :** రచయిత
ఫోన్ : 837 426 1002




**డియర్ జిందగీ**
మెర్సీ మార్గరెట్
వెల : 185/-
**ప్రతులకు :** రచయిత్రి
ఫోన్ : 905 280 9952

స్వ'కృతి'




**34 గోఖలే రోడ్ నార్త్**
డా. తాటి నరహరి, ముంబై
వెల : 150 /-
**ప్రతులకు :** 1604, బెల్లెజ్జా, 16వ అంతస్తు,
భవానీ శంకర్ రోడ్, దాదర్ (వెస్ట్),
ముంబై - 400 028
ఫోన్ : 093224 00551




**ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి జీవితం - రచనలు**
- డా. కుమ్మెత లక్ష్మీనారాయణ రెడ్డి
వెల : 350 /-
**ప్రతులకు :** హర్ష శరవణ్ పబ్లికేషన్స్,
రేగడి పల్లె (గ్రామం అండ్ పోస్ట్),
ఆర్.యస్. కొండాపురం (మండలం)
వై.ఎస్.ఆర్. కడప జిల్లా - 516 474.
ఫోన్ : 995 971 0078




**కీర్తి కందూతి (నాటకం)**
- పల్లెర్ల రామమోహన రావు
వెల : అమూల్యం
**ప్రతులకు :** పల్లెర్ల రామమోహన రావు,
4-3-5, తూర్పు కమాను,
మహబూబ్ నగర్ - 509 001.
ఫోన్ : 91778 40278




**సాహితీ శైలం (ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి అభినందన సంచిక)**
- డా. కుమ్మెత లక్ష్మీనారాయణ రెడ్డి
వెల : 350 /-
**ప్రతులకు :** హర్ష శరవణ్ పబ్లికేషన్స్,
ఫోన్ : 995 971 0078

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.

చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట,
హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 3 62 హైదరాబాద్ జనవరి : 2023

# నన్ను నేనే ఆవిష్కరించుకుంటూ...



నీవు నన్ను విడిచి వెళ్ళావు
నేను నీ జ్ఞాపకాల దొంతరలో
కన్నీటితో తడిసి ముద్దవుతున్నా...

ధైర్యమే నాసాహసం
నా ఆయుధం...
అందుకే హాయిగా జీవిస్తున్నా...

ఆకాశమంత
అందనంత దూరంలో
నీవు ఉండాలనుకోవడం
స్వార్థానికి పరాకాష్ట..

నేను చీకటి ప్రపంచంలో
నిర్భీకతతో నిర్వేదంగా
నిర్భయంగా జీవిస్తున్నా....

నన్ను విడచి వెళ్ళి
నీ వేమి సాధిస్తావో
నా విజ్ఞాన మేధస్సుకు
అర్థం కావటం లేదు

"అర్థమే" పరమార్థమైతే
నేనే నీయావదాస్తని
నీ మట్టిబుర్రకు ఏంతెలుసు?

మనిషి తెలుపు కాదు
మనసు తెలుపన్న సంగతి
బహుశా నీకు తెలియదేమో
పుట్టుక గిట్టుక మధ్యలోనిదే
జీవితం...

కానీ నిజంతెలియక
నీ భ్రమలో నీవు మున్గి
పోయావు...

అనంతమైన ప్రేమలో
స్వార్థముంటే
నీకు నీవు పతనమైనట్లే!

నా హృదయ భావనలన్ని
తెలిసిన నీకు
నిజమైన ప్రేమాస్తి నొదలి
అశాశ్వతమైన ఆస్తికి
లొంగిపోవడం
దిగజారుడుతనాన్ని
తెలియచేస్తుంది...



నానుండి దూరమైన నీవు
నా ప్రేమబంధం వదిలిన
నా హృదయంలో
క్రొత్తగా నన్ను నేను నేనుగా
ఆవిష్కరించుకుంటూ...

నీ రాక నా మనోమందిరంలో
రాకా సుధ వెన్నెలలతో
పరిపూర్ణం చేస్తుందన్న
చిన్న ఆశాదీపం
మిణుకు మిణుకు మంటుందీ ప్రేయసీ.!

పీటముడి వేసుకొని
కూర్చున్న నీవు
వెళ్ళిన నీకు రావడం తెలియనిదా...!!





**డా. జీవస్వీ**
పెద్దపల్లి, ఫోన్ : 9490 145 913


ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం
మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?
అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?
సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.
మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.
7416 106 106
www.ferty9.com
IUI
IVF
ICSI
IMSI
HSG
ఫర్టీ 9
హాస్పిటల్ మరియు
పరిశోధన కేంద్రం
మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...
విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్